అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 29-9-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 | సంచిక : 268 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

హరిత విప్లవ పితామహుడు
ఇక లేరు
చెన్నైలోని స్వగృహంలో స్వామినాథన్ కన్నుమూత
పలువురు ప్రముఖుల సంతాపం



చెన్నై : హరిత విప్లవ పితామహుడు, వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణుడు ఎంఎస్. స్వామినాథన్ (98) ఇక లేరు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం 11.20 గంటలకు చెన్నైలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆహార రంగంలో దేశం స్వయం సమృద్ధి సాధించేందుకు, ఆకలిని, పేదరికాన్ని పారద్రోలేందుకు ఆయన ఎన్నో పరిశోధనలు చేశారు. అధిక దిగుబడిని అందించే వరి, గోధుమ వంగడాలను అందించి దేశానికి ఎంతో మేలు చేకూర్చారు. స్వామినాథన్ మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు ప్రముఖులు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

స్వామినాథన్ 1925 ఆగస్ట్ 7న తమిళనాడులోని కుంభకోణంలో జన్మించారు. ప్రాథమిక విద్య, మెట్రిక్యులేషన్‌ను అక్కడే పూర్తి చేశారు. తండ్రి వైద్యుడు కావడంతో ఆయన కూడా వైద్య విద్యలోనే ప్రవేశించారు. అయితే 1943లో బెంగాల్‌లో సంభవించిన కరవు కాటకాలను చూసి చలించిపోయి వైద్య విద్యకు స్వస్తి చెప్పి, వ్యవసాయ రంగం వైపు అడుగులు వేశారు. త్రివేండ్రంలోని మహారాజా కళాశాలలో జువాలజీ కోర్సులో చేరి అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత మద్రాసు వ్యవసాయ కళాశాలలో చేరి డిగ్రీ చదివారు.

1949లో ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ నుండి సైటో జెనెటిక్స్‌లో పీజీ చేశారు. ఆ తర్వాత నెదర్లాండ్స్ వెళ్లి అక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బంగాళదుంపల జన్యువులపై పరిశోధనలు చేశారు. 1950లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన ప్లాంట్ బ్రీడింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి ...13లో

ప్రముఖుల సంతాపం

స్వామినాథన్ మరణం తనను ఎంతగానో కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. ఆహార భద్రత కోసం ఆయన అలుపెరుగని కృషి చేశారని కొనియాడారు. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో దేశం స్వయంసమృద్ధి సాధించడంలో ఆయన పాత్ర మరువలేనిదని అన్నారు. స్వామినాథన్ మరణం పట్ల ప్రధాని మోడీ విచారం వ్యక్తం చేశారు. దేశం క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు వ్యవసాయ రంగంలో ఆయన చేసిన కృషి లక్షలాది మంది జీవితాలను మార్చిందని, దేశానికి ఆహార భద్రతను కల్పించిందని కొనియాడారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్వామినాథన్ మరణం పట్ల సంతాపం తెలిపారు. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని రైతు సంఘాల నేతలు అన్నారు.

వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయింది : సీఎం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత హరిత విప్లవ పితామహుడు, ప్రపంచ ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆయన మరణంతో దేశ వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధారిత దేశంలో మెజారిటీ ప్రజల జీవనాధారం, ప్రజల సాంస్కృతిక జీవన విధానం వ్యవసాయ రంగంతో ముడివడి ఉన్నదనే ...13లో

దేశానికి తీరనిలోటు : సీపీఐ(ఎం)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత హరిత విప్లవ సారథి, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ (98) మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 1965 నుంచి 1985 వరకు భారతదేశంలో హరిత విప్లవాన్ని కొనసాగించి ఆహార ఉత్పత్తిలో దేశాన్ని స్వయంసమృద్ధం చేసిన శాస్త్రవేత్తగా స్వామినాథన్ పేరొందారని గుర్తు చేశారు. 1965లో స్వామినాథన్ ఆధ్వర్యంలో హరిత విప్లవం ...13లో

అణచివేస్తున్నారు
ఎఫ్‌ఏటీఎఫ్ సిఫార్సులను దుర్వినియోగం చేస్తున్నారు
- మోడీ ప్రభుత్వంపై ఆమ్నెస్టీ ఆగ్రహం



కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పౌర సమాజ బృందాలను, కార్యకర్తలను అణచివేస్తోందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ విమర్శించింది. ఇందుకోసం ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) చేసిన సిఫార్సులను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎఫ్ఏటీఎఫ్ సిఫార్సులను ఆధారంగా చేసుకొని క్రూరమైన చట్టాలను అమలు చేసేందుకు అధికారులు పూనుకుంటున్నారని, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల కార్యకలాపాలను అడ్డుకుంటూ వాటిపై ఉగ్రవాద సంబంధమైన ఆరోపణలు మోపుతున్నారని తెలిపింది.

న్యూఢిల్లీ : 'ఉగ్రవాదంపై పోరాటం సాగించే పేరుతో మోడీ ప్రభుత్వం ఎఫ్ఏటీఎఫ్ సిఫార్సులను వాడుకుంటోంది. ఆర్థిక, ఉగ్రవాద నిరోధక చట్టాలను దుర్వినియోగం చేస్తూ విమర్శకుల నోళ్లు మూయించే ప్రయత్నం చేస్తోంది. తన సిఫార్సుల దుర్వినియోగంపై ప్రభుత్వాధికారులను ఎఫ్ఏటీఎఫ్ బాధ్యులను చేయాలి' అని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ బోర్డు అధ్యక్షుడు ఆకార్ పటేల్ పత్రికా ప్రకటనలో కోరారు. చట్టాలను దుర్వినియోగం చేయడం ద్వారా ఎఫ్ఏటీఎఫ్ ప్రమాణాలకు, అంతర్జాతీయ మానవ హక్కుల చట్టానికి అనుగుణంగా వ్యవహరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎఫ్ఏటీఎఫ్ 37 సభ్య దేశాలతో ఏర్పడిన అంతర్ ప్రభుత్వ సంస్థ. అంతర్జాతీయ మనీ లాండరింగ్, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం వంటి అంశాలపై సభ్య దేశాలకు సిఫార్సులు చేస్తుంది. మన దేశం 2010 నుండీ ఈ సంస్థలో సభ్యురాలిగా ఉంటోంది.

అట్టడుగు వర్గాల ప్రజలు, మైనారిటీలు, వాతావరణ మార్పులు వంటి వాటిపై పనిచేస్తున్న 16 స్వచ్ఛంద సంస్థలలో 11 సంస్థల లైసెన్సులను ప్రభుత్వం ఏకపక్షంగా రద్దు చేసింది. విదేశీ నిధులు పొందాలంటే స్వచ్ఛంద సంస్థలకు ఈ లైసెన్సు తప్పనిసరి. గత దశాబ్ద కాలంలో దేశంలోని 20,600 ఎన్‌జీఓల లైసెన్సులు రద్దు చేశారు. 2022 నుండే ఆరు వేల సంస్థల లైసెన్సులు రద్దయ్యాయి. లైసెన్సుల రద్దుకు అధికారులు కుంటిసాకులు చెబుతున్నారు. ప్రభుత్వ సంస్థల ప్రతిష్టను దిగజారుస్తున్నాయని, ప్రజలు లేదా దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధాల కారణంగా అనేక ఎన్‌జీఓలు తమ సిబ్బంది సంఖ్యను 50-80% మేర తగ్గించుకుంటున్నాయని అమ్నెస్టీ తెలిపింది. 'మా కార్యకలాపాలన్నీ దాదాపుగా నిలిచిపోయాయి. మాకు వ్యతిరేకంగా పెట్టిన కేసుల విషయంలో న్యాయస్థానాలలో పోరాడడానికే పరిమితమయ్యాము' అని ఓ ఎన్‌జీఓ నిర్వాహకుడు చెప్పారు.

చట్టాలను రద్దు చేయాలి : ఆమ్నెస్టీ

ఉపా, పీఎంఎల్ఏ, ఎఫ్‌సీఆర్ఏ చట్టాలను రద్దు చేయాలని లేదా వాటిని అంతర్జాతీయ మానవ హక్కుల ప్రమాణాలకు అనుగుణంగా సవరించాలని ఆమ్నెస్టీ సిఫార్సు చేసింది. భీమా కోరెగావ్ కేసులో ముస్లిం విద్యార్థి ఉమర్ ఖలీద్, కాశ్మీర్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త ఖుర్రమ్ పర్వేజ్, పాత్రికేయుడు ఇర్ఫాన్ మెహ్రాజ్, మరో 16 మంది 2018 నుంచి ఎలాంటి విచారణ లేకుండా జైలులో మగ్గుతున్నారని, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేశారంటూ వారిపై ఆరోపణలు మోపారని తెలిపింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు మోడీ ప్రభుత్వం పీఎంఎల్ఏను ఉపయోగించింది. దీంతో ఆ సంస్థ భారత్‌లో 2020 సెప్టెంబర్ నుంచి కార్యకలాపాలను నిలిపివేసింది. ఇలాంటి చర్యల వెనుక ఉన్నది రాజకీయ ఉద్దేశాలేనని, అంతర్జాతీయ సంస్థల పట్ల వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించేందుకే ఇలా చేస్తున్నారని పటేల్ చెప్పారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి
ప్రధాని ఏ మొఖం పెట్టుకుని వస్తున్నారు?
- కాంగ్రెస్ నేతలవి జూటా మాటలు
- ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- మరిపెడ, నర్సంపేట, ములుగులో పర్యటన



నవతెలంగాణ - మరిపెడ/నర్సంపేట/ములుగు

మోటార్లకు మీటర్లు పెడతామని రైతును ఇబ్బందులకు గురి చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఏ మొఖం పెట్టుకొని ప్రధాని మహబూబ్ నగర్‌కు వస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారని తెలిపారు. గురువారం వరంగల్, ములుగు మహబూబాబాద్ జిల్లాల్లో మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడలో తొర్రూరు, మరిపెడ 100 పడకల ఆస్పత్రుల నిర్మాణాలకు, వరంగల్ జిల్లా నర్సంపేటలో ప్రభుత్వం ఇటీవల రూ.183 కోట్లతో మంజూరు చేసిన వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారు. వైద్య కళాశాల నిర్మాణ పనులకు, 33/11 కేవి సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.21.27లక్షలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక ...13లో

గణపతికి..ఘన వీడ్కోలు
ప్రశాంతంగా నిమజ్జనం
- భారీ భద్రత, వార్ రూం నుంచి పర్యవేక్షణ
- హుస్సేన్‌సాగర్‌లో వేడుకగా నిమజ్జనోత్సవం
- వర్షంలోనూ సాగిన శోభాయాత్రలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరదారులన్నీ ట్యాంక్‌బండ్‌కు మళ్లాయి. గణపతి బప్పా మోరియా నినాదాలతో నగరం మారు మోగింది. డప్పుల చప్పుళ్లు, నృత్యాలు, పీకల మోతల మధ్య జై బోలో గణేష్ అంటూ కేరింతల మధ్య ట్యాంక్ బండ్ హోరెత్తింది. వర్షంలోనూ వినాయక శోభయాత్రలు కొనసాగాయి. జనం ఆటలు, పాటలతో హుస్సేన్‌సాగర్ తీరంలో సందడి నెలకొంది. ఖైరతాబాద్ మహాగణపతికి ఘన వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు గణనాథుల నిమజ్జనం కొనసాగింది. చిన్న గణనాథులతోపాటు పెద్దపెద్ద గణనాథులు జనాన్ని ...5లో

కిటెక్స్ సంస్థకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన
రూ.1200 కోట్ల పెట్టుబడితో ప్రారంభం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో భారీ తయారీ యూనిట్‌కు కిటెక్స్ సంస్థ పూనుకున్నది. గురువారం రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో కిటెక్స్ సంస్థ తన ఇంటిగ్రేటెడ్ ఫైబర్ టు అప్పారెల్ తయారీ క్లస్టర్‌ను ఆ సంస్థ చైర్మెన్ సాబుజేకబ్‌తో కలిసి మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రాష్ట్రంలో తన పెట్టుబడులను భారీగా విస్తరించి, పెద్ద ఎత్తున ...13లో



వెన్నంటే ఉంటాం
ఇంటి స్థలం దక్కేవరకూ పోరాడుదాం : కేరళ ఎంపీ డాక్టర్ వి.శివదాసన్
- పేదల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య



నవతెలంగాణ-ములుగు డెస్క్

వాజేడు మండలంలోని సర్వే నెంబర్ 11లో ఇంటి జాగా కోసం పోరాటం చేస్తున్న పేదలకు స్థలాలు దక్కే వరకు వెన్నంటే ఉంటామని కేరళ ఎంపీ డాక్టర్ వి.శివదాసన్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ములుగు జిల్లా వాజేడులో భూపోరాట ప్రాంతంలో "కూలి రేట్లు-ఉపాధి అవకాశాలు- భూ సమస్య"పై గ్యానం వాసు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. పేదలకు భూములు ఇవ్వడానికి ముందుకు రాని ప్రభుత్వాలు అంబానీకి, ఆదాని కార్పోరేట్ శక్తులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ప్రభుత్వ భూములను అంటగడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఇంటి జాగా ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖంగా లేదన్నారు. ఇదే స్థలాన్ని పెట్టుబడిదారులు ఆక్రమిస్తే వెంటనే వంపకాలు చేసేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రూపాయలు రాయితీలు ప్రకటిస్తూ.. పేదలపై నిత్యావసర వస్తువుల ...13లో



కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి
ఆయనతోపాటే కుమారుడు రోహిత్
బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్ కూడా

న్యూఢిల్లీ : బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో బీఆర్ఎస్‌కు చెందిన బిగ్ షాట్‌లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో వీరంతా కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఖర్గే వీరందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాగా ఢిల్లీలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్ ఛార్జి మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి , సీనియర్ నేత షబ్బీర్ అలీ, ...13లో

సారీ.. రిస్క్ తీసుకోలేం
గెలుపే ముఖ్యం...గెలిచే వారికే టికెట్లు
- మీక్కావాలా? కుటుంబ సభ్యులకా? తేల్చుకోండి
- పైరవీలు పని చేయవు...పని చేస్తేనే పదవులు
- సీనియర్లకు కాంగ్రెస్ అధిష్టానం ఝలక్
- మైనంపల్లికి మూడు టికెట్లు ఎలా? అంటూ కొందరు సీనియర్‌ల కినుక !

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం దిశగా కాంగ్రెస్ పార్టీ అచీతూచీ అడుగులేస్తున్నది. బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఆలోచనకు చెక్‌పెట్టేందుకు కాంగ్రెస్ అధిష్టానమే డైరెక్టుగా రంగంలో దిగింది. ఈసారి 'చేయి' జారకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నది. అన్నిస్థాయిల్లోనూ పైరవీలను నియంత్రిస్తోంది. టికెట్ల కోసం హస్తినలో మకాం వేసిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. 'ఢిల్లీలో ఏ గడప తొక్కినా...టికెట్ల విషయంలో మేం రిస్క్ తీసుకోలేం...వదిలేయండి...అధికారంలోకి వచ్చాక మాట్లాడుకుందాం' అంటూ మర్యాదగా పంపిస్తున్నట్టు నేతలు చెబుతున్నారు. టికెట్ల విషయంలో తాము రిస్క్ తీసుకుంటే, ఎన్నికల్లో పార్టీ కుప్పకూలుతుందని అధినేతలు వారిని హెచ్చరిస్తున్నారు. బీఆర్ఎస్‌తో నేరుగా తలపడి గెలిచే అభ్యర్థులతోనే నాయకులే లక్ష్యంగా కాంగ్రెస్ ఎన్నికల్లో రణరంగంలోకి దిగుతుందని మొహంమీదనే చెప్పేస్తున్నారు. టికెట్టు ఇచ్చిన తర్వాత కూడా అవసరమైతే బిఫామ్ మారే అవకాశం ఉంటుందన్న సంకేతాలు ఇస్తున్నారు. టార్గెట్ మిస్సవ్వకుండా కారును ఢీ కొట్టాలని చెబుతున్నారు. ఏఐసీసీ టికెట్టు ఇచ్చిన తర్వాత అభ్యర్థి మావోడు కాదు...మా సామాజికవర్గం కాదు...ఆయనతో తమకు సంబంధం లేదు... ఆయన తరపున మేమెట్లా ప్రచారం చేస్తామనుకునే వారిని కూడా ఏఐసీసీ ఓ కంట కనిపెడుతున్నది. అధికార బీఆర్ఎస్ అంగ, ఆర్థిక బలాన్ని ధీటుగా ఎదుర్కొనే నాయకులే ఈ పరిస్థితుల్లో అవసరమని భావిస్తోంది. మొత్తంగా అన్ని ఒడపోతలు పూర్తి చేసి గెలుపు గుర్రాల వైపే మొగ్గు చూపుతున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకోసం 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేవి ఎన్ని సీట్లు? వాటి జాబితా ఇవ్వండి? ...13లో

ప్రపంచ గమనం

రష్యా, చైనాలపై యుద్ధం చేసే సత్తా అమెరికాకు ఉందా?



నెల్లూరు నరసింహారావు

పశ్చిమ దేశాల మీడియా తలపై పెట్టుకుని ఊరేగిన ఉక్రెయిన్ ప్రతిదాడి ఈ సంవత్సరం జూన్ లో మొదలై మూడు నెలలుగా తడబడుతుండటం ప్రపంచానికి తెలిసిపోయింది. అయితే ఈ ప్రతిదాడి ఉక్రెయిన్ సైనిక దళాల పరిస్థితినే కాకుండా ఈ యుద్ధాన్ని వెనుక నుంచి నడుపుతున్న అమెరికా బలహీనతను కూడా బహిర్గతం చేసింది. ఇదేదో ఆకస్మికంగా జరిగిన విషయమేమీ కాదు. లక్షలాది కోట్ల రక్షణ బడ్జెట్ల దన్ను ఉన్నప్పటికీ ఒక బలమైన దేశంతో యుద్ధం చేయటం అమెరికాకు అంత తేలిక కాదని అనేక విశ్లేషణా నివేదికలు పదేపదే తెలియజేస్తూనే ఉన్నాయి. ఏదో ఒక మూడవ ప్రపంచ దేశాన్ని కాకుండా ఒక బలమైన శత్రువుతో తలపడినప్పుడు సూటిగా లక్ష్యాలను ఛేదించే ఆయుధాలు, గూఢచర్యం, లక్ష్యాలను చేరుకునే సామర్థ్యం ఉండటంతోనే అమెరికాకు సరిపోదని అనేకమంది నిష్ణాతులు చెప్పారు. సోవియట్ యూనియన్ పతనం తరువాత అమెరికాకు శత్రుశేషం అంటూ లేకుండా పోయింది. రష్యా ప్రధాన శత్రువు పాత్రను ధరించలేదు. చైనాకు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలనే యావతప్ప అమెరికాతో పోటీపడే ఆలోచనే లేదు. దానితో అమెరికా సైన్యం సంఖ్యాపరంగా కుదింపుకు గురవటమే కాకుండా అమెరికాకు అంతకుముందున్న ఆయుధ సంపత్తికూడా పెద్ద ఎత్తున తగ్గిపోయింది. వేలకువేల ట్యాంకులు, విమానాలు, ఫిరంగులు, వేల నౌకలు, లక్షలాది టన్నుల మందుగుండు, ఇతర సైనిక ఆస్తులను అమ్మటమో లేక ధ్వంసం చేయటమో జరిగింది. అయితే రాబోయే దశాబ్దాలలో పరిస్థితులు మారే అవకాశం ఉన్నదని ప్రముఖ దౌత్యవేత్త జార్జి కెన్నన్ లాంటివాళ్ళు హెచ్చరించారు. ముఖ్యంగా నాటోను విస్తరించటమనే పెద్ద తప్పువల్ల భవిష్యత్తులో రష్యాతో సంబంధాలు దెబ్బతింటాయని 1997లోనే కెన్నన్ చెప్పాడు. అయితే అప్పట్లో అటువంటి హెచ్చరికలు అమెరికాకు అస్పష్టమైనవిగా తోచాయి. దానితో 2010కల్లా ప్రాబల్య రాజ్యాలమధ్య పోటీ నెలకొనేటప్పటికి అమెరికా, దాని మిత్రదేశాలకు తాము ఆదమరచి ఉన్నామనే విషయం అర్థమైంది.

సైనిక వ్యవస్థలో జరిగిన మార్పుల వల్ల అమెరికాకు రెండు పర్యవసానాలు ఎదురయ్యాయి. సైన్యం పరిమాణమే తగ్గిపోవటం మొదటిది, తమకు కావలసిన సైన్యాన్ని సమకూర్చుకోగల సామర్థ్యం, అలా సమకూర్చుకోదలచినపుడు కావలసిన శిక్షణను ఇవ్వగలిగిన సామర్థ్యం అమెరికాకు కొరవడటం రెండవది. ఈ పరిస్థితి సైన్యానికే కాకుండా వాయు సేనకు, నౌకాదళానికి కూడా ఎదురైంది. వివిధ దళాలకు కావలసిన దీర్ఘశ్రేణి ఆయుధాలను ఆచరణలో అందించే పరిస్థితి లేకుండా పోయింది. స్థానిక యుద్ధాలు చేయటానికి సరిపడా సైనిక యంత్రాంగం ఉండటంవేరు, ఒక ప్రధాన దేశాన్ని ఎదుర్కోవటానికి కావలసిన యంత్రాంగం వేరు. ఇప్పటి పరిస్థితుల్లో అమెరికా దగ్గర ఒక వారం రోజులపాటు ఒక ప్రధాన శత్రుదేశంతో తలపడటానికి కావలసిన ఆయుధ సంపత్తికూడా లేదనేది సుస్పష్టం.

అమెరికన్ వాయుసేన, సైన్యంతోపాటు నౌకాదళం కూడా యుద్ధ సన్నద్ధత సామర్థ్యాన్ని కోల్పోయింది. దీనితోపాటు ఉత్పత్తి సామర్థ్యం కూడా కొరవడింది. ఒకప్పుడు వాణిజ్య నౌకా నిర్మాణంలో అమెరికా అగ్రభాగాన ఉండేది. అటువంటి అంతస్థును అమెరికా కోల్పోయింది. ఆధునిక ఉత్పత్తికి కావలసిన సౌకర్యాలుగానీ, నైపుణ్యాలుగానీ నేటి అమెరికాలో లేవు. నేడు ప్రపంచ వాణిజ్య నౌకా నిర్మాణంలో మూడు ఆసియా దేశాలకు 93శాతం వాటావుంది. ఈ మూడు దేశాలలో చైనాకు 47శాతం, దక్షిణ కొరియాకు 30శాతం, జపాన్ కు 17శాతం వాటావుంది. దక్షిణ కొరియా, జపాన్ అమెరికాకు మిత్రదేశాలైనా వాటికి వేగంగా సైనిక శక్తిని జోడించే సామర్థ్యం లేదు. ఈలోపు అమెరికా కూడా తన సైన్యానికి, వాయుసేనకు, నౌకాదళానికి కావలసిన ఆయుధాలను, యంత్ర సామాగ్రిని వేగంగా ఉత్పత్తి చేయగల సామర్థ్యాన్ని మెరుగుపర్చుకోలేకపోతోంది.

పైన పేర్కొన్న విషయాలతో అమెరికా సతమతమౌతోందంటే దాని ప్రత్యర్థి దేశాలలో అంతా బాగున్నట్టు కాదు. సోవియట్ పతనం తరువాత రష్యా సైన్యంలో జరుగుతున్న సంస్కరణలు అసమగ్రంగా ఉన్నాయి. రష్యా మిలిటరీ పరిశ్రమలో గూఢచార, కమ్యూనికేషన్ల వ్యవస్థ, లక్ష్యాలను ఛేదించటంలో ఆధునీకరణ సమస్య ఉంది. అయితే పెద్ద ఎత్తున యుద్ధంలో పాల్గొనే అవకాశాన్ని రష్యా మిలిటరీ ఎన్నడూ విస్మరించలేదు. అందుకే రష్యావద్ద అపారమైన ఆయుధ నిల్వలు ఉన్నాయి. సైనిక ఉత్పత్తులను వేగవంతం చేసే సామర్థ్యాన్ని రష్యా కోల్పోలేదు. ఉక్రెయిన్ పైన నాటో కన్ను పడేదాకా పెద్ద యుద్ధం సంభవిస్తుందని రష్యా ఊహించలేదు. అయితే అమెరికా నాయకత్వంలోని పశ్చిమ దేశాలు రష్యా యుద్ధ సన్నద్ధతను తక్కువగా అంచనావేశాయి. ఈలోపు చైనా సైనిక సన్నద్ధత గురించి ఊహాగానాలేగానీ వాస్తవాలు అంతగా తెలియదు. 1979లో వియత్నాంతో ఏదో తేలికపాటి యుద్ధం చేసిన చరిత్ర మాత్రమే చైనాకు ఉంది. అయినప్పటికీ చైనాకున్న సైనిక సంస్కృతి రష్యా నుంచి వచ్చింది. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటన్ తన సామ్రాజ్యాన్ని రక్షించుకోవటానికి అమెరికా సహకారాన్ని తీసుకుంది. ఆ కాలంలో జర్మనీ, జపాన్, సోవియట్ యూనియన్, బ్రిటన్ తో సహా అన్నింటినీ కలిపినా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ అంత ఉండేవి కావు. ఈ నాలుగు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలలో మూడు దేశాలతో కలిసి అమెరికా సైనిక కూటమి ఉంది.

అయితే నేటి అమెరికా పారిశ్రామిక సామర్థ్యం చైనాకంటే బలహీనంగా ఉంది. ఫైనాన్షియల్, సాంకేతిక రంగాలలో అమెరికా ఆధిపత్యానికి చైనా నుంచి సవాళ్ళు ఎదురవుతున్నాయి. అంటే 1940వ దశకంలోని జర్మనీకంటే కూడా చైనా అమెరికాకు బలమైన వ్యూహాత్మక ప్రత్యర్థిగా ఉంది. కాబట్టి నేటి అంతర్జాతీయ రాజకీయాలలో అమెరికా అంతకుముందటిలాగా ఆధిపత్యాన్ని చెలాయించటం అంత తేలిక కాదనేది సుస్పష్టం.

విద్యార్థుల హత్యలపై ఆగ్రహం

- మణిపూర్‌లోని బీజేపీ కార్యాలయానికి నిరసనకారుల నిప్పు

ఇంఫాల్ : మణిపూర్‌లో విద్యార్థుల హత్యలపై స్థానిక ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. నిరసనగా ఆందోళనకారులు రాష్ట్రంలో ఒక బీజేపీ మండల కార్యాలయానికి నిప్పు పెట్టింది. ఇటీవల రాష్ట్రంలో ఇద్దరు విద్యార్థుల హత్యలు తీవ్ర కలకలం రేపాయి. దీనికి నిరసనగానే ఆందోళనకారులు పెద్ద ఎత్తున గుమిగూడారు. తౌబాల్ జిల్లాలో ఉన్న కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకొని నిప్పు పెట్టారు.

కార్యాలయం గేటును ధ్వంసం చేశారు. అద్దాలను పగులగొట్టి, ఆవరణలో నిలిపి ఉంచిన వాహనం అద్దాలను పగలగొట్టారు. నిరసనకారులు టైర్లను తగులబెట్టి, చెక్క దుంగలు, ఉపయోగించని విద్యుత్ స్తంభాలను ఉపయోగించి ఇండో-మయన్మార్ హైవేను అడ్డుకున్నారు. రాళ్లతో దాడికి దిగారు. అయితే, ఈ గుంపును చెదరగొట్టడానికి జిల్లా అధికారిక యంత్రాంగం రంగంలోకి దిగింది. టియర్ గ్యాస్ షెల్‌లు, మాక్ బాంబులు, లైవ్ బుల్లెట్‌లను ప్రయోగించింది. దీంతో అక్కడి పరిస్థితి తీవ్రంగా మారింది. జులై 6 నుంచి తప్పిపోయిన ఇద్దరు విద్యార్థులను చంపడాన్ని నిరసిస్తూ మంగళవారం రాత్రి భద్రతా సిబ్బంది, స్థానికుల మధ్య ఘర్షణ జరిగింది. ఆందోళనకారులపై టియర్ గ్యాస్ షెల్స్‌ను, రబ్బరు బుల్లెట్లను ప్రయోగించారు. లాఠీచార్జ్ చేశారు. నిరసనకారులలో ఎక్కువగా విద్యార్థులు ఉన్నారు. బుధవారం సైతం వందలాది మంది విద్యార్థులు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరెన్ సింగ్ నివాసం వైపు మార్చ్ నిర్వహించారు. అయితే, రాష్ట్ర పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో సహా భద్రతా బలగాలు గుంపును చెదరగొట్టడానికి టియర్ గ్యాస్ షెల్స్, పొగ బాంబులను ఉపయోగించాయి

యూపీ స్కూల్ పేపర్‌లో మరో వివాదాస్పద ప్రశ్న

న్యూఢిల్లీ : బీజేపీ పాలిత యూపీలోని మరో పాఠశాలలో ప్రశ్నాపత్రం వివాదస్పదంగా మారింది. బహరైచ్ పట్టణంలోని 9వ తరగతి హిందీ పేపర్‌లో "భారత ముస్లిం తీవ్రవాదం"పై ప్రశ్న రావటం చర్చనీయాంశంగా మారింది. ఇది స్థానికంగా ముస్లింలలో ఆందోళనను రేపింది. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వారు నిరసన తెలిపారు. ఈ విషయంలో పాఠశాల యాజమాన్యం స్పందించింది. ప్రశ్నపత్రం సిద్ధం చేసిన హిందీ ఉపాధ్యాయుడిని పాఠశాల యాజమాన్యం తొలగించి పరీక్షను రద్దు చేసింది.

ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలకు న్యాయం

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి
- సీపీఐ(ఎం)లో 200 కుటుంబాల చేరిక

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

సమాజంలో పేద ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార వేదిక కమ్యూనిస్టు పార్టీ అని, ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని మాజీ శాసనసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు.

గురువారం నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలంలోని మల్కచర్ల, చింతచెట్టుతండా, చిట్యాల, ముదిమాణిక్యం, గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 200 కుటుంబాలు సీపీఐ(ఎం)లో చేరాయి. అనంతరం జూలకంటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాడి హక్కు పత్రాలు ఇప్పించిన పార్టీ సీపీఐ(ఎం) అని చెప్పారు. అడవిదేవులపల్లి మండలం కావాలని పట్టుబట్టి పోరాడి మండలాన్ని సాధించామన్నారు. ఈ రోజు ప్రభుత్వం సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ పార్టీ పథకాలుగా మార్చేసిందని, పేదలకు పథకాలు అందడం లేదని చెప్పారు. గృహలక్ష్మి పథకాన్ని అర్హులకు అందించాలని, రాజకీయ జోక్యాన్ని



నివారించాలని కోరారు. ఉద్యోగాల భర్తీ విషయంలో కూడా తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలను ఒప్పించి సత్తెరసాల వద్ద ఉన్న కృష్ణా నదిపై వంతెన సాధిస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. అందరికీ సమాన న్యాయం జరగాలంటే ఎర్రజెండా రాజ్యం రావాలని, ఈ మండల ప్రజానీకం సీపీఐ(ఎం) నాయకత్వానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, వినోద్‌నాయక్, మండల కార్యదర్శి జిట్టంగి సైదులు, నాయకులు, సైదనాయక్ కోటిరెడ్డి, పాపానాయక్, కరీమున్నీసా, దయానంద్ పాల్గొన్నారు.

ఎన్నికలు సమీపిస్తున్నందునే మహిళా బిల్లు

- చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే అమలు చేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

నవతెలంగాణ-సూర్యాపేట

ఎన్నికల ఎత్తుగడలో భాగంగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తెచ్చిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అక్టోబర్ 5న దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టనున్న ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఐద్వా ఆధ్వర్యంలో జీపు జాతాను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2014 ఎన్నికల ముందు హామీ ఇచ్చి 9ఏండ్లు దాని గురించి పట్టించుకోకుండా.. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్నందున బిల్లును ముందుకు తెచ్చిందని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే 2024 ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల హక్కుల రక్షణకు భరోసా, భద్రత కల్పించాలన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యం చెందాయని విమర్శించారు. కేరళ, తమిళనాడు తరహాలో రేషన్ షాపుల



ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు ఇవ్వాలని కోరారు. ఉపాధి హామీ పని దినాలు సంవత్సరానికి 200 రోజులు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలందరికీ 125 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా 2021లో 26046 మంది, 2022లో 31677 మంది లైంగికదాడులకు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు పెరిగాయన్నారు. మహిళలకు ఆర్థిక, మానసిక పరిపుష్టి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మహిళా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె దిగేవరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు మద్దెల జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకన పోయిన సైదమ్మ, నాయకులు జూలకంటి విజయలక్ష్మి, అందం నారాయణమ్మ కోట సృజన, గోలి భాగ్యమ్మ, పిట్టల రాణి, గంగపురి శశిరేఖ, చింత పద్మ, భాగ్యమ్మ, సుగుణమ్మ శ్రామిక మహిళా కన్వీనర్ చెరుకు ఏకలక్ష్మి, తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు కొప్పుల రజిత పాల్గొన్నారు.



కనీస వేతన చట్టాన్ని సవరించని ప్రభుత్వం

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

నవతెలంగాణ-ములుగు డెస్క్

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం కనీస వేతన చట్టాన్ని సవరించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. వాజేడు మండలం మండపాకలో వ్యకాస రాష్ట్ర కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటి జాగాలు, ఇండ్ల నిర్మాణం, సాగుభూమి, ధరణి సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగించాలని అన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం దేశవ్యాప్తంగా అక్టోబర్ 11వ తేదీ నుంచి చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు ఉపాధి హామీ చట్టాన్ని దూరం చేయాలని మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగానే బడ్జెట్లో నిధుల తగ్గింపు, పని ప్రదేశాల్లో ఆన్‌లైన్ హాజరు నమోదు, ఆధార్ ప్రతిపాదన ద్వారా కూలీలకు డబ్బులు, జాబ్ కార్డుల తొలగింపు, డ్రోన్ల ద్వారా పర్యవేక్షించాలన్న కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. ప్రభుత్వాల విధానాల వల్ల అసంఘటిత రంగంలో పనులు దొరక్కపోవడంతో పేదల జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బోగస్ రేషన్ కార్డు ఏరివేత పేరుతో పేదలకు రేషన్ బియ్యం దక్కకుండా చేస్తుందన్నారు. కేవైసీ మరో రెండు నెలలు పొడిగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.నాగయ్య వెంకట్రాములు, నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, కనకయ్య, పొన్నం వెంకటేశ్వర్లు, బుర్రి ప్రసాద్, బి రెడ్డి సాంబశివ, గ్యానం వాసు తదితరులు పాల్గొన్నారు.

కర్మసిద్ధాంతంపై కలం కత్తి దూసిన యోధుడు జాషువా

- టీపీఎస్‌కే గౌరవాధ్యక్షులు జి రాములు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'కర్మ సిద్ధాంతం'పై కలం అనే కత్తి దూసిన యోధుడు గుర్రం జాషువా అని టీపీఎస్‌కే గౌరవాధ్యక్షులు జి రాములు అన్నారు. మూఢవిశ్వాసాల్లేకుండా శాస్త్రీయ ఆలోచనలు కలిగిన ఉన్నారని చెప్పారు. జాషువా 128వ జయంతి సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే) ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 'నవ సమాజ నిర్మాణం'అనే అంశంపైన జి రాములు మాట్లాడుతూ నాలుగు పడగల హైందవ నాగరాజు విష సంస్కృతిపై నిప్పులు చెరిగిన మహాకవి జాషువా అని చెప్పారు. అణగారిన వర్గాల హక్కులపై దండోరా వేసిన నవయుగ వైతాళికుడని కొనియాడారు. జాషువా మనుధర్మ వ్యతిరేక సామ్యవాద ఉద్యమాలకు సాక్షి భూతంగా జీవితాంతం నిలబడ్డాడని అన్నారు. చాతుర్వర్ణ వ్యవస్థను నిలదీసిన విప్లవ మూర్తి జాషువా అని చెప్పారు. టీపీఎస్‌కే రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచమ కులం ఎక్కడిదని ప్రశ్నించిన ప్రగతికవి జాషువా అని అన్నారు. వర్గకుల వివక్ష లేని సమాజం కావాలని నినదించినాడని చెప్పారు. ఆకలి దరిద్రం లేని జీవితం కావాలని కోరాడన్నారు. జాషువా ఆశలు, ఆకాంక్షలు, లక్ష్యాలు నెరవేర్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంవి రమణ, టీపీఎస్‌కే నాయకులు జి నరేష్, ఎం సురేష్ తదితరలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు మందలించారని విద్యార్థి ఆత్మహత్య

- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ-ఆత్మకూర్(ఎస్)

ఉపాధ్యాయులు మందలించారని మనస్తాపానికి గురైన విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాఫూలే పాఠశాలలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమానూరు మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన ఆలకుంట్ల వెంకన్న, జయలక్ష్మీ దంపతుల కుమారుడు రాకేష్ మహాత్మా జ్యోతిబాఫూలే బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం రాత్రి హాస్టల్ గదిలో లైట్లు వేసి ఉన్నాయని పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్‌తోపాటు మరో ఐదుగురు విద్యార్థులను మందలించారు. దాంతో మనస్తాపానికి గురైన రాకేష్ బుధవారం రాత్రి హాస్టల్ పాత మరుగుదొడ్ల వద్ద రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున తోటి విద్యార్థులు నిద్ర లేచే సరికి రాకేష్ కనిపించలేదు. దాంతో వారు ఉపాధ్యాయులకు సమాచారం అందించారు.

యువత పరిశ్రమలవైపు వెళ్లాలి

స్థానికులకే ఉద్యోగాలు

- ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్
- సీతారాంపూర్, చందనెల్లిలో సింటెక్స్, కిటెక్స్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-షాబాద్

యువత రాజకీయాలు, రియల్ ఎస్టేట్ వైపే కాకుండా పరిశ్రమల స్థాపన వైపు వెళ్లాలని ఐటీ, పరిశ్రమల, పురపాలక శాఖ మంత్రి తారకరామారావు అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉందని చెప్పారు. గురువారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో ఆయన పర్యటించారు. సీతారాంపూర్ స్టేజీ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం సీతారాంపూర్ గ్రామ సమీపంలోని కిటెక్స్, చందన్‌వెల్లి గ్రామ సమీపంలో సింటెక్స్ పరిశ్రమలకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాబోయే ఏడేండ్లలో చందన్‌వెళ్లి, సీతారాంపూర్‌లో వెల్‌స్పన్ గ్రూప్ రూ.ఐదు వేల కోట్ల పెట్టుబడి పెడుతోందన్నారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పరిశ్రమల స్థాపనకు తెలంగాణలో సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. గుజరాత్, కర్నాటక రాష్ట్రాల్లో పెట్టాల్సిన ప్లాంట్లను తెలంగాణలో పెట్టారని, దీనికి కారణం సీఎం కేసీఆర్ సమర్థ నాయకత్వమేనని అన్నారు. స్థానిక యువతకే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. చేవెళ్ల, వికారాబాద్, తాండూర్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో ఐటీతోపాటు టూరిజం అభివృద్ధి చెందిందన్నారు. పరిగిలో ఆహార శుద్ధి పరిశ్రమ ఉందన్నారు. యువత రాజకీయాలు, రియల్ ఎస్టేట్ వైపు కాకుండా పరిశ్రమల వైపు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు.

సమాచార, పౌర సంబంధాల, గనుల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ కృషితో రంగారెడ్డి జిల్లా పరిశ్రమల ఖిల్లాగా మారిందన్నారు. రూ.370 కోట్ల పెట్టుబడులతో వెయ్యి మందికి ఉద్యోగ కల్పన వస్తుందన్నారు. జిల్లాలో రూ.62 వేల 832 కోట్ల పెట్టుబడులతో 1,358 పరిశ్రమలు స్థాపించగా.. వీటిలో ఏడు లక్షల ఆరు వేల మంది ఉద్యోగులుగా పనిచేస్తున్నారన్నారు. రూ.1400 కోట్ల పెట్టుబడులతో సింటెక్స్ పరిశ్రమలో 12వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

వికారాబాద్ జిల్లాలోనూ అనువైన ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు సీఎం కేసీఆర్‌కు నివేదిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హరీష్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, రోహిత్ రెడ్డి, టీఎస్-ఎస్ఐసీ ఎండీ వెంకట్, వెల్‌స్పన్ గ్రూప్ అధినేత బాలకృష్ణ గోయంక, కిటెక్స్ జాకబ్, ఆర్డీఓ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పదోన్నతులపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

2010 కంటే ముందు నియామకమైన టీచర్లకు టెట్ అవసరం లేదు

- హైకోర్టు అనుమతి ఇవ్వకుంటే ఐదేండ్లలో టెట్ అర్హత పొందేలా చూడాలి : మంత్రి సబితకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయుల పదోన్నతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పదోన్నతులపై భర్తీ చేసే స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల్లో పదోన్నతి పొందడానికి టెట్ పేపర్-2 ఉత్తీర్ణత ఉండాలన్న హైకోర్టు తీర్పుపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన పోస్టుల్లో ఇప్పటికే విద్యాశాఖలో పనిచేస్తున్న ఎస్జీటీ, తత్సమాన క్యాడర్ వారు పదోన్నతులు పొందేందుకు టెట్ పేపర్-2 అర్హత ఉండాలంటూ హైకోర్టు తీర్పు ఇచ్చినట్టు వార్తా పత్రికల్లో వచ్చిందని తెలిపారు. ఎన్సీటీఈ ఉత్తర్వుల ప్రకారం 2010 తర్వాత ఉపాధ్యాయ నియామకాల్లో టెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. అందువల్ల రాష్ట్రంలో 2010 కంటే ముందు ఉపాధ్యాయులుగా నియమింపబడిన వారు



టెట్ పరీక్ష రాయలేదని గుర్తు చేశారు. ఇప్పుడు పదోన్నతుల ద్వారా భర్తీ అయ్యే పోస్టుల్లో 2010 కంటే ముందు ఎస్జీటీ, తత్సమాన పోస్టుల్లో నియమించబడిన వారే పదోన్నతి పొందుతారని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, హైకోర్టు తీర్పును పరిశీలింపజేయాలని సూచించారు. తీర్పు సారాంశం టెట్ పేపర్-2 అర్హత పొందడం తప్పనిసరి ఉంటే హైకోర్టు స్పెషల్ పిటిషన్ వేయాలని కోరారు. 2010 కంటే ముందు నియమించబడిన ఉపాధ్యాయులు టెట్ పేపర్-2 అర్హత అవసరం లేదనే అనుమతిని హైకోర్టు నుంచి తీసుకోవాలని తెలిపారు. కోర్టు ఆ ప్రతిపాదనను కాదంటే పదోన్నతి తర్వాత ఐదేండ్లలో టెట్ పేపర్-2 అర్హత సాధిస్తారన్న ఆదేశాలను పొందాలని సూచించారు. ఐఏఎస్ నుంచి గ్రూప్-2 అధికారుల వరకు వారి ఉద్యోగానికి అవసరమైన పరీక్షలు అర్హత పొందడానికి, ఉద్యోగంలో చేరిన తర్వాతే అవకాశమిస్తున్నారని పేర్కొన్నారు. హైకోర్టులో కేసు రాత్రికి రాత్రే వేస్తే తెల్లారేసరికి తీర్పు వచ్చేది కాదని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి తీర్పులు వస్తాయని విమర్శించారు. ప్రభుత్వ అడ్వకేట్ జనరల్‌కు సరైన వివరణ ఇస్తే తీర్పు ఇలా ఉండబోదని పేర్కొన్నారు. అందుకే విద్యామంత్రి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.

స్కీమ్ వర్కర్ల అక్రమ అరెస్టులు

మలుగు జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిర్బంధం

- రాత్రే సీఐటీయూ, ఏఐటీయూసీ నేతల అరెస్ట్
- పోలీసులకు, ఆశ వర్కర్లకు మధ్య తోపులాట
- ఆశా వర్కర్ చేతికి గాయం
- పోలీస్ స్టేషన్‌కు వచ్చి సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే సీతక్క
- ర్యాలీగా వెళ్లి కలెక్టర్ ఛాంబర్ ముందు బైటాయింపు



నవతెలంగాణ - ములుగు

కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత.. ఇతర సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికుల పట్ల ప్రభుత్వం కర్కషంగా వ్యవహరిస్తోంది. సమస్యలను పరిష్కరించేందుకు ముందుకు రాకపోగా.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు తెగబడుతోంది. గురువారం ములుగు జిల్లా పర్యటనకు మంత్రి హరీశ్‌రావు వస్తున్నాడన్న సమాచారంతో ఆయన్ను కలిసి తమ గోడు వెళ్లబోసుకుందామనుకున్న కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. రాత్రికి రాత్రే సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులను అరెస్టు చేశారు. గురువారం ఉదయం ములుగు చేరుకున్న వాళ్లని చేరుకున్నట్టే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొంతమంది ఆశ వర్కర్లు మంత్రి సభా స్థలికి వెళ్లే ప్రయత్నం చేయగా.. మిషన్ భగీరథ కార్యాలయం వద్ద పోలీసులు ఆపారు. దీంతో పోలీసులకు, ఆశ వర్కర్లకు మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో ఆశ వర్కర్ చేతికి గాయమైంది. బలవంతంగా ఆశా వర్కర్లందర్నీ డీసీఎంలో ఎక్కించుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసుస్టేషన్‌లో ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికుల, సీఐటీయూ నాయకులను ఎమ్మెల్యే సీతక్క కలిసి సంఘీభావం తెలిపారు. అందరూ కలిసి ర్యాలీగా ములుగు ప్రభుత్వ ఆస్పత్రి ముందు జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకో చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకొని లోపలికి చొచ్చుకెళ్లి కలెక్టర్ ఛాంబర్ ముందు బైటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. మహిళలు అని చూడకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ ధనంతో, ప్రజాధనంతో నిర్వహించే సభలో ప్రజా సమస్యలపై విజ్ఞాన పత్రాలు కూడా స్వీకరించకుండా అక్రమ అరెస్టులకు పాల్పడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఆయా కార్మిక యూనియన్లతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ గౌడ్, మల్లాడి రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మక్క, పద్మ, నీలాదేవి, మంజుల తదితరులు ఉన్నారు.



ఎంఎస్.స్వామినాథన్ మృతి తీరని లోటు

- ఏ.విజయరాఘవన్, బి.వెంకట్ సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ స్వామినాథన్ మృతికి అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఏ.విజయరాఘవన్, ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం వ్యవసాయ రంగ అభివృద్ధికి తీరని లోటని పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహారోత్పత్తిలో దేశానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు రావడంలో స్వామినాథన్ చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం కోసం ఎమ్ఎస్‌పీ, సీ్టప్లస్‌సీ ఫార్ములా రూపొందించడంలో వ్యవసాయ కమిషన్ చైర్మెన్‌గా కీలక పాత్ర పోషించారని తెలిపారు. అఖిల భారత స్థాయిలో వివిధ భావాలు కలిగిన రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, కార్మిక, ప్రజా సంఘాలను ఒక వేదిక మీదకు తీసుకొచ్చి ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి ప్రేరణగా నిలిచారని పేర్కొన్నారు. స్వామినాథన్ అగ్రేరియన్ స్టడీ సెంటర్ పేరుతో ఆహార పంటలతోపాటు భూ సమస్యలు, ఉపాధి అవకాశాలపై రూపొందించిన నివేదికలు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాయని పేర్కొన్నారు. మధుర స్వామినాథన్ ప్రజా పంపిణీ వ్యవస్థ, గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమలు వంటి అంశాలపై ప్రత్యేక అధ్యయనం చేశారనీ, వీకే రామచంద్రన్ ఆధ్వర్యంలో నడుపుతున్న ఎఫ్ఏఎస్, వ్యవసాయ కార్మిక సంఘాలతో సత్సంబంధాలున్నాయని తెలిపారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరల చట్ట సాధన కోసం, వ్యవసాయ కార్మికులకు ఉపాధి, ఆహార భద్రత వంటి గ్యారెంటీ పథకాలను అమలు చేసుకోవడం కోసం దేశవ్యాప్త బలమైన ఉద్యమాలను నిర్వహించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

స్వామినాథన్‌తోనే ఆహారభద్రత

వ్యవసాయ, సాగునీటిరంగ నిపుణులు : సారంపల్లి మల్లారెడ్డి

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్.స్వామినాథన్ మృతి వ్యవసాయ ప్రపంచానికి తీరనిలోటు. వ్యవసాయంరంగంలో సంస్కరణలు తెచ్చిన ఘనత ఆయనదే. రైతులకు గిట్టుబాటు ధర ఉండాలని మొదటి నుంచి చెబుతున్నారు. అమెరికాకు చెందిన బోర్లాగ్, చైనాకు చెందిన లాంగ్‌పింగ్ శాస్త్రవేత్తలతోపాటు స్వామినాథన్ కృషిమూలంగా ప్రపంచంలో ఆహారభద్రత నెలకొంది. ఉత్పత్తిని నాలుగైదు రెట్లు పెంచారు. కొరత లేకుండా చేశారు. మద్దతు ధర కింద ఉత్పత్తి ధరలో 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారసులను ఆమోదించిన కేంద్ర సర్కారు, అమలుచేయకుండా రైతులను మోసం చేసింది.

మను ధర్మంపై సమధర్మ యుద్ధం సాగించాలి

- జాషువా సాహిత్యం సామాజికోద్యమాలకు స్ఫూర్తి : వక్తలు
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో జాషువా జయంతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జాషువా సాహిత్యం సామాజికోద్యమాలకు స్ఫూర్తి అనీ, మను ధర్మంపై సమధర్మ యుద్ధం సాగించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, అంబేద్కరిస్టు డాక్టర్ స్వామి అల్వాల్, పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక అధికారి(రిటైర్డ్) ఇరిగి నరసింగరావు అన్నారు. జాషువా సాహిత్యం సామాజికోద్య మాలకు స్ఫూర్తి అని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జాషువా 128వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జాషువా సాహిత్య పిపాసి అనీ, గొప్ప మానవతావాది, సంస్కరణవాది అని కొనియాడారు. జాషువా తనకు పేదరికం, కులమత భేదాలు గురువులాంటివనీ, అందులో ఒకటి ప్రతిఘటన నేర్పితే రెండోది పరమత సహనాన్ని నేర్పిందని చెప్పిన విషయాలను గుర్తుచేశారు. విశ్వనాథ సత్యనారాయణ లాంటి కవులు తనపై విమర్శలు ఎక్కుపెడితే అంతే స్థాయిలో ఆయన తిప్పికొట్టిన సంఘటనలను వివరించారు. ఆరుగాలం కష్టం చేసే కష్టజీవులకు సమాజంలో భుక్తం కరువైందని జాషువా తన కవిత్వం ద్వారా ఆవేదన వ్యక్తం చేశారన్నారు. వెనుబడిన సామాజిక తరగతుల వారిని దేవుని గుడిలోకి రానివ్వనప్పుడు 'గబ్బిలం' ఖండకావ్యం రాసి గబ్బిలంతో దేవుడికి లేఖపంపిన మహనీయుడు జాషువా అని కొనియాడారు. ప్రతిమల పెండ్లీలకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న కోటీశ్వరులు కూటికి గతి లేని వారికి సహాయపడకపోవడం దారుణమన్నారు. నేటికీ సమాజంలో వివక్షా రూపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయన్నారు. ఆ అసమానతలను, అంతరాలను దేశం నుంచి తరిమేయడం కోసం నేటితరం జాషువా స్ఫూర్తితో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు గోవర్ధన్, సురేష్, శ్రీను పాల్గొన్నారు.

సంపాదకీయం

మరోసారి చమురు ధరల పెరుగుదల!

ప్రపంచ మార్కెట్లో మరోసారి ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. విపణి పండితుల జోశ్యాలను వమ్ము చేస్తున్నాయి. సౌదీ అరేబియా, రష్యా, ఇతర చమురు ఎగుమతిదేశాలు(ఒపెక్) ఉత్పత్తిని తగ్గించగా అమెరికా పెంచినప్పటికీ జూన్ నెల నుంచి ఇప్పటి వరకు 30శాతం పైగా ధరలు పెరగటం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఒక

మాంద్యం వంటి ప్రతికూలతలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. తినీ తినక కాస్తో కూస్తో కూడబెట్టుకున్న సొమ్మంతా ధరల పెరుగుదలతో హరీ అంటున్నది. చమురు ధరలు పెరిగితే మనదేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించు కుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది.

పీపా ధర 110 డాలర్ల వరకు పెరిగింది. గురువారం నాడు సంపాదకీయం రాస్తున్న సమయానికి ప్రామాణిక బ్రెంట్ రకం ధర 97 డాలర్లు దాటింది. వందడాలర్ల వద్ద స్థిరపడుతుందని వెలువడుతున్న అంచనాలు అభివృద్ధి చెందుతున్న దేశాలకు చెడువార్తలే. ఇంతకు మించి ధరలు ఎంతకాలం ఉన్నప్పటికీ ఆర్థిక వ్యవస్థ ఖాయిలా తీవ్రంగా ఉంటుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. చమురు ధరల తగ్గుదల ఎగుమతి మీద ఆధారపడిన దేశాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్న కారణంగా అవి ఉత్పత్తిని తగ్గించి ధరలను పెంచుకోవాలని చూస్తున్నాయి. చమురు ధరలు ఆకస్మికంగా పెరగటానికి కారణాలు ఏమిటి ? అమెరికా భవిష్యత్ అవసరాల కోసం భారీ ఎత్తున వ్యూహాత్మక చమురు నిల్వల విధానాన్ని అనుసరిస్తున్న సంగతి తెలిసిందే.ప్రస్తుతం అవి నాలుగు దశాబ్దాల కనిష్టానికి పడిపోయాయి. తిరిగి వాటిని నింపుతున్నప్పటికీ అవి 2021నాటి స్థాయికి మాత్రమే చేరతాయనే అంచనాలు ధరలు పెరగటానికి ఒక కారణం. ఒపెక్ దేశాలు ఉత్పత్తిని తగ్గించటం మరొక కారణమైతే చైనాలో ఆర్థిక వృద్ధి మందగించిందంటూ ఎన్ని కథలు వినిపించినప్పటికీ అక్కడ తిరిగి గిరాకీ ఏర్పడనుందనే అంచనాలు కూడా దోహదం చేస్తున్నాయి.



ఈ ఏడాది సెప్టెంబరులో అమెరికాలో రోజుకు పదమూడు మిలియన్ల పీపాల చమురు ఉత్పత్తి జరిగి 2019నవంబరు నాటి రికార్డును దాటుతుందని చెబుతున్నారు. వచ్చే ఏడాది సగటున నెల వారీ అదే మాదిరి కొనసాగవచ్చని చెబుతున్నప్పటికీ జెపి మోర్గాన్ సంస్థ విశ్లేషకులు చమురు ధర 2026 నాటికి 150 డాలర్లకు చేరవచ్చని చెప్పారు. వచ్చే ఏడాది 90 నుంచి 110 డాలర్ల మధ్య కదలాడవచ్చన్నారు. ఆ సంస్థ విశ్లేషణ వెలువడిన నాడు 93.55గా ఉన్న ధర వారంలోపే గురువారంనాడు 96–97 డాలర్ల మధ్య కదలాడింది. ఈ ఏడాది వంద డాలర్లకు మించకపోవచ్చని ఫిబ్రవరిలో చెప్పిన అంచనా ఏడునెలల్లోనే తప్పి వందడాలర్లు దాటే దిశలో పయనిస్తోంది. గిరాకీ–సరఫరా మధ్య లోటు 2025లో రోజుకు 1.1 మిలియన్ పీపాలుగా ఉన్నది 2030 నాటికి 7.1మిలియన్ల పీపాలకు పెరగవచ్చని జెపి మోర్గాన్ అంచనా. అందువలన చమురు ధరల్లో స్వల్ప ఎగుడు దిగుళ్ల తప్ప పెరిగేందుకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. గత ఏడాదిన్నర కాలంగా ధరలు తగ్గిన కారణంగా తమ లాభాలకు గండిపడుతుందనే ఉద్దేశ్యంతో కడుపు నిండిన అమెరికా చమురు సంస్థలు అసలు ఉత్పత్తినే తగ్గించి వేశాయి. ఇప్పుడు పెరుగుతుండటంతో రిగ్గుల దుమ్ము దులుపుతున్నాయి. రష్యా చమురు ఎగుమతుల నిషేధం కొనసాగుతుందనే ధైర్యం కూడా దీనికి దోహదం చేస్తున్నది.

మాంద్యం వంటి ప్రతికూలతలతో అసలే అంతంత మాత్రంగా ఉన్న వృద్ధి రేటు చమురు ధరలతో మరింత కుదేలు కావటం ఖాయం. ఆచరణలో అది సామాన్యుల మీద భరించలేని భారాన్ని మోపుతుంది. తినీ తినక కాస్తో కూస్తో కూడబెట్టుకున్న సొమ్మంతా ధరల పెరుగుదలతో హరీ అంటున్నది. చమురు ధరలు పెరిగితే మనదేశంలోని 42 శాతం కుటుంబాలు ఆమేరకు ఇతర ఖర్చులు తగ్గించు కుంటాయని గతేడాది లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడించింది. ఇప్పటికే డాలరు విలువ పెరగటం, భారత్ వంటి దేశాల కరెన్సీల విలువలు పతనం కావటంతో చమురు కొనుగోలు భారం అవుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలతో నిమిత్తం లేకుండా పెట్రోలు, డీజిలు మీద భారీ ఎత్తున సెస్‌లను పెంచి గడచిన తొమ్మిది సంవత్సరాలలో దాదాపు 30లక్షల కోట్ల రూపాయల మేరకు జనం మీద భారం మోపిన సంగతి తెలిసిందే. అదే మోడీ సర్కార్ 2017 నుంచి ఇప్పటి వరకు కనీసవేతనాలను సవరించలేదు. నగదు రూపంలో గతంతో పోల్చితే పొందుతున్న మొత్తం పెరిగినట్లు కనిపిస్తున్నప్పటికీ ద్రవ్యోల్బణంతో పోలిస్తే నిజవేతనాలు తగ్గాయి, అంటే జనం జేబులకు చిల్లుపడింది. దీన్నే గోడదెబ్బ చెంపదెబ్బ అంటారు. పెరుగుతున్న ఉప్పు పప్పుల ధరలతో పోల్చితే ఎన్నికల కోసం గ్యాస్‌బండ మీద రెండు వందల రూపాయలు తగ్గించిన మాత్రాన జనానికి ఒరిగేదేమీ లేదు. పదేండ్ల క్రితం నాడున్న స్థితికి చమురు మీద పన్నులు తగ్గిస్తే జనానికి ఉపశమనం.



మహిళా రిజర్వేషన్

నిరవధిక జాప్యంతో ఆమోదం!

ఇరవైఏడు సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం ఎట్టకేలకు ఎంతగానో అందరూ ఎదురు చూస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందింది. కానీ, ఇది ఆనందించే అంశంగా లేదు. ఇన్నేళ్ళూ, వరుసగా వచ్చిన ప్రభుత్వాలన్నీ కూడా ఈ బిల్లును చంపేయడానికే చూశాయి, ఉదాసీనతతో మూటగట్టి మూలన పెట్టడానికే ప్రయత్నించాయి. కానీ, వామపక్షాలు, ఐద్వాతో సహా కొన్ని మహిళా ఉద్యమ విభాగాలు మాత్రమే నిరంతరంగా పోరాడుతూ, ఈ బిల్లును సజీవంగా వుంచేందుకు పోరాటం, ప్రచారం చేస్తూ వచ్చాయి. తాజా అధ్యాయంలో విషాద కరమైన అంశమేమంటే, బిల్లు ఆమోద ముద్ర పొందినా, దీని అమలు మాత్రం 2029 సార్వత్రిక ఎన్నికల వరకు, అది కూడా తీవ్రమైన స్థాయిలో ప్రశ్నించదగ్గ కారణాలతో వాయిదా వేశారు. తదుపరి జన గణన ప్రక్రియ పూర్తయిన పిదప 2026లో సీట్ల పునర్విభజన ప్రారంభమైన తర్వాత మాత్రమే చట్టసభల్లో మహిళలకు సీట్ల రిజర్వేషన్ జరుగుతుందని ముసాయిదా బిల్లు పేర్కొంటోంది. మహిళా రిజర్వేషన్ వాస్తవ రూపం దాల్చడానికి జనాభా లెక్కల నిర్వహణ లేదా పునర్విభజన ప్రక్రియ ఏదీ అవసరం లేదు. బిల్లును ఆమోదించిన తక్షణమే రిజర్వేషన్‌ను అమలు చేయవచ్చు, జనగణన, పునర్విభజన ప్రక్రియలు నిర్వహించినపుడు సీట్ల సంఖ్య ఆ దామాషా ప్రకారం పెరుగుతాయి. కానీ, ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకునేందుకు మహిళలకు గల హక్కును మరికొన్ని సంవత్స రాల పాటు నిరాకరించడానికి వీటిని ముందుకు తీసుకువచ్చారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును బీజేపీ క్రమం తప్పకుండా తన ఎన్నికల ప్రణాళికల్లో చేరుస్తూ వచ్చింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లోగా అమలు చేస్తామంటూ 2014 లోనే ఈ దేశ మహిళలకు హామీ ఇచ్చింది. ఆ రెండు ఎన్నికల తర్వాత లోక్‌సభలో బీజేపీకి మెజారిటీ వచ్చింది. దాంతో ఈ బిల్లును తొక్కిపారేసింది. అధికారంలో వున్న తొమ్మిదేండ్ల లో బిల్లును ఆమోదిస్తామన్న హామీని మాత్రం నెరవేర్చలేదు. ఇప్పుడు, రెండో పదవీ కాలం చివరిలో బిల్లును ప్రవేశ పెట్టింది. దీంతో తమ పని సులువైపోతుందని, పితస్వామ్యపు తుట్టెను కదపకుండానే, తమకు రావాల్సిన ఓట్లు వచ్చే స్తాయని బీజేపీ, ప్రధాని గట్టి నమ్మకంతో వున్నట్లు కనిపిస్తోంది.కానీ కచ్చితంగా ఇదేదీ జరిగేది కాదు. దేశవ్యాప్తంగా మహిళలందరూ సంతోషంతో పొంగిపోయేందుకు ఇందులో ఏమీ లేదని, నిజానికి మోసపోయామని భావిస్తున్నారు. పార్లమెంట్‌లో కానీ, రాష్ట్రాల అసెంబ్లీల్లో గానీ తమ సంఖ్య పెరగకుండానే మరో సార్వత్రిక ఎన్నిక, అనేక రాష్ట్రాల ఎన్నికలు జరుగుతాయనే క్రూరమైన వాస్తవం వారి కళ్ళ ముందుంచబడింది.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళలో, ప్రజాస్వామ్యానికి మూలాధారం అంటూ బీజేపీ చెబుతున్న దానిలో లోక్‌సభలో మహిళల సీట్ల శాతం 5 శాతం నుండి ఈనాటి 15 శాతానికి మాత్రమే పెరిగింది. ఇది సిగ్గుపడాల్సిన వాస్తవంగా వుంది. ప్రపంచంలోని అనేక ఇతర దేశాలు మెరుగైన రికార్డును కలిగి వున్నాయి. పార్లమెంట్లకు ఎన్నికైన మహిళల సీట్ల సంఖ్య పరంగా చూస్తే భారత్ ఇరవయ్యవ స్థానంలో వుంది. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇది మారవచ్చు, కానీ మారదు. మన దేశంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఓటు వేస్తున్నారు, పైగా ప్రతి ఎన్నికతో ఈ సంఖ్య పెరుగుతూ వస్తోంది. పైగా గాయాన్ని మరింత రేపేలా, 'బిల్లు లక్ష్యాలు–కారణాలు'ను ప్రభుత్వం పేర్కొంది. "మహిళా సాధికారత, మహిళల నేతత్వంలో అభివద్ధి ద్వారా, మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం గణనీయంగా మెరుగు పరచబడింది. విద్య, ఆరోగ్యానికి సమాన అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా 'నారీ శక్తి'కి పెద్ద పీట వేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఉజ్వల యోజన, స్వచ్ఛ భారత్ మిషన్ కింద టాయిలెట్లకు అవ కాశం, ముద్ర యోజన ద్వారా ఆర్థిక క్రమంలోకి తీసుకురావడం వంటి వివిధ చొరవల ద్వారా ముఖ్యంగా మహిళలకు ప్రశాంత జీవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే, మహిళల నిజమైన సాధికారతకు... నిర్ణయం తీసు కునే ప్రక్రియలో మహిళలు మరింత ఎక్కువగా పాల్గొనడం అవసరం. వారు విభిన్నమైన దక్పోణాలతో చట్టసభల్లో చర్చలు జరిపి, నిర్ణాయక క్రమాన్ని మరింత పరిపుష్టం చేసి, నాణ్యతగా మారుస్తారు." అని ప్రభుత్వం పేర్కొంది.

ఉజ్వల యోజన అనేది లక్షలాదిమంది నిరుపేద మహిళలపై క్రూరమైన జోక్‌గా మారిందని రుజువైంది. వివిధ సాంకేతిక అభ్యంతరాల కారణంగా వారికి ఉచితంగా సిలిండర్లు రావడం లేదు. దాంతో ఇప్పుడు అత్యంత వ్యయభరితంగా మారిన సిలిండర్లను వారు కొనుగోలు చేయలేకపోతున్నారు. అలాగే, దేశంలో పలు ప్రాంతాల్లో నిర్మించిన తర్వాత, పని చేస్తున్న టాయిలెట్ల సంఖ్యకు సంబంధించి ప్రభుత్వం చెబుతున్న గొప్పలు కూడా కేవలం కాగితాలపైనే. కానీ, నిరుపేద మహిళల పారిశుధ్య పరిస్థితులు పెద్దగా మారలేదని, ఇంకా అలానే కొనసాగుతు న్నాయనేది సిగ్గుచేటైన వాస్తవికతగా వుంది. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్‌కు హామీ కల్పించే బిల్లు అమలుకు సుదీర్ఘకాలం పట్టనుండడంతో...ఆచరణలో అత్యంత నిరుత్సాహకరంగా మారిన ఈ పథకాల ప్రస్తావన, సముచితంగా వుంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బుద్ధుడు హిందువనడానికి ఆధారమే లేదు!

ఒకప్పుటి భరతఖండంలో షోడస మహా జనపదాలు ఉండేవి. అంటే పదహారు రాజ్యాలు ఉండేవి. జనపదం అంటే రాజ్యం. అంగరాజ్యం, కోసల రాజ్యం, మల్ల రాజ్యం, లిచవి రాజ్యం (వజ్జి) మొదలైనవి. వీటిలో వాయువ్య భరత ఖండాన్ని పర్షియన్లు జయించారు. సింధూ ప్రాంతంలోని కాంభోజ, గాంధార రాజ్యాలను కూడా జయించారు. ఈ రెండూ ప్రస్తుతం పాకిస్థాన్‌లో భాగమైపొయ్యాయి. అయితే అప్పటి ఆ పర్షియన్లు పాలించింది సాధారణ శకానికి ముందు 600–334 BCE మధ్య కాలం. వీరికి 'స' పలకనందు వల్ల, 'స' పలకాల్సి వచ్చినప్పుడు 'హ'పలికేవారు. అందుకే సింధూను హిందూ అన్నారు. సింధూ ప్రాంతాన్ని హిందూ దేశమన్నారు. మనోభావాలు దెబ్బతీసుకోకుండా ఇక్కడ, అందరూ ఒక విషయం తెలుసుకోవాలి. పార్శీ, ఉరుదూ, అరబిక్ డిక్షనరీల ప్రకారం – ఆ భాషలలో హిందూ అంటే దొంగ / బానిస / నల్లనివాడు వంటి అర్థాలు రాసిపెట్టుకున్నారు. ఏమైనా హిందూ అనేది ఒక మతానికి సంబంధించిన పదమే కాదు – అది ఒక ప్రాంతానికి సంబంధించిన పదం. ముందుగా ఆ విషయం గుర్తుంచుకోవాలి! ఇక 'హిందుత్వం' అనేది కూడా బుద్ధుని తర్వాత కాలంలో క్రమంగా రూపుదిద్దుకున్నది. అందువల్ల బుద్ధుడు హిందువు అని చెప్పుకోవడం పచ్చి అబద్ధం అవుతుంది. ఒకవేళ ఎవరైనా అలా అనుకుంటే, వారికి చారిత్రక అవగాహన లేదనుకోవాలి. లేదా తెలిసి ఉన్నా బుద్ధుణ్ణి తమలో కలుపుకోవడానికి కుట్ర పూరితంగా అలా అంటున్నారేమోనని... అనుకోవాల్సి వస్తుంది.

> పురాతన హిందూ దేవాలయాలు, హిందూ దేవతా విగ్రహాలు ఏవైనా - అవన్నీ నిస్సందేహంగా మార్పులు చేసుకున్న బౌద్ధారామాలు, బుద్ధుడి విగ్రహాలు మాత్రమేనన్నది - ప్రసిద్ధ చరిత్రకారులంతా ముక్తకంఠంతో చెప్పిన విషయం! ఇకపోతే.. బుద్ధుడు హిందువనడానికి ఒక్క ఆధారం కూడా లేదు. ఆయన హిందువే కానప్పుడు ఆయన్ని హిందూమతంలో చేర్చుకుని, దశావతారాల్లో భాగం చేసుకోవడం జనాన్ని మోసం చేయడం కాదా? సత్యాన్ని దాచిపెట్టి, వచ్చే తరాల వారి కళ్ళుగప్పడం కాదా? ఏమైనా, బుద్ధుడి విలువను, ప్రత్యేకతను ఆయనకు అలా ఉంచి, మహనీయుడిగా, పరిపూర్ణుడిగా గౌరవించుకోవడం, నమస్కరించుకోవడం విజ్ఞత అనిపించుకుంటుంది!

భారతదేశాన్ని మొదటగా జయించి ఆక్రమించిన విదేశీ రాజులు పర్షియన్లు, ఇరానియన్లు. సైరస్ మరయూ అతని మనుమడు డేవియన్ – ఇది సాధారణ శకానికి ముందు 600 BCE! ఇక బుద్ధుడు పుట్టేనాటికి – అంటే సాధారణ శకానికి ముందు 563BCE నాటికి మన దేశంలోనే కాదు, చైనా ఈజిప్టు, మొసపొటేమియాలలో కూడా ఎక్కడా 'హిందూ మతం' అనేది లేదు. వేదాలలో, స్మృతులలో, ఇతిహాసాలలో, పురాణాలలో ఎక్కడా 'హిందూ' అనే మాటే / శబ్దమే వినిపించదు. బుద్ధుడు క్షత్రియుడా కాదా అన్నది స్పష్టంగా తెలియదు. అయితే శాక్య తెగకు చెందిన వాడన్నది స్పష్టం. గతంలో తెగలకు, తండాలకు, గణాలకూ అలాగే కొన్ని రాజ్యాలకు రాజులైనంత మాత్రాన, వారు క్షత్రియులు కావల్సిన అవసరం లేదు. తర్వాత కాలంలోని అశోకుడు ఆ తర్వాతి కాలంలో శివాజీ వంటివారు ఎంతోమంది రాజ్యాలు ఏలారే గాని, వారంతా క్షత్రియులు కారన్నది మనకు తెలుసు.



డాక్టర్ దేవరాజు మహారాజు

గౌతముడి తండ్రి శుద్ధోధనుడు. ఈయన శాక్య తెగకు చెందినవాడు. ఈ తెగ రోహిణీ నది ఒడ్డున ఉండేది. రోహిణీ నదికి ఆవలివైపు 'కొలియ' తెగ ఉండేది. ఇంతకు ముందు చెప్పినట్టు షోడస మహా జనపదాలైన పదహారు రాజ్యాలు మాత్రమే కాకుండా, అప్పట్లో ఇంకా చిన్న చిన్న జనపదాలు కూడా ఉండేవి. వీటిని గణాలు అని అనేవారు. ఒక్కో గణానికి ఒక్కో గణనాయకుడు (గణపతి) ఉండేవాడు. గణం అంటే రాజ్యం. గణనాయకుడు అంటే రాజు. ఆ కాలంలో శాక్య, కొలియ తెగలుండేవి. వారి రాజ్యాలు వేరు వేరుగా ఉండేవి. రోహిణీ నదీ జలాల విషయమై శాక్యులకు, కొలియలకూ మధ్య జరగబోయే యుద్ధాన్ని వ్యతిరేకించినందుకు 'సంఘ' నిర్ణయాన్ని అనుసరించి, గౌతముడు దేశాన్ని వదిలి వెళ్ళాల్సి వచ్చింది. బుద్ధుడు దేశాన్ని / రాజ్యాన్ని వదిలిపోవడానికి కారణం ఆనాటి తెగల మధ్య ఘర్షణేనని కోశాంబి, డా.బిఆర్. అంబేద్కర్ వంటి ప్రముఖులు, విజ్ఞులు అభిప్రాయపడ్డారు.

సాధారణ శకానికి ముందు బుద్ధుడు పుట్టేనాటికి (600–300BCE) మన భూభాగంలో ఉన్న మతాలు రెండు రకాలు. 1. వైదిక మతం 2. అవైదిక మతం. వైదిక మతాన్ని వేద సంప్రదాయం ORTHODOX అని అన్నారు. ఆ వైదిక మతాలన్నీ సాంప్రదాయేతర మతాలు. ఇవి సుమారుగా అరవై రెండు ఉండేవి. ఇవన్నీ బ్రాహ్మణ వ్యవస్థకి వ్యతిరేకంగా ఉండేవి. ఉదాహరణకు అజీవిక, చార్వాక, లోకాయత వంటివి. ఈ అవైదిక మతస్థుల్ని "శ్రమణులు" అన్నారు. ఇక వైదిక మతం బ్రాహ్మణీయ భావజాలంతో ఉండి, వర్ణ వ్యవస్థను స్థిరపరిచింది. రుగ్వేదంలోని పురుషసూక్తంలో వర్ణవ్యవస్థ గురించిన ప్రస్తావన మొదటిసారి కనిపిస్తుంది. కానీ, కులవ్యవస్థ గురించి, పంచముల గురించి ఇందులో వివరాలు కనిపించవు. అయితే అవి తర్వాతి కాలంలో వచ్చిన మనుస్మృతి. నారద స్మృతులలో వివరంగా ఉన్నాయి.

వైదిక, అవైదిక మతాలు ఇలా వ్యాపించి ఉన్న దశలో శ్రమణుడైన బుద్ధుడు పుట్టి పెరిగాడు. వైదిక మతంలోని అసమానతలను నిరసించాడు. పశుబలిని, జీవ హింసను తీవ్రంగా దుయ్యబట్టాడు. ఇవన్నీ వైదిక–వేద–సంప్రదాయ –బ్రాహ్మణీయ మతానికి వ్యతిరేకం! బుద్ధుడు ప్రారంభించిన ఈ పనులే ఉద్యమ రూపం దాల్చి 'బౌద్ధం' అయ్యింది. అంతేగాని, బుద్ధుడు ఏ మతాన్ని స్థాపించలేదు. ఆయన శ్రమణుడు, నాస్తికుడు గనక, ప్రతి విషయాన్నీ తనదైన ఆలోచనా విధానంతో విశ్లేషించి, తన అనుచరులకు బోధించేవాడు. అంతే – తనని తాను దేవదూతగా గానీ, దేవుడిగా గానీ ప్రకటించుకోలేదు. సమ సమాజమే లక్ష్యంగా, ఒక ఉద్యమం చేపట్టిన సంఘ సంస్కర్త మాత్రమే! బుద్ధుడి మార్గాన్ని అనుసరించిన ఆయన అనుయాయులు బౌద్ధులుగా గుర్తింపబడ్డారు.

బుద్ధునికి ఇద్దరు గురువులున్నారు. మొదటివారు రుద్రక. రెండవవారు అలారక లామా. వీరి వద్ద రెండేళ్ళపాటు బుద్ధుడు వేద విద్యను అభ్యసించాడు. ఆలోచించి, అందులో ఏమీలేదనీ, అవి ఉట్టి మూర్ఖపు రాతలనీ నిర్ణయించుకున్నాడు. వాటిని అక్కడే వదిలేసి, స్వయంగా తన అన్వేషణను తీవ్రతరం చేశాడు. ఆ క్రమంలోనే 'తథాగతు'డయ్యాడు... తథాగతుడంటే ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించి, నడుచుకునేవాడు. ఉన్న వాస్తవాల ప్రకారం అంటే నిజాల ప్రకారం నడుచుకునేవాడు. విషయం తెలుసుకోకుండానే బుద్ధుడు వైదిక ధర్మం పట్ల విముఖుడు కాలేదు. క్షుణ్ణంగా తెలుసుకున్న తర్వాతే – అందులో ఏమీలేదన్న నిర్ధారణకు వచ్చాడు. అందులోని అమానవీయమైన అంశాలకు చలించిపోయి తిరస్కరించాడు. ఈ లోకాన్ని, లోకరీతిని అందులోని బాధల్ని, వేదనల్ని అవగాహన చేసుకుని ఆలోచించి, తనలో తను మధనపడి,



తపించి, తపించి తెలుసుకున్న విషయాలు తన అనుచరులకు బోధించాడు. బయట ప్రపంచంలో ఉన్న విషయాలకు బుద్ధుడు చెప్పే విషయాలు భిన్నంగా ఉంటూనే, నిజానికి దగ్గరగా ఉన్నందువల్ల ఆయన్ని 'జ్ఞానోదయమైన వాడిగా' ఈ ప్రపంచం గుర్తించింది. అందులో మహిమలూ, మాయలూ ఏవీ లేవు.

పరిసరాల్ని, ప్రకృతిని, ఆకాశాన్ని అరణ్యంలోని చిన్నా పెద్దా జీవుల్నీ – వాటి ప్రవృత్తిని నిశితంగా పరిశీలించడం – సమాజంలో అప్పటికి ఉన్న రీతి రివాజును అర్థం చేసుకుని, ఏది మంచి ఏది చెడ్డ అని అవలోకించుకుని తనలోకి తాను ప్రయాణించి, ప్రతి విషయాన్ని విశ్లేషించుకుని, చివరగా ఆయన తీసుకున్న నిర్ణయమే – జ్ఞానోదయం! జ్ఞానోదయమంటే ఆలోచనల పరిపక్వత. నిగూఢమైన అంశాల్ని సరళంగా అర్థం చేసుకోగల నిపుణత. సాధించుకున్న జ్ఞానాన్ని మళ్ళీ అంతే సులభంగా ప్రజల భాషలో ప్రజలకు అందించాలన్న తహతహతో కూడిన నైపుణ్యం. ఎప్పటికప్పుడు కొత్త ఉత్సాహంతో, కొత్త ఉత్తేజంతో, నిబద్ధతతో దేశమంతా తిరుగుతూ బోధన చేయాలన్న సంకల్పం. ఆయనలోని ఇన్ని లక్షణాల వల్ల ఈ దేశం, ప్రపంచానికి కొత్త విలువలు చూపగలిగింది. కొత్త జ్ఞానం అందించగలిగింది. బౌద్ధం – శాంతి, అహింస, సత్యాన్వేషణల మార్గాన్ని బోధించగలిగింది. అప్పటికి ఇవన్నీ ప్రపంచానికి కొత్తవి. బుద్ధుడు తన ఆలోచనల తీవ్రతలోంచి సాధించిన జ్ఞానం – సార్థకమైంది. ప్రపంచ జనావళి ఆలోచనా స్థాయిని అనూహ్యంగా పెంచగలిగింది.

బుద్ధుని మరణానంతరం బౌద్ధంలో మార్పులు, చేర్పులూ జరిగాయి. బౌద్ధ భిక్షుల్లో వచ్చిన బేధాభిప్రాయాల వల్ల కొంత – వైదిక మత ప్రభావం వల్ల కొంత – బౌద్ధంలో మార్పులు జరిగాయి. హీనయాన, మహాయాన, వజ్రయానాలుగా విభజన జరిగింది. బుద్ధుడి కాలంలో ఆయన తన బోధనలు ఆనాటి ప్రజల భాష అయిన పాలి భాషలో చేసేవాడు. బుద్ధుడి అనంతరం పాలి, ప్రాకృత భాషలతో పాటు వైదిక మత ప్రభావం వల్ల బౌద్ధ ప్రచారంలో సంస్కృతం కూడా చేరింది. విగ్రహారాధన మొదలైంది. గుళ్ళూ, గోపురాలూ వెలిశాయి. బుద్ధుడి తర్వాతే బౌద్ధం – ఒక మతంగా మారింది. హీనయాన, మహాయాన, వజ్రయానాలు వేటికవి బలం పుంజుకుని విస్తరించాయి. తను ఒక దైవ స్వరూపుడవుతాడని గానీ, తన ఉపదేశాలన్నీ బౌద్ధమత సిద్ధాంతాలవుతాయని గానీ బుద్ధుడు తన జీవిత కాలంలో ఊహించలేదు. తన బోధనల్ని సంస్కృతంలోకి అనువదిస్తామన్న పండితుల్ని బుద్ధుడు వారించాడు. అలాంటి పని చేయకండని తీవ్రంగా హెచ్చరించాడు కూడా! అయితే ఆయన మరణం తర్వాత, జరగాల్సినవి జరిగిపోయాయి.

ఒక రకంగా భారతదేశంలో విగ్రహారాధన, ఆలయాల నిర్మాణం మొదటిసారి బౌద్ధంతోనే ప్రారంభ మయ్యాయి. అదెలా జరిగిందంటే, బౌద్ధభిక్షువులు బుద్ధుని అస్థికలపై చైత్యాలు నిర్మించుకున్నారు. ఆ తర్వాత ఆ చైత్యాలను పవిత్ర ఆలయాలుగా భావించి – బుద్ధుణ్ణి దేవుడిగా పూజించడం మొదలు పెట్టారు. క్రమంగా లెక్కలేనన్ని బుద్ధ విగ్రహాలు అన్ని చోట్లా వ్యాపించాయి. ఆ తర్వాత, అశోకుడి కాలంలో బహిరంగ స్థలాలలో బౌద్ధ స్థూపాలు వెలిశాయి. వాటిమీద బుద్ధుడి జీవిత చరిత్ర, బౌద్ధజాతక కథల చిత్రాలు చెక్కుకున్నారు. ఆ రకంగా మన దేశంలో మొదటి ఆరామాలైనా, స్థూపాలైనా, శిల్పాలైనా అన్నీ బౌద్ధులు చెక్కినవే! బుద్ధుడి గోర్లు నిక్షిప్తం చేసిన చోటు – 'నక్లవ్' పట్టణం కాలక్రమంలో లక్నోగా మారింది. గుజరాత్ ప్రాంతానికి ఒకప్పటి పేరు బుద్ధదేశ్. ముంబాయి ఒకప్పుడు బౌద్ధక్షేత్రమనడానికి చాలా ఆధారాలున్నాయి. పురాతన హిందూ దేవాలయాలు, హిందూ దేవతా విగ్రహాలు ఏవైనా – అవన్నీ నిస్సందేహంగా మార్పులు చేసుకున్న బౌద్ధారామాలు, బుద్ధుడి విగ్రహాలు మాత్రమేనన్నది – ప్రసిద్ధ చరిత్రకారులంతా ముక్తకంఠంతో చెప్పిన విషయం! ఇకపోతే.. బుద్ధుడు హిందువనడానికి ఒక్క ఆధారం కూడా లేదు. ఆయన హిందువే కానప్పుడు ఆయన్ని హిందూమతంలో చేర్చుకుని, దశావతారాల్లో భాగం చేసుకోవడం జనాన్ని మోసం చేయడం కాదా? సత్యాన్ని దాచిపెట్టి, వచ్చే తరాల వారి కళ్ళుగప్పడం కాదా? ఏమైనా, బుద్ధుడి విలువను, ప్రత్యేకతను ఆయనకు అలా ఉంచి, మహనీయుడిగా, పరిపూర్ణుడిగా గౌరవించుకోవడం, నమస్కరించుకోవడం విజ్ఞత అనిపించు కుంటుంది!

- వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త.

కర్నాటకలో బీజేపీ టిక్కెట్ల కుంభకోణం!

ఆమె మూడు పదులు నిండకుండానే అన్ని విధాలుగా పేరు మోసిన కట్టర్ హిందూత్వవాది. అతడు తన మఠం, కాషాయ దుస్తులతో మోసానికి పాల్పడిన మరో కట్టర్. వీరితో చేతులు కలిపిన మరో నలుగురితో కలసి వారు ఇప్పుడు బెంగళూరు పోలీసు కస్టడీలో ఉన్నారు. ఉద్రేక, ఉన్మాద ఉపన్యాసాలు చేసి రెచ్చగొట్టటంలో పేరు మోసిన హిందూత్వ నేతగా పేరున్న చైత్ర కుందాపుర, శ్రీ హలస్వామి మహాసంస్థాన్ మఠ అధిపతి అభినవ హలస్వామి, వారితో చేతులు కలిపిన బీజేపీ యువ మోర్చా నేతలు, ఇతరులు ఈ 'టికెట్ కేసు'లో ఉన్నారు. అధికారంలో ఉన్న పెద్దలతో తమకు ఉన్న సంబంధాలను ఉపయో గించి నామినేటెడ్ పోస్టులు, కాంట్రాక్టులు, ఎన్నికల్లో పోటీకి టిక్కెట్లు ఇప్పిస్తామంటూ డబ్బులు కొట్టేసేవారి గురించి బయటకు తెలిసేది తక్కువ. ఎందుకంటే చెప్పుకుంటే పరువు పోతుందని అనేక మంది తేలుకుట్టిన దొంగల మాదిరి కిమ్మనరు. కర్నాటకలో ఇప్పుడు బీజేపీ టిక్కెట్ల కుంభకోణం వెల్లడి కావటంతో ఆ పార్టీ ఇప్పుడు ఇరుకున పడింది. తమకేమీ సంబంధం లేదని పార్టీ నేతలు చెబుతుండగా, అగ్ర నేతల ప్రమేయం ఉందని కేసుల్లో అరెస్టయిన వారు అంటున్నారు.

ఉడిపి జిల్లాలోని బైందూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో తనకు బీజేపీ టిక్కెట్ ఇస్తామంటూ డబ్బు తీసుకొని మోసం చేశారని గోవిందబాబు పూజారి అనే వ్యాపారవేత్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి కార్యాలయం, ఆర్‌ఎస్‌ఎస్ నేతలతో తమకు ఉన్న సంబంధాల గురించి చెప్పి డబ్బు వసూలు చేశారన్నది వారి మీద మోపిన నేరం. తనకు ఒకరిని పరిచయం చేసి అతగాడు ఆర్‌ఎస్‌ఎస్ నేత అని చెప్పారని, బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీకి నిధులు అవసరమంటూ చెప్పటంతో అతగాడికి రూ.మూడు కోట్లు, మరో రూ. రెండు కోట్లు చైత్ర అనుచరులకు చెల్లించినట్లు పూజారి తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బు తీసుకున్నప్పటి నుంచి వారంతా తప్పించుకుంటున్నారని తెలిపాడు. అనేక రాష్ట్రాలలో ఇలాంటి మోసగాళ్లు ఎందరో ఉన్నారు. కర్నాటకలో 2020లో బెంగళూరు పోలీసులు స్వామి అలియాస్ సేవాలాల్ అనే జ్యోతిష్కుడు యువరాజ్ రామదాస్‌ను అరెస్టు చేశారు. అతగాడు 2014 నుంచి 2020 వరకు అనేక మంది నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు వార్తలొచ్చాయి. ఒక గవర్నర్, ఒక కేంద్ర మంత్రి, ఒక రాజ్యసభ సభ్యుడితో తనకు సన్నిహిత సంబంధాలున్నట్లు చెప్పేవాడు. 2015లో జౌళిశాఖ కేంద్ర మంత్రిగా ఉన్న సంతోష్ గాంగవార్‌కు శ్రీకాళహస్తికి చెందిన కోలా ఆనంద కుమార్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. కేంద్ర సిల్క్‌బోర్డు చైర్మన్ పదవి ఇప్పిస్తానంటూ ఒకటిన్నర కోట్ల రూపాయలు వసూలు చేశాడు. ఈ స్వామికి ఒక ప్రముఖ బీజేపీ నేత తనను పరిచయం చేసినట్లు, తన దగ్గర డబ్బు తీసుకున్న తరువాత పదవీ లేదు, స్వామి ముఖం చాటేసినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆనందకుమార్ పేర్కొన్నారు. సదరు స్వామి ఒక ఎంపీని తిరిగి నామినేట్ చేయిస్తానని రూ.ఇరవై కోట్లు, కర్నాటక హైకోర్టు మాజీ మహిళా జడ్జికి గవర్నర్ పదవి ఇప్పిస్తానంటూ రూ.ఎనిమిదిన్నర కోట్లు కోట్లు వసూలు చేశాడు. బిఎస్ ఇంద్రకళ అనే ఆ మాజీ జడ్జి నగదు రూపంలో నాలుగున్నర కోట్లు, ఆర్‌టిజిఎస్ ద్వారా రూ.3.77 కోట్లు చెల్లించారు. ఆమెను ఢిల్లీ తీసుకువెళ్లి కొంత మంది బీజేపీ అగ్రనేతలను పరిచయం చేశారట. ఆమె 2020లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యాయమూర్తులుగా ఎలాంటి వారు ఎంపిక అవుతున్నారు, గవర్నర్ పదవులను కొనుక్కోవటం ఎంత సులభంగా ఉంటుందో డబ్బు, పలుకుబడి కలవారి ప్రయత్నాల గురించి ఈ ఉదంతం వెల్లడించింది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలతో ఉన్న పలుకుబడితో తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించమని ఒక డాక్టర్ రూ.30లక్షలు సమర్పించుకున్నారట. 2019లో స్వామి తనను రూ.పది కోట్లకు మోసం చేసినట్లు శశికాంత్ బంద్రే అనే వాణిజ్యవేత్త ఫిర్యాదు చేసిన తరువాత పైన పేర్కొన్న మోసాలన్నీ వెలుగులోకి వచ్చాయి.

ఇక హిందూత్వ నాయకురాలు చైత్ర కుందాపూర్, ఆమె గ్యాంగ్ మోసం చేసిన తీరు గురించి పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. మోసగాళ్ల ముఠాలో స్వామీజీతో పాటు కబాబ్‌లు తయారు చేసి అమ్ముకొనే వ్యక్తి, ఒక క్షురకుడు ఉన్నారు. తమ సైద్ధాంతిక గురువు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, ప్రధాని కార్యాలయంలో తనకు పెద్ద తలకాయలు ఎందరో తెలుసని చైత్ర ప్రచారం చేసుకుంది. 2022లో వ్యాపారవేత్త పూజారికి ప్రసాద్ బైదూర్ అనే వ్యక్తిని పరిచయం చేసి అతను బీజేపీ కార్యకర్త అని చెప్పారు. చైత్ర



తలచుకుంటే రాష్ట్రంలో, కేంద్రంలో ఏదైనా సాధించగలదని అతను పూజారిని నమ్మించాడు. అది బాగా పని చేసిందని గ్రహించిన తరువాత ఆ ముఠా గగన్ కదూర్, రమేష్ నాయక్ అనే వారిని పరిచయం చేశారు. రమేష్ తన పేరును దాచి తాను చిక్‌మగళూరుకు చెందిన విశ్వనాథ్ అనే ఆర్‌ఎస్‌ఎస్ నేతనని గత 45ఏళ్లుగా పనిచేస్తున్నట్లు నమ్మించాడు. తరువాత బెంగళూరులోని ధనికులు నివాసముండే ప్రాంతంలో చెన్నా నాయక్ అనే అతన్ని బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యుడని పరిచయం చేశారు. ఒక పర్యావరణవేత్త, పద్మశ్రీ అవార్డు పొందిన 110సంవత్సరాల తిమ్మక్క కుమారుడు ఉమేష్‌తో గగన్ కదూర్‌కు పరిచయం ఉంది. ఆమెకు వయసు పైబడటంతో కాబినెట్ స్థాయి కల్పించి ఒక కారు కూడా ఇచ్చారు. ఉమేష్‌ను ఒప్పించి ఆ కారులో చెన్నా నాయక్, ఇతర ముఠా పూజారిని కలిశారు. అధికారిక కారును చూసి నిజంగానే పలుకు బడి కలిగిన వారని పూజారి నమ్మాడు. టిక్కెట్ కనుక రాకపోతే ఇచ్చిన సొమ్ము పూర్తిగా తిరిగి ఇస్తామని రమేష్ నాయక్ నమ్మబలికాడు. మూడు రోజుల్లో రూ.50లక్షలు, తరువాత రూ.మూడు కోట్ల మేర వసూలు చేశారు. ఆ సొమ్ములో ఒకటిన్నర కోట్లు అభినవ హలశ్రీ స్వామి అనే మఠాధిపతికి చెల్లించినట్లు పూజారి పేర్కొన్నాడు. 2022 జులై ఏడు నుంచి 2023 జనవరి 16 వరకు మొత్తం ఐదు కోట్లు సమర్పించుకున్నాడు.

బీజేపీ అభ్యర్థులను ప్రకటించటానికి కొద్ది రోజుల ముందు కాశ్మీరులోని ఒక ఆసుపత్రిలో ఆర్‌ఎస్‌ఎస్ నేత విశ్వనాథ్ మరణించినట్లు గగన్‌కదూర్ చెప్పాడు. అనుమానం వచ్చిన పూజారి విచారించగా అసలు ఆ పేరుగల వ్యక్తిలేడని తేలింది. దాంతో తన డబ్బు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయటంతో మోసగాళ్ల ముఠా తప్పించుకు తిరిగింది. చివరకు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అరెస్టు చేశారు. సెప్టెంబరు పన్నెండు నుంచి హలశ్రీ స్వామి పరారీలో ఉండి పందొమ్మిదవ తేదీ రాత్రి ఒడిషా పోలీసులకు చిక్కాడు. ఇంతకీ రమేష్ నాయక్ చిక్‌మగలూర్‌లోని ఒక క్షురకుడు అని తేలింది. చెన్నానాయక్ బెంగళూర్ కెఆర్‌పురంలో వీధుల్లో కబాబ్‌లు అమ్ముతాడని పోలీసులు గుర్తించారు. పూజారి నుంచి కొట్టేసిన సొమ్ములో భారీ మొత్తాన్ని చైత్ర నొక్కేసింది. విద్యార్థినిగా ఉండగా ఏబీవీపీలో పని చేసిన చైత్ర కొన్ని పత్రికల్లో జర్నలిస్టుగా, స్పందన అనే టీవీలో యాం కర్‌గా పని చేసింది. హిందూత్వ కార్యకర్తగా మైనారి టీల మీద రెచ్చగొట్టే ప్రసంగాలతో అనేక పాత్రల్లో కనిపించిన చైత్ర 2018లో ఉడిపి పట్టణంలో కాంగ్రెస్ మీద ధ్వజమెత్తి వెలుగులోకి వచ్చింది. కేంద్ర మంత్రులు కూడా ఆమెను ఆకాశాకెత్తారు. ముస్లింల మీద విద్వేష పూరిత ప్రసంగాలు చేసినందుకు ఆమెపై కేసులు కూడా నమోదు చేశారు. ఈ ఉపన్యాసాలకు బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఏర్పాటు చేసిన ప్రదర్శనలు, సభలు, సమావేశాలే వేదికలు.

అవివాహిత అయిన చైత్ర కుందాపుర మీద ఉడిపిలో బీజేపీ కార్యకర్త సుధీన్ ఒక కేసు దాఖలు చేశాడు. తన కోసం ఒక దుకాణాన్ని కట్టిస్తానని చెప్పి ఆమె రూ.ఐదు లక్షలు తీసుకున్నదని, అది చేయకపోగా సొమ్ము వాపసు అడిగితే అత్యాచారం చేసినట్లు కేసు పెడతానని, హత్య చేయిస్తానని బెదిరించినట్లు పేర్కొన్నాడు. బీజేపీ టిక్కెట్ పేరుతో సొమ్ము తీసుకున్న వ్యాపారి పూజారిని కూడా బెదిరించినట్లు వెల్లడైంది. అరెస్టుకు ముందు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఒక లేఖ రాసి అతని వాణిజ్య లావాదేవీల మీద విచారణ జరపాలని, దర్యాప్తుకు తాను సహకరిస్తానని పేర్కొన్నది. తాను జర్నలిస్టుగా ఉన్నప్పటి నుంచి గోవిందబాబు పూజారి తెలుసునని, బీజేపీ టిక్కెట్ కోసం చూశాడని, తాను ఒక ప్రయివేటు కంపెనీలో పని చేసినపుడు అతని అక్రమ లావాదేవీల గురించి తెలుసుకున్నట్లు రాసింది. అతని ఆక్రమాలను బయట పెట్టేందుకు అతనితో సంబంధాల్లో ఉండి సమాచారం సేకరించినట్లు చెప్పుకుంది. చిత్రం ఏమిటంటే సదరు పూజారికి ఎంఎల్ఏ టిక్కెట్ రాకున్నా, ఎన్నికలకు ముందు బీజేపీ వెనుకబడిన తరగతుల మోర్చా కార్యదర్శి పదవిని బహూకరించారు. ఏ నియోజకవర్గంలో టిక్కెట్‌ను ఆశించాడో అదే చోట బీజేపీ అభ్యర్థికి ప్రచారం చేశాడు. అనేక మంది నేతలతో సంబంధాలను ఏర్పాటు చేసుకొని ఒక గుర్తింపు పొందాడు. అధికారం వచ్చిన తరువాత ఆ సొమ్మును ఏదో విధంగా రాబట్టుకోవచ్చని భావించి ఉండాలి. బీజేపీ ఓడిపోవటం, పార్టీ పదవి ఉన్నా ప్రయోజనం లేదని గ్రహించిన తరువాత తన సొమ్ము తనకు ఇచ్చివేయాలని డిమాండ్ చేయటంతో అసలు కథ బట్టబయలైనట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

- సత్య

బిజినెస్

బిఎండబ్ల్యు నుంచి పూర్తి ఎలక్ట్రిక్ ఎస్‌యువి



న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు కొత్తగా బిఎండబ్ల్యు ఐఎక్స్1 ఎక్స్‌డ్రైవ్30 ఎం స్పోర్ట్‌ను విడుదల చేసింది. ఇది పూర్తి స్థాయి విద్యుత్ ఎస్‌యువి అని ఆ కంపెనీ తెలిపింది. ఎక్స్‌షోరూం ప్రారంభ ధరను రూ.66.90 లక్షలుగా నిర్ణయించింది. అక్టోబర్ నుంచి వీటి డెలివరీలను ప్రారంభించనున్నట్లు బిఎండబ్ల్యు గ్రూపు ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పహ్వా తెలిపారు. ఇకపై తమ వినియోగదారులు పెట్రోల్, డీజిల్, విద్యుత్ వాహనాల్లో దేనినైనా ఎంచుకోవచ్చన్నారు. ఐఎక్స్1 కేవలం 5.6 సెకన్లలోనే 0-100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదన్నారు.

ఏషియన్ పెయింట్స్ అశ్విన్ కన్నుమూత



ముంబయి : ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకులు, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అశ్విన్ డాని కన్నుమూశారు. కంపెనీ నలుగురు సహ వ్యవస్థాపకుల్లో ఆయన ఒక్కరు. డాని మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు కంపెనీని నూతన శిఖరాలకు తీసుకెళ్లారు. 79 ఏళ్ల అశ్విన్ డాని మరణించడంతో గురువారం ఆ కంపెనీ షేర్లు 4 శాతం మేర నష్టపోయాయి.

క్రిస్టల్ క్రాప్ చేతికి సదానంద్ కాటన్ సీడ్స్

న్యూఢిల్లీ : పంటల రక్షణ, మార్కెటింగ్ కంపెనీ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ తాజాగా కోహినూర్ సీడ్స్‌కు చెందిన సదానంద్ కాటన్ సీడ్స్ వ్యాపారాన్ని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. దీంతో తమ పత్తి విత్తనాల పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేసుకున్నట్లయ్యిందని పేర్కొంది. పత్తి విత్తనాల వ్యాపారంలో వాటాదారులకు సమగ్రమైన, వినూత్న, ప్రగతిశీల పరిష్కారాలను అందించాలనే తమ లక్ష్యానికి ఈ విలీనం మరింత దోహదం చేయనుందని క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ సీడ్స్ సిఇఒ సత్యేందర్ సింగ్ పేర్కొన్నారు.

ఐసిఐసిఐ లాంబార్డ్‌కు రూ.1,728 కోట్ల జీఎస్టీ నోటీసు

పూణె : ప్రయివేటు రంగ సాధారణ బీమా సంస్థ ఐసిఐసిఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జిఎస్‌టి ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) డిమాండ్ నోటీసును జారీ చేసింది. రూ.1,728 కోట్లు విలువ చేసే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని జీఎస్టీ దర్యాప్తు సంస్థ తెలిపింది. 2017 జులై నుంచి 2022 మార్చి మధ్య చేసిన కొన్ని సరఫరాలకు సంబంధించి ఐసిఐసిఐ లాంబార్డ్ పన్నులు చెల్లించలేదని డిజిజిఐ పూణె ప్రాంతీయ కార్యాలయం నోటీసుల్లో పేర్కొంది. తగిన వివరణతో నోటీసులపై స్పందిస్తామని ఐసిఐసిఐ లాంబార్డ్ తెలిపింది.

క్షతగాత్రులకు అండగా మంత్రి ప్రశాంత్‌రెడ్డి

- తన ఎస్కార్ట్ వాహనంలో బాధితులను ఆస్పత్రికి పంపిన వైనం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి గురువారం నియోజకవర్గ పర్యటన ముగించుకుని హైదరాబాద్ వస్తుండగా మేడ్చల్ నుంచి కొంపల్లి రూట్లో ప్రమాదవశాత్తు బైకుపై నుంచి పడిపోయిన భార్యభర్తలతో పాటు చిన్నారిని ఎస్కార్ట్ వాహనంలో ఆస్పత్రికి తరలించారు. బైకుపై నుంచి కింద పడిపోయిన వారిని చూసి మంత్రి వెంటనే తన కాన్వాయిని ఆపించారు. వారిని పరామర్శించి యోగాక్షేమాలు అడిగారు. మనోధైర్యం చెప్పారు. మహిళకు గాయాలు కావడంతో ఆమెతో పాటు భర్తను, చిన్నారిని తన ఎస్కార్ట్ వాహనం ఎక్కించి ఆస్పత్రికి పంపించారు. తమ కోసం మానవతా దృక్పథంతో స్పందించిన మంత్రి వేములకు బాధితులు చేతులెత్తి కృతజ్ఞతలు తెలిపారు.

సభా హక్కుల కమిటీకి బిదూరీ వివాదం

న్యూఢిల్లీ : బిఎస్‌పి ఎంపి డానిష్ అలీని అసభ్యకరంగా, అభ్యంతరకరమైన మాటలతో దూషించిన బిజెపి ఎంపి రమేష్ బిదూరీపై పార్లమెంట్ సభ్యులు చేసిన ఫిర్యాదులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభా హక్కుల కమిటీకి నివేదించారని సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. బిదూరీపై చర్యలు తీసుకోవాలంటూ అలీ, అదిర్ రంజన్ చౌదరి, కనిమొళిలతో సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా బిదూరీని రెచ్చగొట్టేలా అలీ మాట్లాడారని, స్పీకర్ ఈ విషయాన్ని కూడా పరిశీలించాలని నిషికాంత్ దూబే, ఇతర బిజెపి ఎంపిలు కోరారు.

రేపటితో ముగియనున్న రూ.2వేల నోటు మార్పిడి గడువు

న్యూఢిల్లీ : రూ.2,000 నోట్ల మార్పిడికి మరికొన్ని గంటల్లో గడువు ముగియనుంది. ఈ పెద్ద నోటు మార్పిడికి సెప్టెంబర్ 30 వరకు గడువు ఇస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ నోటు మార్చుకోవడానికి మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉంది. ఆ తర్వాత ఎలాంటి నిర్ణయం తీసుకునేది ఆర్బీఐ వెల్లడించలేదు. రూ.2వేల నోట్లను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఈ ఏడాది మేలో ఆర్బీఐ ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

అది పార్టీ పంచాయతీ కాదు : కత్తి వెంకటస్వామి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మైనంపల్లి హనుమంతరావు, వేముల వీరేశం, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చేరికల కార్యక్రమానికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దూరంగా ఉండటం పార్టీ పంచాయతీ కాదనీ, అది రెడ్ల పంచాయతీ అని కాంగ్రెస్ ఓబీసీ జాతీయ నేత కత్తి వెంకటస్వామి వ్యాఖ్యానించారు. ఈమేరకు గురువారం ఆయన నవతెలంగాణతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో వారు కొట్లాడితేనే అది పార్టీ పంచాయతీ అవుతుందన్నారు. పార్టీపైనా, కోమటిరెడ్డిపైనా తీవ్ర విమర్శలు చేసిన అనిల్ కుమార్‌రెడ్డిని రేవంత్‌రెడ్డి చేర్చుకున్నారనీ, అందుకే వెంకట్‌రెడ్డి దూరంగా ఉన్నారని తెలిపారు.

కేజ్రీవాల్ నివాసంపై సీబీఐ విచారణ మొదలు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసం నిర్మాణం, పునరుద్ధరణలో జరిగిన అవకతవకలపై సీబీఐ ప్రాథమిక విచారణను ప్రారంభించింది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులు తెలిపారు.ఆరోపణలను ధృవీకరించడానికి దర్యాప్తు ఏజెన్సీ ప్రాథమిక విచారణను నిర్వహిస్తుంది. దాని ఆధారంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలా వద్దా అనే నిర్ణయాన్ని అధికారులు తీసుకుంటారు. ఈ అక్రమాలను మొదట లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) కార్యాలయం లేవనెత్తింది. వారు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) చేత ఆడిట్ చేయాలని కోరుతూ ఈ ఏడాది మేలో కేంద్ర హెూం వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ)కి లేఖ రాశారు. మార్పు పేరుతో సీఎం అధికారిక నివాసం పునర్నిర్మాణంలోఅవకతవకలు జరిగాయని ఎల్జీ కార్యాలయం పేర్కొన్నది. సీబీఐ ప్రాథమిక విచారణపై అధికార ఆప్ స్పందించింది. ఆప్ ఎలాంటి తప్పూ చేయలేదని ఖండించింది.

గణపతికి.. ఘన వీడ్కోలు

(మొదటిపేజీ తరువాయి)

ఆకర్షించాయి. వివిధ రూపాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను చూసేందుకు జిల్లాల వారితోపాటు నగరమంతా ట్యాంక్‌బండ్‌కు పయనమైంది.

బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్‌తోపాటు వివిధ మార్గాల్లో శోభయాత్ర సందడిగా సాగింది. రహదారుల పొడవునా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్ల వద్ద నీళ్ల, పులిహెూరాను అందించారు. మరికొన్ని చోట్ల భోజనాలు, పూరీలు, సమోసాలను పంచిపెట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్‌డ కమిషనరేట్ల పరిధిలో 40వేల మందికిపైగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 25వేలకుపైగా సీసీ కెమెరాలతో పర్యవేక్షించారు. నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. వెంట వెంటనే క్రేన్లతో విగ్రహాలను నిమజ్జనం చేశారు. హుస్సేన్‌సాగర్‌లో అర్ధరాత్రి వరకు వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి.

మంత్రులు తలసాని, మహమూద్ అలీ ఏరియల్ వ్యూ

గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాన్ని మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి మంత్రులు డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్ సీపీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌తో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా నగరంలో గణేష్ విగ్రహాల శోభాయాత్ర, హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జనాలను పరిశీలించారు. అంతకుముందు మంత్రి తలసాని నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్రలో పాల్గొన్న అనంతరం చార్మినార్, మోజం జాహి మార్కెట్, ఆబిడ్స్, లిబర్టీ, తెలుగుతల్లి ఫ్లై ఓవర్ వద్ద శోభాయాత్రగా వస్తున్న విగ్రహాలకు స్వాగతం పలికారు. తదనంతరం హుస్సేన్‌సాగర్‌లో బోట్‌లో తిరిగి నిమజ్జనాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఈ సంవత్సరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 90 వేల విగ్రహాలను ఏర్పాటు చేశారని, శుక్రవారం ఉదయం వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశముందని చెప్పారు.

వార్ రూం నుంచి పరిశీలన

గణేష్ నిమజ్జనాన్ని బంజారాహిల్స్‌లోని సీసీసీలోని (కమాండ్ కంట్రోల్ రూం) వార్ రూం నుంచి హెూంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్, సీపీ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ పరిశీలించారు. సిబ్బందికి కావాల్సిన సలహాలు, సూచనలు అందించారు. అనంతరం హెలీక్యాప్టర్‌లో ఏరియల్ వ్యూవ్ దారా నగరంలో కొనసాగిన శోభయాత్రను పరిశీలించారు. జలమండలి ఏర్పాటు చేసిన తాగు నీటి శిబిరాలను ఎండీ దాన కిశోర్ తనిఖీ చేశారు.

ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఆయన అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. నీటి నాణ్యత, క్లోరిన్ పరీక్షల వివరాలు అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు.

7గంటలు సాగిన ఖైరతాబాద్ గణేషుడి శోభాయాత్ర జనసంద్రమైన సాగర్ పరిసర ప్రాంతాలు..



ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం ముగిసింది. వేలాది మంది వెంట రాగా ఉదయం 6.30గంటలకు మండపం నుంచి దశ మహా విద్యాగణపతి శోభాయాత్ర ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.30 గంటలకు ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ మార్గ్ క్రేన్ నెం.4 వద్ద నిమజ్జనం పూర్తి చేశారు. దాదాపు 7గంటలపాటు సాగిన శోభాయాత్రకు సందర్శకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల రాకతో హుస్సేన్‌సాగర్ ప్రాంగణం కిక్కిరిసింది. ఏడాదికో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న ఖైరతాబాద్ గణేష్ ఈసారి 63 అడుగులు, సిద్ధి, బుద్ధి సమేత గణపతిగా కనిపించారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన శోభాయాత్ర ఖైరతాబాద్, టెలిఫోన్ భవన్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ట్యాంక్ బండ్ వద్దకు చేరుకుంది. ఈ శోభా యాత్ర కోసం పోలీసులు భారీ ఏర్పాట్లు చేశారు.

'బీసీలకు జనాభా ప్రకారం సీట్లు కేటాయించండి'

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీలకు జనాభా ప్రకారం టికెట్లు కేటాయించాలని బీసీ రాజ్యాంధికార సమితి జాతీయ అధ్యక్షులు దాసు సురేష్ కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోఆ పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రేకు బీసీల వివరాలతో కూడిన నివేదికను అందజేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీల అవకాశాలను ద్విగుణీకృతం చేసే దిశగా వారి జనాభా 60శాతం పైనున్న 42 నియోజకవర్గాలు, 50 శాతం పైచిలుకు జనాభా ఉన్న 72 స్థానాల వివరాలను సమర్పించారు.

గుండె జబ్బుల నివారణకు కార్డియాక్ రిహాబ్

- రిస్క్ గ్రూపునకు ఉపయోగపడుతున్న వైనం
- జబ్బుకు గురైనా రిహాబ్‌తో మళ్లీ సాధారణ జీవితం
- దేశంలోనే హైదరాబాద్ కేంద్రంగా...



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గుండెను పదిలంగా చూసుకోవాలని పెద్దలు చెబుతుంటారు. శరీరంలో కీలకమైన ఈ అవయవం లబ్ డబ్ శబ్దానికి బదులుగా పదే పదే ఆటుపోటులకు గురవుతుంటుంది. మారిన జీవనశైలి, ఒత్తిడి గుండెపై పెను ప్రభావం చూపిస్తున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా హృద్రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ప్రతి ఏడాది సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాదికిగాను 'గుండెను ఉపయోగించుకో... గుండెను తెలుసుకో' అనే అంశాన్ని ఎంపిక చేశారు. ప్రపంచవ్యాప్తంగా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (అసాంక్రమిత వ్యాధులు) పెరిగిపోతుండగా అందులో గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఈ జబ్బులు వచ్చిన తర్వాత దానికి చికిత్స, రకరకాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి. గుండె జబ్బులు రాకుండా నివారణకు జీవనశైలిని, ఆహారపు అలవాట్లను మార్చుకోవడం, తగిన వ్యాయామం వంటివి నిపుణులు సూచిస్తున్నారు. అయితే గుండె పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తులో గుండె జబ్బులు రాకుండా నివారించడం, ఇది వరకే గుండె జబ్బుల బారిన పడి ఉంటే వారి గుండె బలాన్ని పెంచేందుకు కార్డియాక్ రిహాబ్ దోహదం చేస్తున్నది. భారతదేశంలో ఉన్న ఒకే ఒక్క కార్డియాక్ రిహాబ్ హైదరాబాద్‌లో ఉండడం గమనార్హం.

ప్రస్తుతం ప్రయివేటుగా అందుతున్న ఈ సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి పేద ప్రజలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్డియాక్ రిహాబ్ ఫిజిషియన్ డాక్టర్ మురళీధర్ బాబీ కోరారు.

కార్డియాక్ రిహాబ్ దాదాపు మూడు నెలల పాటు కొనసాగుతున్నది. కొన్ని సందర్భాల్లో కొద్ది కాలం ఎక్కువ కూడా రిహాబ్ చేస్తుంటారు. ఇప్పటికే గుండెపోటుకు గురైన వారికి, శస్త్రచికిత్స చేసుకున్న వారికి రిహాబ్ ఇచ్చిన తర్వాత ఇంటికి పరిమితం అయిన స్థితి నుంచి ఏకంగా పరుగుపందాల్లో కూడా పాల్గొంటుండటం విశేషం. ప్రస్తుతం గుండె జబ్బులు వయస్సుతో నిమిత్తం లేకుండా అందరిని భయపెడుతున్న తీరు తెలిసిందే. ఈ నేపథ్యంలో రిహాబ్ కూడా అన్ని వయస్సుల వారికి ఉపయోగపడుతుండటం గమనార్హం. గుండె మార్పిడి చేయించుకోవాలని సూచించిన రోగులు మొదలు బైపాస్ సర్జరీ, ఇతరత్రా గుండె సంబంధిత వ్యాధులు కలిగిన వారు కూడా రిహాబ్ చేసుకుంటూ కొత్త జీవితాన్ని గడుపుతున్నారు. జబ్బు రాకమునుపు మాదిరిగా తమ విధులకు వెళుతూ ఆశ్చర్యం కలిగిస్తున్నారు.

సాధారణంగా మధుమేహం, హైపర్ టెన్షన్, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు కలిగిన కుటుంబ చరిత్ర, ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడిపే వారు ఎక్కువగా గుండెపోటుకు గురయ్యే ప్రమాదంలో ఉంటారు. ఇలాంటి వారు హార్ట్ ఆటాక్స్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా రిహాబ్ చేసుకుంచే మంచిది. తద్వారా వారి భవిష్యత్ గుండె జబ్బులను నివారించుకోవడమే కాకుండా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడే అవకాశమున్నది.

డాక్టర్లు అర్థం చేసుకోవాలి
డాక్టర్ మురళీధర్ బాబీ



కార్డియాక్ రిహాబ్ ఇస్తున్న ఫలితాలను కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిక్ సర్జన్లు, ఫిజిషియన్లు, ఇతర డాక్టర్లు అర్థం చేసుకోవాలని కార్డియాక్ రిహాబ్ స్పెషలిస్ట్ డాక్టర్ మురళీధర్ బాబీ సూచించారు.

హృద్రోగుల్లో వస్తున్న మార్పును గమనించాలని కోరారు. రిహాబ్ గుండె జబ్బులతో పాటు ఇతర జబ్బుల తీవ్రతను తగ్గిస్తున్న విషయాలు ఆయా కేసుల విషయంలో గమనించినట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.CardiacRehab.com లో సంప్రదించాలని సూచించారు.

అప్పుల భారతం

విదేశీ రుణాలు రూ.52 లక్షల కోట్లు

- కరెంట్ ఖాతా లోటు ప్రమాద ఘంటికలు : ఆర్‌బీఐ రిపోర్ట్‌లో వెల్లడి

న్యూఢిల్లీ : భారత దేశం అప్పుల కుప్పగా మారింది. మరోవైపు దేశ ఎగుమతులు క్షీణించడం, దిగుమతులు పెరగడంతో వాణిజ్య లోటు ఎగిసిపడి.. తద్వారా కరెంట్ ఎకౌంట్‌పై తీవ్ర ఒత్తిడి పెరిగిందని ఆర్‌బీఐ గణంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ఏడాది జూన్ చివరి నాటికి విదేశీ రుణాలు 629.1 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.52 లక్షల కోట్లకు సమానం. గురువారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించిన గణంకాల ప్రకారం.. ప్రస్తుత ఏడాది మార్చి చివరి నాటికి 624.3 బిలియన్లుగా ఉన్న విదేశీ అప్పులు మరో 4.7 బిలియన్లు పెరిగాయి. "2023 మార్చి చివరి నాటికి జీడీపీలో విదేశీ అప్పులు 18.8 శాతంగా ఉండగా.. 2023 జూన్ చివరి నాటికి 18.6 శాతంగా నమోదయ్యాయి. ఇందులో 54.4 శాతం వాటాతో అమెరికన్ డాలర్ విలువ కలిగిన రుణాలున్నాయి. భారత రూపాయల్లో 30.4 శాతం, ఎస్‌డిఆర్ 5.9 శాతం, యెన్ 5.7 శాతం, యూరో 3.0 శాతం చొప్పున నిష్పత్తి విలువ కలిగిన అప్పులున్నాయి." అని ఆర్‌బీఐ తెలిపింది.

జూన్ 2023 చివరి నాటికి దీర్ఘకాలిక రుణం (ఒక సంవత్సరం పైన ఉన్న అసలు మెచ్యూరిటీతో) 505.5 బిలియన్ల అప్పులున్నాయి. ఇది ఇంతక్రితం త్రైమాసికం ముగింపుతో పోల్చితే 9.6 బిలియన్లు పెరిగింది. మొత్తం విదేశీ రుణంలో స్వల్పకాలిక రుణాల వాటా (ఒక సంవత్సరం వరకు మెచ్యూరిటీతో) 2023 మార్చి చివరి నాటికి 20.6 శాతం నుండి ఈ ఏడాది జూన్ చివరి నాటికి 19.6 శాతానికి తగ్గాయి. మోడీ ప్రభుత్వం స్వల్ప కాల అప్పులను తగ్గించుకుని.. దీర్ఘకాల రుణాలను పెంచుకోవడం ద్వారా ప్రజలపై మరింత అదనపు భారం మోపినట్లయ్యింది.

ఏడు రెట్లయిన కరెంట్ ఖాతా లోటు

భారత కరెంట్ ఎకౌంట్ లోటు (సిఎడి) ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో సిఎడి ఏకంగా ఏడు రెట్లు ఎగిసి 9.2 బిలియన్ డాలర్లుగా చోటు చేసుకుంది. ఇంతక్రితం త్రైమాసికంలో ఇది 1.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. దేశ ఎగుమతుల కంటే దిగుమతులు ఎక్కువగా ఉండటంతో విదేశాలకు భారత చెల్లింపులు అధికంగా ఉండటమే కరెంట్ ఎకౌంట్ లోటు. గడిచిన జూన్ త్రైమాసికంలో జీడిపిలో కరెంట్ ఎకౌంట్ లోటు 1.1 శాతానికి పెరిగిందని ఆర్‌బీఐ వెల్లడించింది. వాణిజ్య లోటు పెరగడంతో కరెంట్ లోటు ఎగిసిందని పేర్కొంది. "ప్రధానంగా కంప్యూటర్, ట్రావెల్, వ్యాపార సేవల ఎగుమతుల క్షీణత కారణంగా నికర సేవల రసీదులు క్రమంగా తగ్గాయని తెలిపింది.

కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వండి

- భట్టి విక్రమార్కకు కిసాన్ కాంగ్రెస్ వినతి

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి కీలకమైన 'కిసాన్ కాంగ్రెస్' చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డికి టికెటు ఇవ్వాలంటూ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను ఆ విభాగం కోరింది. రైతు సమస్యలపై గడిచిన ఎనిమిదేండ్లుగా ఆయన నిరంతర పోరాటాలు చేస్తున్నారని గుర్తు చేసింది. ఈమేరకు గురువారం హైదరాబాద్‌లోని భట్టి నివాసంలో కలిసి ఆయనకు వినతిపత్రం సమర్పించారు. నిజామాబాద్ జిల్లాలో బలమైన శక్తిగా ఉన్న గురడి కాపు సామాజిక వర్గానికి చెందిన అన్వేష్ రెడ్డికి టికెట్ ఇస్తే... కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు చాలా మేలు జరుగుతుందని కోరారు. అన్ని జిల్లాల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ఉన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల రేవంత్ సంతాపం

ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల టీడీపీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశంలో మేలైన వరి వంగడాలను సృష్టించిన హరిత విప్లవానికి నాంది పలికిన స్వామినాథన్ మరణం దేశంలో వ్యవసాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబానికి నా సానుభూతి తెలిపారు. హరిత విప్లవ మార్గదర్శకుడు స్వామినాథన్

తెలంగాణ రైతు సంఘం

హరిత విప్లవ మార్గదర్శకుడు, ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని తెలంగాణ రైతు సంఘం అభిప్రాయపడింది. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏఐకేఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ ఆరిబండి ప్రసాదరావు, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అక్టోబర్ 5 నుంచి 'ఎస్ఏ-1' పరీక్షలు

13 నుంచి దసరా సెలవులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చేనెల ఐదో తేదీ నుంచి ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-1) పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అదేనెల 11 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు జరుగుతాయి. ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు నిర్వహిస్తారు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చేపడతారు. జవాబుపత్రాలను మూల్యాంకనం చేసి వచ్చేనెల 30న ఫలితాలను ప్రకటిస్తారు. నవంబర్ ఒకటిన తల్లిదండ్రుల సమావేశాలను నిర్వహించి మార్కుల రికార్డులను అందజేయడంతోపాటు విద్యార్థుల పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్చిస్తారు. వచ్చేనెల 13 నుంచి 25 వరకు రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు దసరా సెలవులుంటాయి.

చెరుకూరి వీరయ్య మృతికి సీపీఐ సంతాపం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

నీటిపారుదల రంగ నిపుణులు చెరుకూరి వీరయ్య మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు కృష్ణా, గోదావరి జలాల వినియోగం కోసం ఆయన విశేష కృషి చేశారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటిపారుదల కల్పనకు ఆయన తన అనుభవాన్ని వెచ్చించారని పేర్కొన్నారు. వీరయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వినాయక నిమజ్జనంలో విషాదం గోదావరిలో బాలుడి గల్లంతు

- బాణసంచా పడి చిరు వ్యాపార దుకాణం దగ్ధం

నవతెలంగాణ–భద్రాచలం రూరల్

వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పలు చోట్ల విషాద ఘటనలు జరిగాయి. రాష్ట్ర నలుమూలల నుంచి నవరాత్రులు ముగించుకొని శోభాయాత్రతో నిమజ్జన నిమిత్తం భద్రాచలానికి వేల సంఖ్యలో గణనాథులు తరలిరాగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ ఒకటి రెండు విషాదాలు జరిగాయి. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం వీర్య తండాకు చెందిన 20 మంది వినాయకున్ని నిమజ్జనానికి భద్రాచలం తీసుకొచ్చారు. నిమజ్జనం అనంతరం ముగ్గురు గోదావరిలో స్నానానికి దిగి గల్లంతు కాగా వెంటనే స్పందించిన ఎన్‌డిఆర్ఎఫ్ పోలీస్ సిబ్బంది ఇద్దరిని రక్షించినట్టు పట్టణ సీఐ నాగరాజు రెడ్డి తెలియజేశారు.

మరో బాలుడు గల్లంతయ్యాడు. గాలింపు చేపట్టారు. భద్రాచలం పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీలో అంబేద్కర్ సెంటర్ వద్ద బాణసంచా పేలుస్తుండగా నిప్పు రవ్వలు ఫుట్‌పాత్‌పై ఉన్న చిరు వ్యాపారి దుకాణం పడటంతో దగ్ధమైంది. మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయి. ఫైరింజిన్ వచ్చి మంటలను అదుపు చేసింది.

వినాయక లడ్డూ రికార్డు

- వేలంలో రూ.1.26కోట్లు
- బండ్లగూడ రిచ్‌మండ్ విల్లాలో ఘటన
- బాలాపూర్ లడ్డూ రూ.27లక్షలు

నవతెలంగాణ–గండిపేట్/ బడంగ్‌పేట్

వినాయక లడ్డూ వేలం రికార్డు స్థాయిలో పలికింది. బండ్లగూడలో రూ.1.26కోట్లకు లడ్డూను బీఆర్ దియా చారిటబుల్ ట్రస్టు సభ్యులు వేలంలో దక్కించుకున్నారు. ఈసారి బాలాపూర్ లడ్డూ వేలంలో రూ.27లక్షలు పలికింది. వివరాలిలా ఉన్నాయి.. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలోని పీఎస్ కాలనీ రిచ్‌మండ్ విల్లాలో వినాయక మండపం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో విల్లాలో ఉండే సుమారు 300 కుటుంబాలు పాల్గొన్నాయి. వీరంతా లడ్డూను రూ.1.26కోట్లకు దక్కించుకున్నారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన డబ్బును చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, సామాజిక కార్యక్రమాల కోసం ఖర్చు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

బాలాపూర్ లడ్డూ

బాలాపూర్ లడ్డూ వేలంలో మరోసారి రికార్డు ధర పలికింది. రూ.27 లక్షలకు తుర్కయాంజాల్‌లోని పాటిగూడ గ్రామానికి చెందిన దాసరి దయానంద్ రెడ్డి లడ్డూను దక్కించుకున్నారు. గురువారం అశేష జనవాహిని మధ్య ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ గణేష్ లడ్డూ వేలం, శోభా యాత్ర జరిగింది. గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు కళ్లెం నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో వంగేటి లక్ష్మారెడ్డి లడ్డు వేలంపాట నిర్వహించారు. వేలం పాట పోటా పోటీగా జరగ్గా దయానంద్ రెడ్డి రూ.27 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది బాలాపూర్ గ్రామానికి చెందిన వంగేటి లక్ష్మారెడ్డి రూ.24.60 లక్షలకు లడ్డూను దక్కించుకున్న సంగతి తెలిసిందే.

పరిశీలన అవసరమే

గోప్యత కంటే పారదర్శకతే ముఖ్యం
ఈవీఎంల పనితీరుపై నిపుణుల మనోగతం

న్యూఢిల్లీ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను (ఈవీఎంలు) తనిఖీ చేసేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఇటీవల తోసిపుచ్చింది. ఈవీఎంల వనరుకు సంబంధించిన కోడ్‌ను వెల్లడిస్తే సంఘ విద్రోహ శక్తులు ఆ యంత్రాల భద్రతకు ముప్పు కలిగించే ప్రమాదం ఉన్నదని అంటూ సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు అనుమతించలేదు. అయితే భద్రతను కారణంగా చూపి పిటిషన్‌ను విచారణకు స్వీకరించకపోవడం సబబు కాదని న్యాయ న్యూఢిల్లీకి చెందిన భద్రతా పరిశోధకుడు, సాంకేతిక నిపుణుడు కరణ్ సైనీ అభిప్రాయపడ్డారు.



వ్యవస్థ సరిగా పనిచేయకపోతే దానికి మరింత భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కంటే గోప్యతకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం సరి కాదు. ఈవీఎంల పనితీరును పరిశీలించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాన్ని పిటిషనర్ సునీల్ అహ్యా తప్పుపట్టారు. ఎన్నికల కమిషన్‌కు చెందిన సాంకేతిక మదింపు కమిటీ (టీఈసీ)కి మాత్రమే ఈవీఎంలను తనిఖీ చేసే అధికారం ఉంది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించకపోవడానికి సుప్రీంకోర్టు రెండు కారణాలు చూపింది. మొదటిది...ఎన్నికల కమిషన్ తన విధి నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని చెప్పడానికి న్యాయస్థానానికి ఆధారాలేవీ చూపలేదు. రెండోది...కోడ్‌ను బహిర్గతం చేస్తే ఎన్నికల ప్రక్రియతో రాజీ పడినట్లు అవుతుంది. ఫలితంగా ఈవీఎంలలోని భద్రతా లోపాలు బయటపడి సంఘ విద్రోహ శక్తులు ప్రయోజనం పొందే ప్రమాదం ఉంటుంది. 'ఈవీఎంకు సంబంధించిన వనరు కోడ్‌ను పబ్లిక్ డొమైన్‌లో ఉంచితే దానిని ఎవరు హ్యాక్ చేస్తారో మీకు తెలుసు' అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. కోడ్‌ను బహిర్గతం చేస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్న మాట నిజమే అయినప్పటికీ ఎన్నికల ప్రక్రియ సమగ్రతను, విశ్వసనీయతను పరిరక్షించాల్సిన అవసరం కూడా ఉంది. ఈవీఎంల వనరు కోడ్‌ను ప్రచురిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలలో నమ్మకం పెరుగుతుంది. ఈవీఎంల పనితీరును స్వతంత్ర నిపుణులు పరిశీలించే అవకాశం కలుగుతుంది.

ఈవీఎంల విషయంలో గోప్యతను పాటించడం వల్ల వాటిపై ఎంత వరకూ ఆధారపడవచ్చునన్న అనుమానాలు ప్రబలుతున్నాయి. ప్రజల తీర్పును తారుమారు చేసే అవకాశాలు ఉన్నాయన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. వీటిని నివృత్తి చేయాలంటే ఈవీఎంల అంతర్గత పనితీరును పరిశీలించేందుకు పారదర్శకమైన ప్రక్రియ అవసరమవుతుంది.

2010లోనే పరిశీలన

ఈవీఎంల పనితీరును గతంలోనే కొందరు నిపుణులు పరిశీలించారు. 2010లో భద్రతా పరిశోధకుడు హరి కె.ప్రసాద్ మరో ఇద్దరితో కలిసి రెండో తరం ఈవీఎంను పరిశీలించి, లోపాలను బయటపెట్టారు. అయితే ఈవీఎంను దొంగిలించి, ప్రదర్శించాడన్న ఆరోపణపై ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటి నుండీ ఆయన ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, భద్రత గురించి తరచూ మాట్లాడుతూనే ఉన్నారు. మూడో తరం ఈవీఎంలను సైతం హ్యాక్ చేయవచ్చునని ఆయన 2019లో ప్రకటించారు. అమెరికా వంటి దేశాలలో ఈవీఎంల భద్రతా తనిఖీలకు హ్యాకర్లను అనుమతిస్తారు. ప్రపంచంలో హ్యాకర్లు, భద్రతా సిబ్బందితో కూడిన అతి పెద్ద సంస్థ డెఫ్‌కాన్ ప్రతి సంవత్సరం నెవాడాలోని లాస్ వేగస్‌లో సామావేశాన్ని ఏర్పాటు చేస్తోంది. దీనిని 'ఓటింగ్ గ్రామం'గా పిలుస్తారు. ఈవీఎంలలో భద్రతా వైఫల్యాలను బయటపెట్టాల్సిందిగా ఆహుతులను కోరతారు. ఈ ప్రయత్నాలు అనేక సందర్భాలలో విజయవంతం అయ్యాయి కూడా. 2018లో 11 సంవత్సరాల బాలుడు ఎమరెట్ బ్రేవర్ ఓ నమూనా ఈవీఎంను హ్యాక్ చేశాడు. కీలక సమాచారాన్ని కాపాడుతూనే ఈవీఎంలను తెరిచి, భద్రతాపరమైన అంశాలను పరిశీలించవచ్చునని అమెరికా చెబుతోంది.

ఇదిలావుంటే వలసవాదులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా రిమోట్ ఓటింగ్ యంత్రాలను (ఆర్‌వీఎంలు) ప్రవేశపెట్టాలని ఎన్నికల కమిషన్ భావిస్తోంది. దీనిని అనేక పార్టీలు వ్యతిరేకించాయి. వలసవాదులకు ఇది ప్రయోజనకరమే అయినప్పటికీ ఈ విధానం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సమ్మె

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్(సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి

నవతెలంగాణ– ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల పట్ల ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య వైఖరి కారణంగానే సమ్మె చేయాల్సి వస్తోందని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ (సీఐటీయూ) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జయలక్ష్మి అన్నారు. గురువారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల సమ్మె పోరు సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 18వ తేదీన మంత్రి సమక్షంలో జాయింట్ మీటింగ్ జరిగిందని, ఈ సమావేశంలో అంగన్‌వాడీ టీచర్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇస్తామని హామీనిచ్చారని గుర్తుచేశారు. కానీ అదే నెల 25వ తేదీన మాట మార్చి ఇందులో సగానికి తగ్గించారని చెప్పారు. ప్రభుత్వమే ఇలా భిన్నమైన వైఖరితో ఉండటం సరికాదన్నారు. తెలంగాణ వస్తే అందరినీ క్రమబద్ధీకరిస్తామని చెప్పారని, 40ఏండ్లకు పైగా వెట్టిచాకిరీ చేస్తున్న అంగన్‌వాడీలను మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు పదేండ్లుగా పోరాడుతున్నారని అయినప్పటికీ పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పలుమార్లు వినతులు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అందుకే సమ్మె చేయాల్సి వచ్చిందని వివరించారు. డిమాండ్లు పరిష్కరించని యెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.వెంకటమ్మ అధ్యక్షత వహించిన సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, ఈశ్వర్‌రావు, కార్యదర్శి కూరపాటి రమేష్, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండి దత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, సహాయ కార్యదర్శి ఎస్.నవీన్, నాయకులు డి.సునీత, రత్నమాల పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐసీడీఎస్ ఆఫీసు ముందు అంగన్వాడీలు మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో అంగన్‌వాడీలు బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ దీక్ష శిబిరం వద్ద భిక్షాటన చేసి నిరసన తెలిపారు. జగిత్యాల జిల్లా బుగ్గారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష కొనసాగింది.

టెట్‌ను మినహాయించి పదోన్నతులివ్వాలి : టీపీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

టెట్‌ను మినహాయించి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై అశోక్‌కుమార్, పి నాగిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌సీటీఈ నిబంధన ప్రకారం 2010, ఆగస్టు 23 నుంచి ఉపాధ్యాయ నియామకాలకు టెట్‌ను తప్పనిసరి చేసిందని తెలిపారు. అంతకుముందే నియామకమై సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం మినహాయింపునిచ్చిందని పేర్కొన్నారు. టెట్ అర్హత లేకుండానే 2012, 2015లో పదోన్నతులు ఇచ్చారని గుర్తు చేశారు. కాబట్టి 2010కి ముందు నియామకమైన ఏ ఉపాధ్యాయుడూ టెట్‌ను రాయలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపునిస్తూ పదోన్నతులను యధావిధిగా కొనసాగించాలని కోరారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తప్పనిసరి అయితే ఎన్‌సీటీఈ నుంచి ఐదేండ్ల గడువును కోరాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులివ్వాలి : డీటీఎఫ్

టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం సోమయ్య, టి లింగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు నివ్వాలని కోరారు. ప్రస్తుత షెడ్యూల్‌లో ఇచ్చే పదోన్నతులకు టెట్‌తో సంబంధం లేకుండా చూడాలని తెలిపారు. హైకోర్టు తీర్పు మేరకు ఉపాధ్యాయులకు టెట్‌ను వర్తింపచేయాలంటే 2010 తర్వాత నియామకమైన వారికి వారి సీనియార్టీ, అర్హతల మేరకు ఇవ్వాలని కోరారు. పాత వారికి వర్తింపచేస్తే టెట్ ఉత్తీర్ణతకు ఐదేండ్ల గడువు కోరాలని తెలిపారు.

సీనియార్టీ ప్రకారమే పదోన్నతులివ్వాలి : తపస్

కోర్టు అనుమతి తీసుకుని సీనియార్టీ ప్రకారమే అర్హతగల ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించాలని తపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హన్మంతరావు, ఎన్ సురేష్ తెలిపారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి పొందాలంటే టెట్ పేపర్-2 ఉత్తీర్ణత పొందాలంటూ ఉన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే 2010, ఆగస్టు 23 తర్వాత నియామకాలకు మాత్రమే టెట్ పేపర్-1, పేపర్-2 తప్పనిసరి అని ఉందని తెలిపారు. 2010, ఆగస్టు 23 కన్నా ముందు నియామకమైన వారు పదోన్నతి పొందడానికి టెట్ పేపర్-2 ఉత్తీర్ణత తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఎక్కడా లేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక చొరవ తీసుకుని కోర్టుకు సరైన వివరాలు, సమాచారాన్ని అందించాలని కోరారు.

లేని పోస్టుకు వేలల్లో జీతాలు

నాకో ఆమోదం లేకున్నా టీశాక్స్‌లో ఇష్టారాజ్యం

- నిధుల దుర్వినియోగంపై పదే పదే ఆరోపణలు
- అయినా సరిదిద్దుకోని అధికారులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఒక లక్ష్యం కోసం ఏర్పాటైన ఆ పథకంలో అవినీతి ఆరోపణలు. తరచూ వివాదాలమయమే. ప్రజల్లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రచారం చేయడం, దాని నియంత్రణ, దాని బారిన పడిన వారికి సేవలందించడమే లక్ష్యంగా జాతీయ స్థాయిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ పని చేస్తున్నది. దాని పరిధిలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి పని చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే అసలు లక్ష్యసాధన దిశగా ఎంత సాధించారనే దాని కన్నా తరచూ అర్హత లేని వారికి పోస్టులను కట్టబెట్టడం, నిధుల దుర్వినియోగం, అమాత్యులకు బదిలీలు, అందలం ఎక్కించడం వంటి ఆరోపణలు నిత్యకృత్యంగా మారాయి. తమ అనుయాయుల కోసం నాకో విధించిన నిబంధనలను కూడా బేఖాతరు చేస్తున్నట్టు వినికిడి.

రాష్ట్రంలో ఎయిడ్స్ నియంత్రణ మండలితో కలిసి పని చేస్తున్న స్వచ్ఛంధ సంస్థల సంఖ్య ఆధారంగా రాష్ట్ర స్థాయిలో పర్యవేక్షణ పోస్టుల మంజూరు, వాటి సంఖ్యను నాకో నిర్ధారించింది. కనీసం వంద ఎన్జీవోలు ఉంటే వాటి పర్యవేక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో జేడీ (టీఐ) పోస్టు ఉంటుంది. అయితే మన రాష్ట్రంలో అన్ని స్వచ్ఛంద సంస్థలు లేకపోవడంతో ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి నాకో ఈ పోస్టును రద్దు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా పోస్టును భర్తీ చేసింది. అంతే కాకుండా ఆ లేనిపోస్టుకు ఎంతో అనుభవం ఉన్న వారిని తీసుకోవాల్సి ఉండగా కేవలం ఎన్జీవో అనుభవం ఉన్న వ్యక్తిని తీసుకోవడమే కాకుండా ఆ వ్యక్తికి వేలల్లో జీతాలు చెల్లిస్తున్నట్టు సమాచారం. ఎంపిక విధానంలోని దరఖాస్తుదారులందరికి సమాచారం ఇవ్వకుండా ఒక్కరికే ఇచ్చి భర్తీ చేశారనే విమర్శలూ ఉన్నాయి. దీనికి తోడు టీశాక్స్‌లో ఏవైనా పోస్టులను భర్తీ చేయాలంటే అందుకు సంబంధించిన ప్రతిపాదన కాపీలను తప్పనిసరిగా అక్కడి ప్రాజెక్ట్ డైరెక్టర్ లేదా అదనపు ప్రాజెక్టు డైరెక్టర్లకు తెలపాల్సి ఉంటుంది. అలా కాకుండా నేరుగా కంట్రీ డైరెక్టర్‌కు పంపించడం, అక్కడి నుంచి ఆయా పోస్టుల భర్తీకి ఆమోదం రాకపోవడం గమనార్హం. నాకో నిబంధనల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులు ఇలా నేరుగా పంపించడానికి వీలు లేదని సమాచారం.

లంచాలకు అలవాటు పడిన అధికారులు జేడీ (టీఐ)ను వెనుకేసుకు వస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఉద్యోగులు గుసగుసలాడుకుంటున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేయకపోతే శాక్స్ నిధులు మరింత దుర్వినియోగమయ్యే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుడిసెవాసులపై బీఆర్ఎస్ కార్పొరేటర్ అనుచరుల దాడి

గుడిసెల తొలగింపు

- దాడి చేసిన వారిపై చర్యలకు సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ–ఎన్జీవోస్ కాలనీ

ప్రభుత్వ భూమిలో రెండేండ్లుగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్న పేదలపై బీఆర్ఎస్ నాయకుడు, అతని అనుచరులు దాడి చేశారు. గుడిసెలను కూల్చేశారు. అడ్డుకోబోయిన మహిళలపై దాడి చేశారు. ఈ ఘటన హనుమకొండ జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. బాధితులు, సీపీఐ(ఎం) నేతలు తెలిపిన వివరాల ప్రకారం..

హనుమకొండ నగర పరిధిలోని గోపాలపురం శివారులోని సర్వే నెంబరు 89లోని ప్రభుత్వ భూమిలో కొందరు రియల్టర్లు, భూ ఆక్రమణదారులు ఆక్రమించి పెద్ద పెద్ద భవనాలు, ఆలయాలు నిర్మించారు. శ్మశాన వాటికల పేరుతో స్థానిక బీఆర్ఎస్ కార్పొరేటర్, అతని అనుచరులు ఆక్రమించారు. మిగిలిన కొంత ప్రభుత్వ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకున్నారు. ఈ క్రమంలో ఎనిమిది నెలల కిందట గుడిసెవాసులపై కొందరు దాడి చేశారు. అప్పుడు సామరస్యంగా ఇరువైపులా కూర్చొని మాట్లాడి హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. మళ్లీ గురువారం స్థానిక 56వ డివిజన్ కార్పొరేటర్ సునీల్ కుమార్ తన అనుచరులతో వచ్చి, ఇక్కడ మా శ్మశాన వాటిక ఉందని, గతంలో ప్రభుత్వం మాకు రాసిచ్చిందని దౌర్జన్యం చేసి గుడిసెలను తొలగించారు. అడ్డుకోబోయిన మహిళలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వారికి సీపీఐ(ఎం) నేతలు చికిత్స చేయించారు. అనంతరం యూనివర్సిటీ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు సీపీఐ(ఎం) హనుమకొండ మండల కార్యదర్శి వాంకుడోత్ వీరన్న తెలిపారు. దళితులు, గిరిజనులపై దాడి చేసి గుడిసెలు తొలగించిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏండ్లు దాటినా ఇవ్వకపోవడంతో భూ పోరాటం నిర్వహించి ప్రభుత్వ భూమిని కాపాడి నిరుపేదలకు గుడిసెలు వేయించామని చెప్పారు. ఇది సహించలేని బీఆర్ఎస్ నేతలు పేదల గుడిసెలపై దాడికి దిగడం సరైనది కాదన్నారు. అకారణంగా దాడి చేసిన 56వ డివిజన్ కార్పొరేటర్ సునీల్‌ను బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించాలని, లేదంటే కార్పొరేటర్ ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.ఉప్పలయ్య, నాయకులు కుక్కముడి రవీందర్, వల్లెపు రాజు, వల్లేపు లింగమూర్తి, బొంత కొమురెల్లి, ఉమాదేవి, ఇమ్మడి కవిత, ముదురు మంజుల, రమాదేవి, బానోతు వెంకన్న, జగన్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం

80 శాతం పూర్తి : డీజీపీ

నవతెలంగాణ–ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో గణేశ్ ప్రతిమల నిమజ్జనోత్సవం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరుగుతున్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ గురువారం రాత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.25 లక్షల గణేశ్ మండపాలు వెలిశాయని ఆయన అన్నారు. చివరి 11వ రోజున హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండతో పాటు నిజామాబాద్, సంగారెడ్డి, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ ఎత్తున విగ్రహాలు నిమజ్జనానికి తరలాయని తెలిపారు. లక్షలాది మంది ప్రజలు నిమజ్జనోత్సవ వేడుకలను తిలకించటానికి ట్యాంక్‌బండ్‌తో పాటు ఇతర చెరువులు, తటాకాల వద్దకు చేరుకొని వీక్షించి ఆనందించారని ఆయన అన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిమజ్జనోత్సవం సాగిందని ఆయన అన్నారు. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా సాగటానికి అన్ని వర్గాల ప్రజలు ఎంతగానో సహకరించారనీ, అలాగే గణేశ్ మండపాల నిర్వాహకులు సైతం పోలీసులకు తగిన సహకారాన్ని అందించారని ఆయన అన్నారు.

మంత్రులతో ఏరియల్ సర్వే

మూడు కమిషనరేట్ల పరిధులలో సాగిన నిమజ్జనోత్సవాన్ని హెలికాప్టర్‌లో రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర పశు సంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు తాను, నగర పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్‌లు ఏరియల్ సర్వేను నిర్వహించటం జరిగిందని డీజీపీ తెలిపారు. లక్షలాది మంది ప్రజలు పాల్గొన్న నిమజ్జనోత్సవం ఎలాంటి విఘాతం లేకుండా సాగటానికి పోలీసు, విద్యుత్, జీహెచ్ఎంసీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో చేసిన కృషి, ఏర్పాట్లు సత్ఫలితాలను ఇచ్చాయని ఆయన అన్నారు. అర్ధరాత్రి నాటికి 90 శాతానికి పైగా నిమజ్జనోత్సవం పూర్తవుతుందనీ, మిగిలినవి శుక్రవారం ఉదయానికి పూర్తవుతాయని తెలిపారు. ప్రశాంతంగా నిమజ్జనం సాగటానికి ఐపీఎస్ అధికారులు మొదలుకొని కానిస్టేబుల్, హోంగార్డుల వరకు శ్రమించారనీ, అందుకు వారందరికి అభినందనలు తెలుపుతున్నట్టు అంజనీకుమార్ చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నిమజ్జనోత్సవం పూర్తయ్యేంత వరకు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేలాది సీసీ కెమెరాల ద్వారా ఉన్నతాధికారులు పర్యవేక్షించటం జరుగుతున్నదని ఆయన వెల్లడించారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-వనస్థలిపురం

నేటి యువత చదువుతోపాటు దైభక్తితో కలిగిన ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి సూచించారు. ఏబీవీపీ కార్యకర్త శ్రీకాంత్ జన్మదినం సందర్భంగా గురువారం శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ప్రాంగణంలో శ్రీకాంత్ సొంత ఖర్చుతో భవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సామ రంగారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి యువత దైవభక్తిని కలిగి ఉండి ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు యాదగిరిరావు, అప్పారావు, గోవిందా చారి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న సహకార సంఘం మహాజన

నవతెలంగాణ - అబ్దుల్లాపూర్ మెట్

ది బాటసింగారం రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ 53వ మహాజన సభను ఈ నెల 30న అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయ ప్రాంగణంలో చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అధ్యక్షత నిర్వహించనున్నారు. ఈ సభలో 01-03-2023 నుంచి 3- 8- 2023 వరకు సంఘం వ్యవహారాలపై, జమా ఖర్చుల అనుమతికై నివేదికను సమర్పించనున్నారు. ఇటీవల బాటసింగారంలో నూతనంగా నిర్మిస్తున్న భవనంలో రైతు సేవా సహకార సంఘం రెండవ బ్రాంచ్ ని దసరా లేక దీపావళికి ఏర్పాటు చేయడం కోసం సభ ఆమోదానికి నివేదికను సమర్పించనున్నారు. అలాగే సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్ రెడ్డి అనుమతితో సహకార సంఘం అభివృద్ధి, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాజన సభకు పాలకవర్గం సభ్యులు, అధికారులు, రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

పలు చోట్ల లడ్డూ వేలం, గణపతి పూజలు, నిమజ్జనాలు



నవతెలంగాణ- వనస్థలిపురం

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శాతవాహన నగర్ కాలనీ ప్రెసిడెంట్ గోపాల్ రెడ్డి అధ్యక్షతన గురువారం వినాయక లడ్డూ వేలం పాట జరిగింది. ఉమ జగదీశ్వర్ రెడ్డి దంపతులు ఒక లక్ష 16 వేల రూపాయలకు లడ్డూను కైవసం చేసుకున్నారు. ఈ వేలంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సతీమణి, జయచంద్ర చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ దేవిరెడ్డి కమలా సుధీర్ రెడ్డి, కాలనీ జనరల్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, సభ్యులు లలిత, మాధవి, పద్మ, కృష్ణ, ప్రసాద్, రవి, రమణ, చారి కాకతీయ హై స్కూల్ టీచర్స్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం :



వనస్థలిపురం కమలా నగర్ లోని స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో గురువారం తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



కుర్మగూడ డివిజన్ సైదాబాద్ ప్రధాన రహదారిపై గురువారం బాల గణేష్ ఉత్సవ కమిటీ ఆర్గనైజేషన్ అనిష్, మనీష్, అమిత్, సిరాజ్, గౌతమ్, నాగరాజ్, ప్రమోద్‌ల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మదన్న పేట్, సంతోష్ నగర్, ఐఎస్ సదన్ డివిజన్ సౌత్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, జర్నలిస్టు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని డెంటల్ క్లినిక్ పద్మావతి డాక్టర్ అశ్విని లహరి అన్నారు. ప్రధాన రహదారి సైదాబాద్ ఏసీపీ ఆఫీస్ పక్కన భక్తులకు స్వాగత్ స్టేజీలో గురువారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్, జర్నలిస్టు సింగ్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



షిరిడి సాయిబాబా మందిరం శ్రీ లక్ష్మీ నగర్ కాలనీ సైదాబాద్‌లో గురువారం వినాయక లడ్డూ వేలం పాట నిర్వహించారు. దీంట్లో మొదటి లడ్డూను రూ.70లతో శశికిరణ్, రెండో లడ్డూను సాయి కళ్యాణి రూ.30వేలతో సొంతం చేసుకున్నారు. ఈ వేలంలో బాబా మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంతోషనగర్ :



ఓల్డ్ మలక్‌పేట్ శ్రీ ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. దీంట్లో రూ.41 వేలకు ప్రవీణ్ అనే భక్తుడు లడ్డూను దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్ చారి, పోచమ్మ దేవాలయం ప్రతినిధి కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి, బాబు శ్రీనివాస్, కావాలి రాజు, శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చైతన్యపురి :



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం ద్వారక నగర్ లో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని వద్ద గురువారం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, షాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెంటూరి రవీందర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉద్యమకారుల కన్వీనర్ న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి, రామాచారి, కొండ్ర శ్రీనివాస్, కంచర్ల శేఖర్, యాదవ రెడ్డి పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



చంపాపేట్ క్రికెట్ క్లబ్ లడ్డూను రామస్వామి ప్రతాప్ రెడ్డి కొడుకు రామస్వామి కార్తీక్ రెడ్డి కైవసం చేసుకున్నాడు.

ధూల్ పేట్ :



చుడి బజార్ డాక్టర్ అంబేద్కర్ లోహియా ఫంక్షన్ హాల్లో గురువారం చేసిన గణేష్ పూజలో జియాగూడ కార్పొరేటర్ దర్శన్, అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ మాణిక్ రావు, అల్వాల్ శివ కుమార్ మాదిగ మహా సభ, వెంకటేష్, సుమన్ కుమార్, ప్రేమ్ కుమార్, కమల్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

నాగోల్ :



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని రామంతపూర్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన గణేష్ నిమజ్జనానికి తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ శేఖర్, జనరల్ సెక్రెటరీ హనుమంతరావు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి :



ఆర్కేపురం డివిజన్ హరి పురి కాలనీ రోడ్ నెంబర్ -5 లో గల గణనాథుడి వద్ద గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు.దీంట్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ డైరెక్టర్ మారం సుజాతా రెడ్డి, యాదిరెడ్డి దంపతులు రూ.65 వేలకు గణపతి లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వాగత్ వేదిక పై వాటర్ మిఠాయిలు పంపిణీ



సంతోష్ నగర్ :

సంతోష్ నగర్ ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని స్వీకార హెూటల్ ఎదురుగా మహాగణపతి శ్రద్ధాబాద్ ప్రాంతం గణేష్ ఉత్సవ సమితి భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదికపై అన్న డైరీ ఫామ్ నిర్వహకులు సి. పాపయ్య యాదవ్ ఆధ్వర్యంలో గురువారం వాటర్ మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి. శివకుమార్ యాదవ్, సి. రాజు యాదవ్, సిబ్బంది, పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్, జర్నలిస్టు సింగ్, కార్యదర్శులు బర్ల శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ దాచురి మల్లేశం, ప్రధాన కార్యదర్శి గుర్రం జైపాల్ రెడ్డి, సతీష్ కుమార్, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్ పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



గణేష్ నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రెటరీ గోవింద్ సాగర్ అన్నారు. ఈ మేరకు గురువారం స్థానిక నాయకులు మన్నే రంగా, నర్సింగ్ రావు, శివ యాదవ్, లక్ష్మయ్య, మహిళా నాయకురాలు ఆధ్వర్యంలో స్వాగత్ వేదిక ఏర్పాటు చేశారు.

సంతోష్ నగర్ :



ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని భక్తులకు గురువారం ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి తీర్థప్రసాదాలు అందజేశారు.

రూ. 4.81 లక్షలకు లడ్డూ దక్కించుకున్న సాయికుమార్



వనస్థలిపురం :

బీఎన్‌రెడ్డి నగర్ జె.బి.ఇన్ఫ్రా గ్రూప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి గురువారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు అనిల్ రెడ్డి, అవినాష్ రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, రవిచంద్ర రెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలో జనరల్ మేనేజర్ సాయికుమార్ రూ.4.81 లక్షలకు పెద్ద లడ్డును, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలకంఠం సురేందర్ రూ.3.40 లక్షలకు చిన్న లడ్డును దక్కించుకున్నారు. సంస్థ మరో కార్యాలయంలో చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోటేశ్వర్ రెడ్డి రూ.2.10 లక్షలకు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదయ్య రూ.1,70 లక్షలకు లడ్డూలను కైవసం చేసుకున్నారు.

బడంగ్‌పేట్ :

బడంగ్‌పేట్‌లోని వీరాంజనేయ భక్త సమాజం ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో బడంగ్ పేట్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు పెద్దబాబు వెంకట్ రెడ్డి కుమారుడు మధుకర్ రెడ్డి రూ. 17 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమిడి స్వప్న జంగారెడ్డి, ఎస్. అర్జున్, బంగారు ప్రభు, పెద్దబావి ఆనంద్ రెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ల గూడెం శ్రీనివాస్ రెడ్డి, లిక్కీ కృష్ణారెడ్డి, గౌర శ్రీనివాస్, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి కర్రె బలవంత్ నడికుడి యాదగిరి, కర్రే కృష్ణ, గట్టు మహిపాల్ , రాము, శ్రీనివాస రాజు, సంతోష్, కందికంటి కిరణ్,



నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

చైతన్యపురి / ఎల్బీనగర్ :

వివిధ ప్రాంతాలల్లోని గణేష్ మండపాల నుండి నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులకు గురువారం గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొత్తపేట్ చౌరస్తాలో స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, గణేష్ నిమజ్జన ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్ రెడ్డి, ప్రెసిడెంట్ గట్ల రవీంద్ర హైటెక్ రామ్, ప్రధాన కార్యదర్శి తలాటి రమేష్ నేత, ముఖ్య సలహాదారుగా నల్లెంకి ధనరాజ్ గౌడ్, రాజ్ కుమార్, ఏ.వి. రావు, పి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధూల్ పేట్ :

జియాగూడ సీఐటీయూ, ఐద్వా, శాంతి సంఘీభావ వేదిక తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం వినాయక భక్తులకు స్వాగత వేదిక ఏర్పాటు చేశారు.



ఎల్బీనగర్ :

గణేష్ నిమజ్జనం సందర్భంగా సరూర్ నగర్ చెరువు కట్ట మీద గురువారం ఏర్పాటు కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భక్తులకు పులిహోర, తాగునీరు అందజేశారు.



'కోనేరులలో నిమజ్జనానికి ఆసక్తి చూపుతున్న నిర్వాహకులు'



నవతెలంగాణ - నాగోల్

ఆయా డివిజన్‌లలో ఏర్పాటు చేసిన కోనేరులలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడానికి గణేష్ ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారని జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ పంకజ అన్నారు. నాగోల్ చెరువు వద్ద నిమజ్జనం కోసం ఏర్పా టు చేసిన కోనేరును గురువారం జీహెచ్ఎంసీ ఎస్ ఈ అశోక రెడ్డితో కలసి కమిషనర్ పంకజ సందర్శిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలతో పాటు పూలదండలు, ఇతర వస్తువు లను కోనేటిలో వేయకుండా జాగ్రత్త లు తీసుకోవాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. నాగోలు డివిజ న్‌తో పాటు మన్సూరాబాద్, హయత్ నగర్, కాప్రా నల్లచెరువు, సరూర్ నగర్లలో నిమ జ్జనాలకు వసతులు, అన్ని ఏర్పాట్లను కల్పించినట్లు తెలి పారు. చిన్న చిన్న కోనేరుల వద్ద ఒక పెద్ద క్రేన్, చిన్న క్రేన్, సరూర్నగర్ వద్ద 11 క్రేన్ లను ఏర్పాటు చేసినట్లు చెప్పా రు. కోనేరులలో నిండిపోయిన విగ్రహాలను వెనువెంటనే ఇతర క్రేనుల ద్వారా వాహనాలలో తరలించి..పరిశుభ్రమైన నీటిని నింపుతున్నట్లు తెలిపారు. నాగోల్‌లో ఏర్పాటు చేసిన కోనేరులో ఇప్పటికీ 9 ఫీట్ల కంటే తక్కువ ఎత్తు గల 341 గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసినట్టు చెప్పారు. జీహెచ్ఎంసీ ఈఈ రమేష్, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ సి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న బహిరంగ సభ

నవతెలంగాణ -వనస్థలిపురం

ఆటోనగర్ ఇసుక లారీల అడ్డా సమస్యలపై వచ్చే నెల 2న బహిరంగ సభను నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర లారీ యాజమాన్యాల సంక్షేమ సంఘం అధ్యక్షులు బూడిద నందా రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డితో ఆటోనగర్ ఇసుక లారీల పార్కింగ్ సమస్యపై లారీ యజమానుల సంఘాల ప్రతినిధులు గరువారం నందా రెడ్డి నాయకత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్ విశ్వ నగరంగా రూపాంతరం చెందుతున్న క్రమంలో పెరుగుతున్న పట్టణీకరణ దృష్ట్యా ఆటోనగర్ ఇసుక లారీల పార్కింగ్ కోసం ఆటోనగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తామన్నారు. దానికోసం అక్టోబర్ 2న ఆటోనగర్ ఇసుక లారీల పార్కింగ్‌లో భారీ బహిరంగ సమావేశం ఏర్పాటు చేయాల్సిందిగా లారీ అసోసియేషన్ నాయకులను ఆదేశించారు. ఈ సభకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో, మైనింగ్ అధికారులు, విజిలెన్స్ అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, వనస్థలిపురం డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ, సీఐ, ఆర్డీవో, స్థానిక కాలనీల సంఘాల నాయకులు, లారీ యజమానుల సంఘాల ప్రతినిధులు, ఆటోనగర్ ఇసుక లారీల యజమానులందరూ హాజరుకావాలన్నారు. లారీ యజమానుల సంఘాల ప్రతినిధులు కేసారం బాల్ రెడ్డి, బూడిద రామ్ రెడ్డి, సుర్వి రాజుగౌడ్, ఎండీ సలావుద్దీన్, బచ్చనబోయిన జగదీష్ యాదవ్, వై. జంగా రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాత్క శేఖర్ యాదవ్ పాల్గొన్నారు.



'ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే ఓటు వేస్తాం'



నవతెలంగాణ - హయత్‌నగర్

ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే ఓటు వేస్తామని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఇటీవల కుర్ర సత్యనారాయణకు గవర్నర్ కోటాలో ఇచ్చిన ఎమ్మెల్సీని తిరస్కరించిన తీరుకు గురువారం ఎల్బీనగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. తర్వాత రాష్ట్ర నాయకులు కృష్ణ, సత్యనారాయణలు మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలు కాంగ్రెస్ పార్టీ వలె ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేస్తేనే.. రాష్ట్రంలో ఉన్న 8లక్షల ఎరుకల కులస్తులు ఆయా పార్టీలకు ఓట్లు వేస్తారన్నారు. 75 ఏండ్లుగా ఎరుకల కులస్తులు రాజకీయంగా ఎదగాలని చేస్తున్న ప్రయత్నాలను అధికార బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. గవర్నర్ కోటాలో కౌశిక్ రెడ్డికి ఇచ్చిన ఎమ్మెల్సీని తిరస్కరణకు గురైన విషయం తెలిసి కూడా మళ్లీ అదే కోటాలో కుర్ర సత్యనారాయణను ముఖ్యమంత్రి సిఫారసు చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మరల పునరాలోచించి సీఎం కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే అయిన కుర్ర సత్యనారాయణకు నామినేటెడ్ పోస్ట్ ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో తమ ప్రతాపం ఓట్ల ద్వారా చూపుతామని హెచ్చరించారు. ఇప్పుడిప్పుడే రాజకీయంగా ఎదుగుతున్న ఎరుకల కులస్తులకు రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయించకుండా మోసం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎస్టీలకు 12 శాతం ఇస్తామని కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నేతలు కండెల వెంకటేశ్వర్లు, శేఖర్, బాణాల రఘు, వనం గంగయ్య, స్వామి, రాములు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు..



నలుగురు అరెస్ట్
70 లీటర్ల మద్యం స్వాధీనం

నవతెలంగాణ- హయత్ నగర్

వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం అమ్మకాలను బంద్ చేయాలని రాచకొండ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కొందరు అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు గురువారం వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్ పెద్ద చెరువు వద్ద ఉన్న మధురా నగర్‌లో నివాసం ఉంటున్న బత్తుల యశోద నుండి సుమారు రూ.13,500 విలువ గల 17లీటర్ల మద్యం, సిరి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రమావత్ శంకర్ నుండి సుమారు రూ.10,050 విలువ గల 20.87లీటర్లు, ఆర్‌టీసీ కాలనీలో నివాసం ఉంటున్న జటోతు పుల్ సింగ్ నుండి రూ.15,220 విలువ గల 20.52లీటర్లు, సరస్వతి నగర్ కాలనీకి చెందిన కంబాల చిరంజీవి వద్ద నుండి రూ.8420 విలువ గల 12.125లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వారిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వనస్థలిపురంలో ఐదుగురు అరెస్ట్

నవతెలంగాణ- వనస్థలిపురం

అక్రమంగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఇంజాపూర్ భవాని ఎన్క్లేవ్ నివాసి కొత్త రంగయ్య, కమ్మగూడ లక్ష్మీ నగర్ నివాసి చందు, హయత్ నగర్ నివాసి కాంతు జమున , ఆటోనగర్ నివాసి సోను ,



కమ్మగూడ ఇంద్ర కాలనీ నివాసి పద్మలు అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. సుమారుగా ఒక లక్ష రూపాయలు విలువ గల మద్యాన్ని సీజ్ చేశారు. ఆ 5 గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.



చీర్యాలలో మేరా మట్టి మేరా దేశ్



నవతెలంగాణ-కీసర

దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన వారిని గౌరవించేం దుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహి స్తున్న అజాదికి అమత్ మహెూ త్సవంలో భాగంగా మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా చీర్యాల సర్ప ంచ్ తుంగ ధర్మేందర్ ఆధ్వర్యంలో ఇంటి యజమానుల నుండి మట్టి సేకరించే కార్యక్రమం నిర్వ హించారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్, వార్డు సభ్యులు, మహిళలు, గ్రామ యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సందర్శించిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



నవతెలంగాణ-కీసర

గణేష్ నిమజ్జనం కు వచ్చే చెరువుల వద్ద వైద్య శిబిరాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కీసర మండలంలోని రాంపల్లి పాత చెరువు వద్ద అత్యవసర వైద్య శిబిరం సందర్శించి గణేశ విగ్రహాల నిమజ్జనాన్ని వచ్చే భక్తులకు వైద్య ఆరోగ్యశాఖ తరపున ఏర్పాట్లను పరిశీలించారు. నిమజ్జనం సమయంలో భక్తులు ఏదైనా ప్రమాదాలకు గురి అయితే చికిత్స అందించేందుకు ఏర్పాట్లను వైద్య ఆరోగ్య శాఖ చేసిం దన్నారు. విధుల సమయంలో అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి సిబ్బందిని ఆదేశించారు. అన్ని అత్య వసర మందులు ఆర్ఎస్ యాంటీ స్నేక్ వెనమ్ ,యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌ల అందుబాటులో పెట్టాలన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

నవతెలంగాణ - ఘట్కేసర్

మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలం వెంకటాపురం గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. హెచ్.పీ పెట్రోల్ పంప్ ఎదురుగా అక్రమంగా నిర్మిస్తున్న 18 కమర్షియల్ షెటర్లను పంచాయతీ రాజ్ శాఖ అధికారులు అధికారులు కూల్చేశారు. ఈ అక్రమ నిర్మాణం అంత కూడా అధికార బీ.అర్.ఎస్ పార్టీకి చెందిన ఓ బడా నాయకుడికి చెందిందని ఆరోపణలు వస్తున్నాయి. కూల్చివేతలు చేస్తుండగా అధికారులను సైతం ఆ నాయకుడు మీ అంతు చూస్తాను,మీరు ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాను అంటూ బెదిరింపులకు పాల్పడినట్టు తెలిసింది. అతని అక్రమ నిర్మాణాల మీద కానీ అక్రమాల మీద కానీ వార్తలు రాస్తే విలేకరులను సైతం (ఎక్స్టార్షన్) కేసులు నమోదు చేయిస్తానంటు బెదిరిస్తాడని ఆరోపణలు ఉన్నాయి. ఆ నాయకుడిపై కీసర పోలీస్ స్టేషన్‌లో అక్రమ బ్లాస్టింగ్ విషయమై కేసు కూడా నమోదైందని సమాచారం. అయిఆన అతని అక్రమ నిర్మాణాలు కానీ అక్రమ బ్లాస్టింగులు కానీ, చట్ట వ్యతిరేక పనులకు అడ్డూ అదుపు లేకుండా పోతున్నదని పలువురు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే అక్రమ నిర్మాణాలను సహించే ప్రసక్తే లేదని అధికారులు తేల్చిచెప్పారు.

శామీర్‌పేట పోలీసులకు అభినందన



నవ తెలంగాణ- శామీర్ పేట

నేరస్తులను పట్టుకోవడానికి శామీర్ పేట పోలీసులు అనుసరిస్తున్న విధానాలు అభినందనియమని మేడ్చల్ డీసీపీ శభరిష్ అన్నారు. ఈ నెల 24న శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జగ్గంగూడా గ్రామానికి చెందిన ఓ మహిళ కూలి సాటి కూలీలతో కలిసి నడుచుకుంటూ లల్గాడిమలకపేట వైపు వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై ఉండి మేడ్చల్ ఎలా వెళ్లాలని అడిగి మహిళ మేడలోని పుస్తెల తాడు దొంగిలించడానికి ప్రయత్నించగా ఆమె పెద్దగా అరుస్తూ పుస్తెల తాడును పట్టుకోవడముతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న శామీర్ పేట పోలీసులు ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఇన్స్ ఫెక్టర్ సిహెచ్ రాజు, ఎస్ ఐ మునీందర్, కానిస్టేబుల్ మహేష్, హెచ్ జి ఓ సుబ్బారెడ్డి లు ఒక టీంగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్న క్రమంలో సీసీ కెమెరాల సహాయంతో గుర్తు తెలియని చైన్ దొంగల ఆచూకీ కనిపెట్టారు. నేరస్తులు రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన ఏ1 మహమ్మద్ ఫరూక్(25), ఏ2ఒర్సు ప్రశాంత్(25), ఏ3 జెలపాటి రాజేష్(26) లను ఈ నెల 27న అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించడంతో జ్యుడిషియల్ రిమాండు కు తరలించారు. నేరస్తులను పట్టుకున్న విధానంలో చాకచక్యంగా వ్యవహరించిన స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం. నిరంజన్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ రాజు, ఎస్ఐ మునిందర్, కానిస్టేబుల్ మహేష్, హెచ్ జి ఓ సుబ్బారెడ్డి లను గురువారం మేడ్చల్ డీసీపీ డాక్టర్ పి శభరిష్ ఐపీఎస్ , ఏసీపీ సిహెచ్ రఘునందన్ రావు అభినందించారు. సిబ్బందికి ఈ సందర్భంగా క్యాష్ రివార్డ్ ను అందజేశారు.

ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉప్పల్

స్వరాష్ట్రం కోసం తమ జీవితాలను పనిగా పెట్టి ఎన్నో ఉద్యమాలు చేసి అహర్నిశలు కషి చేసిన ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు నిర్దం భాస్కర్ గౌడ్, నందికొండ శ్రీనివాస్ రెడ్డి, అంబటి జగదీష్, దోషాల శంకర్ అన్నారు. బుధవారం చిల్కానగర్లో ఏర్పాటుచేసిన తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉద్యమకారుల ఆత్మగౌరవం చాటే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని కోరారు. ఉద్యమంలో పాల్గొని తమ జీవితాలను సర్వస్వం కోల్పోయిఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులలో అవకాశం కల్పించాలని వారు కోరారు. ఎన్నో త్యాగాలు చేసిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, హెల్త్ కార్డ్స్, దళిత బంధు, బీసీ బంధు అందించాలని డిమాండ్ చేశారు. పల్లె నర్సింగ్ రావు, సత్యరాజ్, నరేష్, ఉపేందర్, రవి చారి, మధుసూదన్ రెడ్డి, సంధ్య మనమ్మ , మైపాల్ రెడ్డి, సీతారాం రెడ్డి, కుమారస్వామి, సాగర్, కనకరాజు గౌడ్, ధనుంజయ్, జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

నిషేధం ఉన్నా నిర్మాణాలు ఆగడంలే ?

- బోడుప్పల్ వక్ఫ్ బోర్డు భూములలో యధేచ్చగా ఇంటి నిర్మాణాలు
- పట్టింపు లేని టౌన్ ప్లానింగ్, వక్ఫ్ బోర్డు అధికారులు

347



నవతెలంగాణ - బోడుప్పల్

వక్ఫ్ బోర్డు అధికారికంగా ప్రకటించిన నిషేధిత సర్వే నెంబర్లలో యధేచ్చగా నిర్మాణాలు సాగుతున్నా మున్సిపల్ టౌన్ ప్లానింగ్, వక్ఫ్ బోర్డు యంత్రాంగం ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో ప్రకటించిన నిషేధిత సర్వే నంబర్లలో ఉన్న ప్లాట్లలో దళారులు అక్రమంగా నిర్మాణాలు చేయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా వక్ఫ్ బోర్డు బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఉన్న సర్వే నెంబర్లలో కొత్తగా ఇళ్ల నిర్మాణాల అనుమతులు, రిజిస్ట్రేషన్లు పూర్తిగా ఆపివేసింది. అంతేకాకుండా ప్రస్తుతమున్న ఇండ్లపై కూడా అదనపు అంతస్తులు నిర్మించుకోవడంపై కూడా నిషేధాజ్ఞలు అమలు విధించింది. దీంతో వక్ఫ్ బోర్డు ప్రకటించిన విధంగా సర్వే నెంబర్లు 45.46,47,48,49.50,60,61.62.66.67.69. 91.92.93.94, 102, 103, 104, 105, 106. 111. 116. 117. 118. 119. 120. 121. 122. 123. 124. 125, 126, 128. 129. 130. 150 లలో నిర్మాణ అనుమతులు, రిజిస్ట్రేషన్లు పూర్తిగా ఆపేసింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొంతమంది బ్రోకర్లు దళారుల అవతారమెత్తి 'ఒక్క రూ. అయిదు లక్షలు మాకు ఇవ్వండి.. మెటీరియల్, లేబర్ ఖర్చులు మీరు పెట్టుకొండి అంతా మేము చూసుకుంటాం. మీ దగ్గరకు ఎవ్వరూ రాకుండా చేస్తాం' అంటూ కొత్త వ్యాపారానికి తెరదీశారు. మరికొంత మంది ఈ సర్వే నెంబర్లలో ఎన్ని సంవత్సరాలు పోయినా రిజిస్ట్రేషన్లు కావు.. ఇండ్ల నిర్మాణాలకు అనుమతులు రావంటూ .. స్థల,ప్లాట్ల యజమానులను ఆందోళనకు గురి చేసి అతి తక్కువ ధరతో అగ్రిమెంట్లు చేయించుకుంటు న్నారు. దీంతో డబ్బులు అత్యవసర పరిస్థితులున్న యజమానులు వారి ప్లాట్లను తక్కువ ధరకు అగ్రిమెంట్లు చేసి నిలువునా మోస పోతున్నారు. మరికొంతమంది దళారుల చేతికి అడిగనంత ఇచ్చి తమ ప్లాట్లలో ఇండ్ల నిర్మాణాలు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే నిబంధనల ప్రకారం వక్ఫ్ బోర్డు ప్రకటించిన విధంగా సదరు స్థలాల్లో ఇండ్ల నిర్మాణాలకు మున్సిపల్ కార్పొరేషన్ ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదు. అయితే ప్రభుత్వ నిబంధనలను కాదని దళారులు రంగప్రవేశం చేసే నిషేధాజ్ఞలను అడ్డం పెట్టుకుని స్థల యజమానుల వద్ద లక్షల్లో దండుకుని నిషేధిత సర్వే నంబర్లలో పెద్దఎత్తున ఇండ్ల నిర్మాణాలను కొనసాగిస్తున్నా కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు గాని, వక్ఫ్ బోర్డు అధికారులు గాని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అడ్డు అదుపులేకుండా కొనసాగుతున్న ఈ అక్రమ నిర్మాణాల దందా వెనుక కొంత మంది ప్రజా ప్రతినిధులు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఉంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. వక్ఫ్ బోర్డు స్థలాలలో చేపడుతున్న నిర్మాణాలు అక్రమమని తెలిసినా భారీ మొత్తంలో ముడుపులు అందుకున్న టౌన్ ప్లానింగ్ అధికారులు. ప్రజాప్రతినిధులు. వాటిని నిలువరించలేకపోతున్నారని, నిషేధిత సర్వే నంబర్లలో నిర్మాణాలు చేపట్టడానికి భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడుతున్నారనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా కార్పొరేషన్ పరిధిలోని ఆర్ఎస్ఎస్ కాలనీ, శ్రీసాయినగర్ కాలనీ, మణికంఠ నగర్, రాజలింగం కాలనీ- ఫేజ్-2, బాలచిత్తారి నగర్, ఎస్ ఐఎస్ కాలనీ, అనఘాపురి కాలనీ, మారుతి నగర్,శ్రీ సాయి ఎన్ క్లేవ్ , భీంరెడ్డినగర్, , బొల్లిగుడెం తదితర ప్రాంతాలలో విచ్చలవిడిగా బహుళ అంతస్తుల నిర్మాణాలతో పాటు ఎలాంటి అనుమతులు లేని నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిర్మాణాలను నిషేధించిన ప్రాంతాలలో యధేచ్చగా సాగుతున్నా అక్రమనిర్మాణాలపై పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమిచేయలేని పరిస్థితిలో అమ్యామ్యాలను భారీగా వసూలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలే అధికంగా ఉన్నాయి. మరికొన్ని కాలనీలలో అనుమతులు లేకుండా చేపడుతున్న వారితో కాలనీ సంఘాల ప్రతినిధులు లాలూచి పడి అందినంత దండుకుంటున్నారనే ప్రచారం ఉంది. కాలనీ సంక్షేమ సంఘం ముసుగులో భారీ ఎత్తున వసూళ్లకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్, వక్ఫ్ బోర్డు శాఖల అధికారులు కండ్లు తెరిచి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిషేధాజ్ఞలు అమలులో ఉన్న కాలనీలలో జోరుగా సాగుతున్న అక్రమ నిర్మాణాలను నిలిపి దళారుల అక్రమ దందాకు అడ్డుకట్టవేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులను సంప్రదించేందుకు యత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

చర్లపల్లిలో ఛాయి పే ములాఖాత్



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లో రాష్ట్ర ఎంబీసీ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చాయి పే ములాఖాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుస్తూ వారి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుక ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ ప్రెసిడెంట్ దప్పు గిరి, డబ్బు యాదయ్య, మహేష్ గౌడ్, బోడిగ రాజు,జై కష్ణ,సంపత్,కోటేష్ రెడ్డి, నాయక్,సోమన్న ,ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో
భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతులు



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సంస్కతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సర్దార్ భగత్ సింగ్, గుర్రం జాషువా జయంతుల సందర్భంగా కమలానగర్ ఆఫీసులో సామాజిక చైతన్యం- అవశ్యకత అంశంపై సదస్సు, నివాళి కార్యక్రమం జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి కేసీఆర్ దాసు, గుర్రం జాషువా చిత్రపటానికి మూర్తి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశానికి ఇన్సూరెన్స్ రంగంలో కషిచేసిన జయరాజు అధ్యక్షత వహించారు. ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు ప్రధాన వక్తగా ప్రసంగించారు. ప్రసాద్‌బాబు మాట్లాడుతూ గుర్రం చదువుకునే సమయంలో కూడా విపరీతమైన వివక్షకు గురయ్యారని చెప్పారు. హిందూమతంలో ఏర్పడిన కుల వివక్ష దుర్మార్గాలను వెలుగెత్తి చాటారని అన్నారు. గుర్రం జాషువా రాసిన అనేక కవితలు పద్యాలు ముందుగా ఈసడించుకున్న వారే తర్వాత గండపెండేరం తొడిగి ఏనుగుపై ఊరేగించారని చెప్పారు. ఆయన సామాజిక చైతన్యం అందరిలో అందించడానికి ప్రయత్నించారని చెప్పారు. ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ భగత్ సింగ్ బాల్యం నుండి స్వాతంత్ర కాంక్షతో ఉండి స్వాతంత్రం సాధించడానికి పోరాట మార్గమే సరైనదని భావించి పోరాట రూపంలోకి ముందుకెళ్లారని చెప్పారు. ఈ సందర్భంగా నాగయ్య , సిహెచ్ నాగేశ్వరరావు, మల్లేష్ , శ్రీనివాస్ ప్రసంగించారు. చివరగా సమన్వయకర్తగా వ్యవహరించిన గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ స్ఫూర్తి గ్రూపు నిర్వహించే కార్యక్రమాలు తమ నివాస ప్రాంతాలలో అపార్ట్మెంట్స్‌లలో ఎంతమంది ఉన్నా చైతన్యంతో అక్కడ నిర్వహించాలని చెప్పారు. అక్టోబర్ రెండో తేదీన గాంధీ జయంతి సందర్భంగా కాప్రా మున్సిపల్ సర్కిల్ ప్రాంగణంలో గాంధీ విగ్రహం దగ్గర నివాళి , మతోన్మాదం దేశానికి అరిష్టం అనే అంశంపై సదస్సు ఉంటుందని అందరూ హాజరు కావాలని కోరారు. శివరామకష్ణ, ఆచార్యులు, శారద, భాస్కర్ రావు, జయప్రకాష్, వెంకటసుబ్బయ్య, ఆర్ఎస్ఆర్ ప్రసాద్, గోవిందరావు, శివ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు అవసరం : సాయిని నవీన్ కుమార్



నవతెలంగాణ-బోడుప్పల్

దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం తణప్రాయంగా త్యజించిన విప్లవ యోధుడు షాహిద్ భగత్ సింగ్ పోరాట స్ఫూర్తి నేటి యువతకు అందించాల్సిన అవశ్యకత ఎంతైన ఉందని బోడుప్పల్ భగత్ సింగ్ యువజన మండలి అధ్యక్షుడు సాయిని నవీన్ కుమార్ అన్నారు. గురువారం బోడుప్పల్ అంబేద్కర్ చౌరస్తాలో భగత్ సింగ్ జయంతి వేడుకలో ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ లాంటి యోధుల చరిత్ర నేటి తరం వారికి అందించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు.భారత ప్రభుత్వం భగత్ సింగ్ కు భారత రత్న అందించి గౌరవించాలని అదే ఆయన పోరాట చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శశిధర్, భానుచందర్,సామల రాకేష్, వినీత్, గణేష్, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కనుల పండుగగా శ్రీనివాస కళ్యాణం..



తెలంగాణ-ఉప్పల్

వెంకటేశ్వర స్వామి మహా తంత్ర పీఠం ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి కి సంకల్పించిన 111 కళ్యాణాలలో భాగంగా 54వ శ్రీనివాస కళ్యాణం చిలుకనగర్ డివిజన్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఎం. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కనుల పండుగగా జరిగింది. ఈ కళ్యాణం లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, ఎమ్మెల్సీ రామచంద్రరావు, కార్పొరేటర్లు బండారు వాణి వెంకటరావు, కక్కిరేణి చేతన హరీష్, గొరిగే కష్ణ, శ్రీనివాస శర్మ, మహంకాళి లక్ష్మణ్, బాలచందర్, రావుల బాలకష్ణ గౌడ్, కంచర్ల భరత్ రెడ్డి, బలవంత చారి, గోనె అంజయ్య, గోనె శ్రీకాంత్ రామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

రైతులను మోసం చేస్తున్న నిఖితా కిసాన్ సేవా కేంద్ర

- జీఎస్టీ పన్నులు సైతం ఎగవేత
- తయారీ ఒకచోట.... అమ్మకం మరొకచోట....!
- సొంత యూట్యూబ్ ఛానల్‌తో రైతులను మభ్యపెడుతున్న యజమాని



నవతెలంగాణ- మేడ్చల్

దుక్కి దున్ని సేద్యం చేస్తూ పంటలను పండిస్తున్న రైతులను నిఖితా కిసాన్ సేవా కేంద్ర పరిశ్రమ నిలువెత్తు మోసం చేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మేడ్చల్ మండల పరిధిలోని బండమాదారం గ్రామ పంచాయతీ పరిధిలో నిఖితా కిసాన్ సేవా కేంద్ర పేరుతో ఏర్పాటు చేసిన ఆయిల్ పరిశ్రమకు గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, పన్ను చెల్లించకుండా మిర్చి పంటలకు సంబంధించిన ఆర్గానిక్ మందులను విక్రయిస్తున్నారు.నిఖితా కిసాన్ సేవా కేంద్ర పేరుతో యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేసిన యజమాని రైతులకు తప్పుడు ప్రచారాలు చేస్తూ రోజుకు లక్షలు సంపాదిస్తున్నారని తెలుస్తోంది. అన్నం పెట్టే రైతులను మోసం చేస్తున్నామని ఆలోచించకుండా మిర్చి పంట దిగుబడి కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి వందల కిలోమీటర్ల దూరం నుండి వచ్చిన రైతులకు ఉదయం అల్పాహారం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు. వేల రూపాయలు పెట్టి రైతులు కొనుగోలు చేసిన రసాయనాలకు ఎలాంటి రసీదులు ఇవ్వకుండా కేవలం కాగితంపైనే రైతు పేరు,తేదీ,ఎంత చెల్లించాడు,డబ్బుల వివరాలు,రసాయనాల వివరాలు తెలుపుతూ చిన్న కాగితంపై ఇచ్చి ప్యాకింగ్ సెక్షన్ పంపిస్తే అక్కడ వారు కాగితంపై పేయిడ్ అని రాసి ఉంటే అందులో ఎలాంటి నూనెలు ఉన్నాయో అవన్నీ ఒక కాటన్ లో ప్యాక్ చేసి రైతులకు అందజేస్తున్నారు.

జీఎస్టీ పన్నులు సైతం ఎగవేత

నిఖితా కిసాన్ సేవా కేంద్రంలో రైతులు మిర్చి పంట దిగుబడి కోసం కొనుగోలు చేస్తున్న ఆర్గానిక్ రసాయనాలకు సంబంధించి పన్ను చెల్లించిన రశీద్ ఇవ్వాల్సిన సదరు పరిశ్రమ యాజమాన్యం కేవలం చిన్న పేపర్ ముక్కపై రాసి ఇవ్వడంతో జీఎస్టీ నంబర్ 36 ాఏఎంఈపీఎం3245ఎం3జెడ్ఆర్ పేరుతో తీసుకున్న లైసెన్ నిజమైనదా...? లేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారా...! ఒకవేళ నిజమైన లైసెన్సు సదరు జీఎస్టీ అధికారుల నుంచి తీసుకుంటే మిర్చి పంటల దిగుబడి కోసం కొనుగోలు చేసిన రసాయనాల విషయంలో ఎందుకు జీఎస్టీ ఉన్న బిల్లులు రైతులకు ఇవ్వకుండా కేవలం చిన్న పేపర్ ముక్క ఇవ్వడంతో సదరు సంస్థ జీఎస్టీ పన్నులు ఎగవేత చేస్తున్నారని అనే విమర్శలు రైతుల నోటి నుంచి వినిపిస్తున్నాయి.

తయారీ ఒకచోట.... అమ్మకం మరొకచోట..

నిఖితా కిసాన్ సేవా కేంద్ర పేరుతో మిర్చి పంటకు తయారు చేస్తున్న రసాయనాలు సర్వే నంబర్ 214/ఏ,అయోధ్య ఎక్స్ రోడ్,కండ్లకోయ పరిధిలో తయారు చేసి మేడ్చల్ మండల పరిధిలో డోర్ నెంబర్ 2-78,బండమాదారం గ్రామం,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎలాంటి గ్రామ పంచాయతీ నుంచి విక్రయ అనుమతి లేకుండా రోజుకు వందలాది మంది రైతుల నుంచి వేల రూపాయలు తీసుకుని ఈ మిర్చి పంట రసాయనాలను విక్రయిస్తున్నారు.ఇదే విషయమై సంబంధిత బండ మాదారం గ్రామపంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా తమ దగ్గర ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు.

పనిచేసేది ఒకచోట విధులు నిర్వహణ మరోచోట

శ్రీరంగవరం గ్రామపంచాయతీ కార్యదర్శి బండ మాదారం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పరిశ్రమకు వచ్చి మాట్లాడడం ఏంటని పలువురు గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలి



నవతెలంగాణ-కాప్రా

భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్,టి.సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద భగత్ సింగ్ జయంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి సల్మాన్ బేగ్, సత్య ప్రసాద్, లు సంయుక్తంగా మాట్లాడుతూ భగత్ సింగ్ జీవితం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన భాద్యత పాలకులదేనని వారు ఉద్ఘాటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని, పరీక్షల పేరిట నయవంచన చేస్తున్నదని, ఒకవైపు ఉపాధి కల్పిస్తామని హామీ ఇస్తూనే... మరోవైపు పోటీ పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ కు ఇవే చివరి ఎన్నికలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ జిల్లా నేతలు యోగిత, స్వప్న, నవీన్, దుర్గా ప్రసాద్, నాగరాజు, మణి, గణేష్,రమ్య, దీప్తి,మణాళిని, నర్మద పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాలలో పాల్గొన్న కార్పొరేటర్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని విశ్వకర్మ కాలనీ, సిద్ధి వినాయక నగర్‌లలో ఏర్పాటుచేసిన గణేష్ మండపాల ను సూరారం 129 డివిజన్ కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డితో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మండపాల నిర్వాహకులు వారిని శాలువలతో సత్కరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో కాలనీల ప్రెసిడెంట్లు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నాయకులు టాక్ లక్ష్మణ్, మండపాల నిర్వాహకులు, స్థానిక నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్


నవతెలంగాణ-కూకట్‌పల్లి



23 ఏళ్ళ వయసులోనే ఉరిశిక్ష పడుతుందని తెలిసినా దేశం కోసం ఉరితాడును ముద్దాడిన త్యాగశీలి భగత్ సింగ్ అని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. గురువారం ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ప్రగతినగర్‌లో ఆయనకు ఘనంగా జోహార్లు అర్పించారు. అనంతరం కార్తీక్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానం ఎప్పటికీ అన్యాయం, దౌర్జన్యం, అణచివేతలకు వ్యతిరేకంగా ఎదగడానికి స్ఫూర్తినిస్తుందని ఆయన అన్నారు. మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుమంత్, సంయుక్త కార్యదర్శి మంజో, వంశీ పాల్గొన్నారు.

సామాన్యులకు షాక్.. పెరిగిన కంది పప్పు ధరలు

- రోజురోజుకు పెరుగుతున్న కంది పప్పు ధరలు
- పేద ప్రజలకు అందని ద్రాక్షల నిత్యావసర సరుకుల ధరలు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఏం కొనేటట్టు లేదు, ఏం తినేటట్లు లేదు ..ఈ పాట మనం అందరం ఎన్నో సార్లు వినే ఉంటాం. అయితే.. ప్రస్తుతం ప్రజల పరిస్థితి అలానే మారింది. సామాన్య ప్రజలను ఏవస్తువు వదిలిపెట్టడం లేదు..ఎక్కడ కూడా తగ్గేదెలా అంటూ ధరల మోత మోగిస్తున్నాయి. మొన్నటి వరకు టమాటా ధరలు ఆకాశానికి అంటగా..ఇప్పుడు కందిపప్పు నేను కూడా అంతే అంటూ డబుల్ సెంచరీకి వెళ్తుంది. కందిపప్పు వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. మలబద్ధకం సమస్య తీరుతుంది. గుండెకు సంబంధించిన సమస్యల్ని కందిపప్పు నివారిస్తుంది. గుండెకు వ్యాధులు రాకుండా కాపాడుతుందని ఆరోగ్య నిపుణులు చెపుతుంటారు. దీంతో మారే ఏ పప్పుకు లేని డిమాండ్ కందిపప్పును ఏర్పడుతుంది. దీంతో కందిపప్పు (Toor Dal) ధర రోజు రోజుకు పెరుగుతుంది. అసలు డైలీ కందిపప్పు తినేవారు కూడా ఉన్నారు. ఇలాంటి ఈ సమయంలో కందిపప్పు ధర పెరుగుతుండడం సామాన్య ప్రజలను గగ్గోలు పెట్టిస్తుంది. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు సామాన్య ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. తాజాగా, కందిపప్పు ధరలు అమాంతం ఆకాశానికి పెరిగేసాయి. లికేజీ కందిపప్పు రూ. 150 ఉండగా.. ఇప్పుడు ఏకంగా 50 రూపాయలు పెరిగి 200 లకు చేరింది. దీంతో సామాన్య, పేద ప్రజలకు కందిపప్పు అందని ద్రాక్షలా మారిపోయింది. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు కందిపప్పు ధర పెరిగి షాక్ ఇచ్చిందనే చెప్పుకోవాలి. కంది సాగు తగ్గడం, ఉత్పత్తి పడిపోవడంతో పప్పు ధర పెరుగుతుందని చెబుతున్నారు. వచ్చే రోజుల్లో కిలో కంది పప్పు రూ. 200 లకు పైనే ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో పేదలు కంది పప్పు కొనలేరు. గతంలో కందిపప్పు ధర పెరిగినప్పుడు రేషన్ షాపుల ద్వారా కంది పప్పును రాయితీతో అందించారు. కానీ ఇప్పుడు అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి కంది పప్పును రేషన్ షాపుల ద్వారా రాయితీపై అందించాలని ప్రజలు కోరుతున్నారు. దేశవ్యాప్తంగా కంది సాగు తగ్గిపోయింది. ఫలితంగా ఉత్పత్తి కూడా పడిపోయింది. 2018లో 43లక్షల టన్నుల ఉత్పత్తి లభించగా.. 2023లో 34లక్షల టన్నులకు తగ్గింది. కంది పప్పు ధర పెరుగుతోంది. మరోవైపు కేంద్ర కూడా కంది పప్పు దిగుమతి పెంచడానికి చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలను అదుపులోకి తెవడానికి ప్రయత్నం చేస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు పండగ వేళ పప్పన్నం కూడా కరువయ్యేలా ఉందని అంటున్నారు. ప్రస్తుతం పండుగల వేళ పప్పులు ధరల పెంపుతోపాటు బియ్యం ధరలు పెరగడం సామాన్యులకు మింగుడుపడడం లేదు. ఇప్పటికే అన్ని రకాలుగా నిత్యావసరాల ధరలు పెరిగిపోవడంతోపాటు విద్యుత్ చార్జీలు వంటివి దారుణంగా పెరగడం సామాన్య, మధ్యతరగతి ప్రజలను అష్టకష్టాలపాలు చేసింది. కొన్ని కుటుంబాల్లో జీవనం ఎలా గడుస్తున్నదో తెలియని అయోమయం నెలకొంటోంది. ఏది ఏమైనప్పటికి కందిపప్పు ధర రోజు రోజుకు పెరగడం అనేది సామాన్య ప్రజలను కన్నీరు పెట్టిస్తుంది. టమాటా విషయంలో ఎలాగైతే సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నారో..కందిపప్పు విషయంలో కూడా అలాగే చేయాలని ప్రభుత్వాలను సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి మండల పరిధిలోని వినాయక నగర్ డివిజన్ సంతోషిమాత అడ్డా బీసీ డబ్ల్యూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించి భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకోవడం జరిగిందని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు తెలియజేశారు. అడ్డా కార్మిక సమస్యలు పరిష్కరించడంలో ALOలు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ కార్మికులకు పట్టణ ఉపాధి పథకం అమలు చేసి వంద రోజుల పని కల్పించాలని, కార్మికులందరికీ మంత్రి మల్లారెడ్డి ప్రకటించినట్టుగా బైకులను అందజేయాలని ఈ సందర్భంగా కార్మిక శాఖను డిమాండ్ చేశారు. నిర్మాణ కార్మికుల సమస్యలపై సమగ్రమైన సర్వే నిర్వహించి వారందరికీ కార్మిక శాఖలో పేర్లు నమోదు, రిజిస్ట్రేషన్స్, గుర్తింపు కార్డులు అందజేయాలని అడ్డాల మీద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. త్రాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ , షెడ్స్ నిర్మాణం కోసం కార్మిక శాఖ కృషి చేయాలని తెలిపారు. అనంతరం సంతోషిమాత బీసీ డబ్ల్యూ నూతన కమిటీ గౌరవ అధ్యక్షులు ఎర్రోళ్ల సుమిత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు నర్సింగరావు, అధ్యక్షులుగా ఏలగపల్లి కృష్ణ, ఉపాధ్యక్షులుగా పి. నారాయణ, కే .రాజేష్ , రత్నావత్ అంజలి, సహాయ కార్యదర్శులుగా పి.పరశురాములు, పి. ఏడుకొండల్, జె. రవి, బాలరాజు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

భగత్ సింగ్ అడుగుజాడల్లో యువత నడవాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



అతిపిన్న వయసులోనే తెల్ల దొరలను గడగడలాడించిన యువ కెరటం, స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్ అడుగుజాడల్లో యువతతో పాటు ప్రతి ఒక్కరు నడవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గురువారం భగత్ సింగ్ జయంతి పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గాజుల రామారం డివిజన్ భగత్ సింగ్ నగర్ లో స్థానిక నాయకులు హర్భజన్ సింగ్ గారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ పోరాట ప్రతిమ నేటి యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మైనార్టీ అధ్యక్షులు లాల్ మహమ్మద్, బేకరీ గడ్డ ప్రెసిడెంట్ గఫర్, జలీల్, అన్వర్, కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు దండే రాజు, రాజ్ కుమార్ విశాల్ ముదిరాజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆశా, అంగన్వాడీ వర్కర్ల సమస్యలపై చర్చించాలి



నవతెలంగాణ-బాలానగర్

ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె గురువారం 4వ రోజు ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు అనిత, సబియాలు పాల్గొని మాట్లాడుతూ మా సమస్యలను సీఎం కేసీఆర్ నేడు జరగబోయే క్యాబినెట్ సమావేశాల్లో చర్చించాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కోరుతున్నామన్నారు. మేము గత 20 సంవత్సరాలుగా ఆశాలో గర్భిణీ స్త్రీలకు, ప్రజలకు సేవలు చేస్తున్నామని, కరోనా కష్టకాలంలో కూడా మా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల కోసం మా ప్రాణాలను త్యాగం చేశామన్నారు. అలాంటి ఆశాలకు జీతాలు ఫిక్స్ వేతనం లేకపోవడం చాలా బాధాకరమైన విషయం అని పేర్కొన్నారు. వెంటనే కేసీఆర్ స్పందించి మా ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18 వేలతో పాటు ప్రమాద బీమా రూ.5 లక్షలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ సమ్మెలో వినోద, మౌనిక, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు సందర్భంగా జష్నే మిలాద్ ఉన్ నబి కార్యక్రమాన్ని గురువారం బాలానగర్ డివిజన్‌లో తెలంగాణ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎన్‌జే హాస్పిటల్ సహకారంతో క్యాన్సర్ రోగుల సహాయం కోసం బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మహమ్మద్ యాసీన్, మహమ్మద్ మతీన్, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రేమ్ కుమార్, వెంకట చారి, ఎం. సుధాకర్, స్టాఫ్ నర్స్ మమత పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకునే మానవతావాది ఎమ్మెల్యే



సయ్యద్ రషీద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆపదలో ఉండే అభాగ్యులను ఆదుకునే మానవతావాది వారికి అండగా స్థానిక ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముందు ఉంటారని మాజీ కో ఆప్షన్ సభ్యులు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సయ్యద్ రషీద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దూం నగర్‌లో నివసించే అర్జున్ గిరి స్క్రాప్ షాప్ వ్యాపారం చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దురదృష్టవశాత్తు నాలుగు రోజుల క్రితం విద్యుత్తు షార్ట్ సర్క్యూట్‌తో షాపు మొత్తం తగలబడింది. దీనితో అర్జున్ గిరి ఆర్థిక పరిస్థితి దెబ్బతిని బ్రతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి మానవతా దృక్పథంతో అర్జున్ గిరికి రూ. 50 వేలు ఆర్థిక సహాయం చేయడంతో గురువారం స్థానిక బీఆర్ఎస్ నాయకులు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు రుద్ర అశోక్, జాతీయ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లగోపుల బాబుగౌడ్, శ్రీవారి ఆలయ చైర్మెన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు ఎత్తరి మారయ్య, శశిధర్, లక్ష్మణ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు బింగి ఇందిర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రి రాజశేఖర్ రెడ్డి గెలుపునకు కృషి : కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గెలుపుకు తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయనకు తన సంపూర్ణ మద్దతు తెలియ చేస్తున్నానని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి చెప్పారు. గురువారం ఆమె, నేరేడ్‌మెట్ డివిజన్ పార్టీ ఆఫీస్‌లో డివిజన్‌కి సంబంధించి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు కార్యకర్తలు అందరూ బీఆర్ఎస్ పార్టీలో కొనసాగాలని నిర్ణయించామన్నారు. అధిష్టానం సూచించిన అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డికే తన సంపూర్ణ మద్దతు అని స్పష్టం చేశారు. ఆయన గెలుపు కోసం సమష్టిగా పని చేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అనంతరం కార్పొరేటర్, మల్కాజిగిరి పార్లమెంటరీ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డితో కలిసి, డివిజన్ పరిధిలోని యాప్రాల్ చిన్న కందిగూడలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, కరంచంద్, శివ, మహేష్, రాజు, రాజేష్, సాయి గౌడ్, విజయ లక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డు రూ. 97 వేలకు దక్కించుకున్న అరుణ్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



జగద్గిరిగుట్ట డివిజన్ జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్‌లో స్థానిక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడి లడ్డు వేలం పాట గురువారం సాయంత్రం కమిటీ సభ్యులు వినాయక మండపం ఆవరణలో నిర్వహించారు ప్రముఖ సంఘ సేవకులు జి. అరుణ్ గౌడ్ రూ .97,000 రూపాయలకు దక్కించుకున్నారు. అనంతరం నిమజ్జోత్సవం కార్యక్రమాలు పురవీధుల్లో పాటలతో సందడి చేస్తూ ఐడియల్ చెరువుకు తరలించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సీహెచ్ భాస్కర్ రెడ్డి, రేపన్ గిరిబాబు, కూరపాటి శ్రీరామరాజు, ఉప్పల రమేష్ గుప్తా, పాండాల శ్రీనివాస్ గౌడ్, బింగి శ్రీనివాస్ గౌడ్, తేరాల శ్రీనివాస్ గుప్తా, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



వాజ్ పేయ్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన మండపం వద్ద గణపతి లడ్డూని వేలం పాట నిర్వహించారు. 16 కిలోల గణపతి లడ్డూని వేలం పాటలో స్థానికుడు, న్యాయవాది రంజిత నరేష్ అక్షరాలా ఒక లక్ష 50 వేల రూపాయలకు లడ్డుని కైవసం చేసుకు న్నట్లు అసోసియేషన్ నాయకులు చెప్పారు. గత నాలుగు ఏళ్ల నుంచి ఇక్కడ స్వామి వారి లడ్డూని కైవసం చేసుకుంటున్న ఈ దంపతులను, వారి కుటుంబ సభ్యులను ఎల్లవేళలా భగవంతుడు ఆశీర్వదించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నామని అసోసియేషన్ వారితో పాటు కాలనీ వాసులు తెలిపారు. నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బీజేపీ కాంగ్రెస్ పార్టీలు అసత్య ఆరోపణలు తప్ప ప్రజల కోసం ఆలోచించరు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీజేపీ కాంగ్రెస్ పార్టీలు అసత్య ఆరోపణలు తప్ప ప్రజల కోసం ఆలోచించరు అని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. 45వ రోజు గురువారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి కేటీఆర్ ఎంతో సహకరించారన్నారు. నేడు సమస్యలు లేని డివిజన్‌గా కూకట్‌పల్లి నిలవబోతుందని అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. వర్షాలను సైతం తట్టుకునేటట్లు భూగర్భ డ్రయినేజీ నిర్మాణాలు ఎక్కడకక్కడ సీసీ రోడ్డు 24 గంటలు విద్యుత్, మంచినీరుకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడం వంటి మౌలిక సదుపాయాలు కల్పించడంలో సఫలీకృతమయ్యామని తెలిపారు. కే.పి.హెచ్.బి లోని మహిళా చిల్డ్రన్ పార్కులను ఏర్పాటు చేసిన ఘనత టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 122 కోట్ల రూపాయలతో నాలా, రిటర్నింగ్ వాల్ కోసం శంకుస్థాపన చేశామన్నారు. బీజేపీ కాంగ్రెస్ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో అయినా డబుల్ బెడ్ రూములు ఇస్తున్నారా అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన రేవంత్ రెడ్డి ఏనాడు కూడా నియోజకవర్గంకి రాలేదు. ప్రజా సమస్యలు తెలుసుకోలేదు . అని ఎద్దేవా చేసారు. కూకట్‌పల్లి నియోజక వర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం డివిజన్ షాపూర్ నగర్ లో బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక మండపాని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ గణేష్ నవరాత్రులు మొత్తం అన్ని చోట్లా అన్నదాన కార్యక్రమాలు నిర్వవహించడం గొప్ప మహత్తర కార్యక్రమం అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, బావిగడ్డ రవి,జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజేష్ మిశ్రా, స్థానిక నాయకులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



అలసట లేని గుండెను కాపాడుకుందాం

- నిరంతరం పనిచేసే కీలక అవయవం
- కొద్దిపాటి వ్యాయామం, జాగ్రత్తలతో పదిలం
- కొండాపూర్ కిమ్స్ సీటీ సర్జన్ డాక్టర్ నిసర్గ
- నేడు ప్రపంచ గుండె దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

'మీరు ఎవరినైనా పదే పదే మోకాలు వంచమని చెబితే.. కొంతసేపటి తర్వాత ఇక అలసిపోతారు. వాళ్ల కండరాలు నొప్పిపుట్టి, ఇక ఆగిపోతారు. కానీ అదే ప్రశ్న మీరు మీ గుండెకు వస్తే.. 'నేనెప్పుడూ అలసిపోను' అనే సమాధానమిస్తుంది. జీవితాంతం నిరంతరాయంగా లక్షలు, కోట్ల సార్లు రక్తాన్ని పంప్ చేస్తూనే ఉంటుంది. ఇంత అద్భుతమైన అవయవం కూడా కొన్నిసార్లు విఫలమవు తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 2 కోట్ల మందికిపైగా గుండెపోటుతో చనిపోతున్నారు. ఇందులో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ మరణాల్లో 80 శాతానికి పైగా నివారించదగ్గవే!! గుండె గురించి తెలుసుకోండి. దానికి మరింత ఎక్కువ పని ఇవ్వండి. అప్పుడు అది ఆ పని చేయడానికి సిద్ధపడి, మీకు మరింత మేలైన విధంగా 'సేవ చేస్తుంది' అని కొండాపూర్ కిమ్స్ ఆస్పత్రికి చెందిన సీనియర్ కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ నిసర్గ చెప్పారు. ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈసారి "గుండెను ఉపయోగించండి.. గుండె గురించి తెలుసుకోండి" అనే థీమ్ తీసుకున్నారని చెప్పారు. మనకు బాగా తెలిసిన వాటినే మనం ప్రేమించి, వాటిని బాగా రక్షించుకుంటామని, గుండెను కాపాడుకోవడానికి జీవితంలో కొన్ని ప్రాథమిక సూత్రాలు పాటిస్తూ, క్రమశిక్షణగా ఉండటమే తరుణోపాయమని అన్నారు.

ఆయన చెప్పిన అంశాలిలా..

1. మంచి ఆహారం తీసుకోండి :

మన జీవనశైలి మారిపోతోంది. ఉద్యోగాల తీరు మారుతోంది. ఐటీ రంగం లాంటి చోట్ల మన ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయి. సరైన సమయానికి, సరైన ఆహారం తీసుకోవట్లేదు. కొలెస్టరాల్ ఎక్కువగా ఉండే ఆహారం, అధిక తీపి, జంక్ ఫుడ్ తీసుకోవడం మానేస్తే ఆరోగ్యకరమైన సుదీర్ఘ జీవనం లభిస్తుంది.

2. కొద్దిపాటి వ్యాయామం చేయండి :

మనుషులందరూ చక్కగా నడవగలరు. పరుగులు తీయక్కర్లేదు గానీ, కనీసం రోజూ కొంత దూరం నడవండి. రోజుకు 20 నిమిషాలు నడిస్తే గుండెకవాటాలకు బోలెడంత ప్రయోజనం ఉంటుందని రుజువైంది.

3. ఒత్తిడిని నివారించండి :

ఈ రోజుల్లో ఒత్తిడి లేని మనిషిని చూడటం దాదాపు అసాధ్యం. అయితే దాన్ని ఎలా తగ్గించుకోవాలనే మనం చూడాలి. ఇంటిని సంతోషంగా ఉంచుకోండి, ఆర్థిక వ్యవహారాలు సరిగా నిర్వహించుకోండి, పని వాతావరణం బాగుండేలా చూసుకోండి, రోజూ వ్యాయామం చేయండి. వీటన్నింటితో ఒత్తిడి బాగా తగ్గుతుంది.

4. ఇతర అంశాలు :

యువతలో గుండెపోటు రావడానికి ధూమపానం ప్రధాన కారణం. మెరుగైన రేపటి కోసం, ఈరోజే ధూమపానం మానేయండి. మీ రక్తపోటును పరీక్షించుకోండి. రక్తపోటు పెరగకూడదంటే, ఉప్పు వాడకం తగ్గించండి. మీ కుటుంబంలో వారసత్వ లక్షణాలు బాగా ఉంటుంటే, ఈరోజే పరీక్షలు చేయించుకోండి. భారతదేశం మధుమేహానికి రాజధాని. మన దేశంలో చాలావరకు గుండెకవాటాల వ్యాధులకు, వాటివల్ల మరణాలకు మధుమేహమే ప్రత్యక్ష కారణం. మధుమేహం త్వరగా రాకుండా ఉండాలన్నా, దాని దుష్ప్రభావాల నుంచి బయటపడాలన్నా రోజూ వ్యాయామం చేయండి.

శేరిలింగంపల్లిలో అవకాశం ఇస్తే విజయం సాధిస్తా

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇస్తే విజయం సాధిస్తా
- పార్టీ ఆదేశిస్తే ఎమ్మెల్యే గా గెలిచి పార్టీ కి బహుమతి గా అందిస్తాను
- 43 ఏండ్లుగా పార్టీ లో పని చేస్తూ ప్రజా సేవ లో ఉన్నాను
- ఎమ్మెల్యే అభ్యర్థికి అన్నీ విధాలుగా అర్హుడిని
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీజేపీ ఆవిర్భావం నుండి నేటి వరకు పార్టీలోనే కొనసాగుతూ ,పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజా సేవలో నిమగ్నమై, బలమైన నాయకుడిగా ఎదిగనాని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు అన్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గం నుండి పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి శేరిలింగ ంపల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 1988 సంవత్సరంలో ఆల్విన్ కాలనీలో బీజేపీ కార్యాలయాన్ని సొంత నిధులతో ప్రారంభించి, పార్టీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీని ముందుకు తీసుకెళ్లడంతో పాటు, ఆల్విన్ కాలని వివేకానంద నగర్ మధ్య వంతెన నిర్మాణానికి ఎంతగానో కృషి చెయ్యడం జరిగిందన్నారు. బీజేపీకి ఇంతగా కృషి చేసిన నాకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ప్రజా సమస్యలు తీర్చుతు ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అలాగే కరోనా సమయంలో ప్రజలకు నిత్యావసర సరుకులు,మరియు మందులు పంపిణీ చేసి కరోనా బాధితులను ఆదుకున్నారు. నిరంతరం అధికార పార్టీ చేస్తున్న తప్పులను ఎత్తి చూపుతూ ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో మార్పు కోసం బీజేపీ అనే నినాదంతో,స్థానిక సమస్యల పై పాదయాత్ర నిర్వహిస్తున్నమ న్నారు. సురభి రవీందర్ రావు గురించి చెపితే విద్యావేత్త గా విద్యాలయాన్ని నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ విద్యార్థుల తల్లి దండ్రులకు చేరువవుతున్నారు. అలాగే కార్మిక నాయకునిగా, 1981 లో కార్మిక సంఘం అధ్యక్షునిగా ఉన్న కీర్తి శేషులు టైగర్ ఆలే నరేంద్ర అధ్వర్యంలో ,ఆర్గనైజింగ్ సెక్రటరీ స్థాయి లో విధులు నిర్వర్తించి, ఉపాధ్యక్షుడి స్థాయికి ఎదిగి, 1993 లో ఆల్విన్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ క్రెడిట్ ఎన్నికల్లో పోటీ చేసి,కార్మికుల సహాయ సహకారంతో అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్రంలోనే అత్యధిక పన్నులు వసూలు చేసి ఇస్తున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రస్తుత ప్రభుత్వం పెరుగుతున్న జనాభాకు సరిపడా మౌలిక సదుపాయాల కల్పనలో, ట్రాఫిక్ నియంత్రణలోను రోడ్డు, డ్రయినేజీ, మంచినీటి సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, అందుకే నియోజకవర్గం ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. నియోజకవర్గం పై పట్టున్న నాయకుడిగా ప్రజా సమస్యల పై అవగాహన కలిగిన వ్యక్తిగా ప్రజలకు సుపరిచితుడను కాబట్టి అధిష్టానం ఆలోచించి తనకు అసెంబ్లీ టికెట్ కేటాయిస్తే ఎమ్మెల్యేగా గెలిచి పార్టీకి బహుమతిగా ఇస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నవతెలంగాణ
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | సెప్టెంబర్ 29, 2023 | www.navatelangana.com

ముస్లింలకు డిప్యూటీ మేయర్ శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఓయూ

గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలియజేశారు. 'ప్రవక్త బోధనలైన శాంతి, కరుణ, ధార్మిక చింతన, దాతత్వం, ఐకమత్యం, సర్వ మానవ సమానత్వం ప్రపంచమంతా వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నాను. ముస్లిం ప్రజల సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణలో గంగా జమున తహజీబ్ పరిరక్షణకు కృషి కొనసాగుతూనే ఉంటుంది'అని తెలిపారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బేగంపేట

భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సనత్ నగర్ డివిజన్ అధ్యక్షులు కోలను బాల్ రెడ్డి విచ్చేసి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ భారతీయుడు ఈరోజు గర్వించదగ్గ విషయమని.. పోరాటయోధుల త్యాగఫలమే మనం స్వతంత్రంగా స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. అమీర్‌పేట్ గురుద్వార్ సాహెబ్ ప్రెసిడెంట్ భాగీందర్ సింగ్, సురేందర్ సింగ్, నరేందర్ సింగ్, పర్విందర్ సింగ్ ,బల్విందర్ సింగ్, ఆనందజీత్ కౌర్, సర్ఫ్ సంతోష్ ,ఖలీల్ బెగ్, కరుణాకర్ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు

వర్షంలోనూ కొనసాగిన శోభాయాత్ర

- జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు ఇతర శాఖల సమన్వయంతో శోభయాత్ర ప్రశాంతం
- గురువారం నాటికి 90వేల విగ్రహాల నిమజ్జనం
- నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో వినాయక శోభాయాత్ర అట్టహాసంగా సాగింది. వర్షంలోనూ భక్తులు, నగరవాసులు సందడి చేశారు. బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు 19కిలోమీటర్ల మేర శోభయాత్ర కొనసాగింది. గురువారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఖైరతాబాద్ మహా గణేష్ నిమజ్జనాన్ని ట్యాంక్ బండ్‌లో బోట్టులో తిరిగి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నగర మేయర్



మాట్లాడుతూ ఖైరతాబాద్ గణనాథుని నిమజ్జనాన్ని అనుకున్న సమయంలో మధ్యాహ్నం 1.30లోపు పూర్తి చేశామని తెలిపారు. నిమజ్జనం అనంతరం పూజా సామాగ్రి, చెత్త వేరుచేయాలని శానిటేషన్ సిబ్బందిని నగర మేయర్ కోరారు. గణేష్ నిమజ్జనం కోసం 3000 శానిటేషన్ సిబ్బందిని రంగంలోకి దించామని, 369 క్రేన్లను ఏర్పాటు చేశామన్నారు. గణేష్ శోభయాత్రకు 30 కోట్లతో సివిల్ వర్క్స్, ట్రాన్స్పోర్ట్ ఏర్పాటు చేశామన్నారు. శోభాయాత్ర నిర్వహించే మార్గాలలో48,179 లైటింగ్ సౌకర్యము ఏర్పాటు చేశామన్నారు. వాటర్ వర్క్స్ డిపార్ట్మెంట్ ద్వారా శోభ యాత్రలో పాల్గొనే ప్రజలకు మంచినీటి అందచేయడం జరిగిందన్నారు. శోభయాత్ర నిర్వహించే మార్గాలలో చెట్లు, కొమ్మల తొలగించామని తెలిపారు. నిమజ్జనం కోసం వచ్చే విగ్రహాలకు స్వాగతం పలికే విధంగా స్వాగతం వేదికలను ఆర్ అండ్ బి ఏర్పాటు చేసింది అన్నారు. హుస్సేన్ సాగర్, సరూర్‌నగర్ 33 చెరువుల్లో నిమజ్జనం జరిగిందన్నారు. ముందస్తు చర్యలో భాగంగా 250 మంది గజ ఈతగాళ్ళ, 400 డీఆర్ఎఫ్ సిబ్బందితోపాటు క్రేయిన్ డ్రైవర్లను, మెకానిక్స్‌ను ఉందుబాటులో ఉంచామని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల కోసం ప్రత్యేకంగా 74 పాండ్లను ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జనం జరిగే ప్రదేశాలలో కొలనుల వద్ద ఒక క్రేన్స్, 27 బోట్స్ ఉండే విధంగా మూడు షిఫ్ట్‌లో సిబ్బంది పనిచేశారని తెలిపారు. మొబైల్ టాయిలెట్స్, స్టాటిక్ టాయిలెట్స్ సైతం ఏర్పాటు చేశామన్నారు. గురువారం వరకు దాదాపు 90,000 విగ్రహాలకుపైగా విగ్రహాలను నిమజ్జనం చేశారని తెలిపారు. గణేష్ నిమజ్జనానికి సహకరించిన హెచ్ఎండీఏ కమిషనర్ అరవింద్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, నగర సీపీ ఆనంద్, డీ ఆర్ ఎఫ్ చీఫ్ ప్రకాష్ రెడ్డితోపాటు ఎలక్ట్రిసిటీ, వాటర్ బోర్డు, టూరిజం శాఖ అధికారులకు, సిబ్బందికి ఖైరతాబాద్ గణేష్ కమిటీ ఉత్సవ సభ్యులకు, ఇతర శాఖల అధికారులుకు నగర ప్రజలు అందరికీ మేయర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



ఆటోమెటిక్ క్రేన్ యంత్రాలను ఉపయోగించాం



- ప్రశాంత వాతావరణంలో శోభయాత్ర
- రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాచకొండ కమిషనరేట్ పరిధిలో వినాయక శోభయాత్ర ఘనంగా కొనసాగింది. రాచకొండ పరిధిలో



గణేష్ నిమజ్జనం సందర్భంగా కాప్రా, ఎదులాబాద్ చెరువుల వద్ద నిమజ్జనం ఏర్పాట్లను రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం సజావుగా సాగేలా అన్ని ఏర్పాటు చేశామని, 6000 మందితో భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. అదనంగా 1000మందిని అందుబాటులో ఉంచామని వివరించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఈసారి పూర్తిగా ఆటోమెటిక్ క్రేన్ యంత్రాలను ప్రతీ చెరువు సరస్సుల దగ్గర ఏర్పాటు చేశామని తెలిపారు. నిమజ్జనం జరిగే మార్గాలలో సామాన్య ప్రజలకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసు విభాగం కృషి చేసిందన్నారు. జీహెచ్ఎంసి, విద్యుత్ శాఖతోపాటు తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిమజ్జన ప్రక్రియను కొనసాగించామని తెలిపారు. కమిషనర్ వెంట రాచకొండ అడ్మిన్ డీసీపీ ఇందిరతోపాటు ఇతర అధికారులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్‌లో సుమారు రూ. ఒక కోటి 33 లక్షలతో అభివద్ధి పనులకు కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి సి శంకుస్థాపన చేశారు. కామాక్షిపురం స్ట్రీట్ నెంబర్ వన్‌లో సీసీ రోడ్డు పనులకు రూ. 34 లక్షలు, మధురానగర్ రోడ్డు ప్యాచ్ వర్క్‌కు రూ.30 లక్షలు, సీసీ రోడ్డు వర్క్ భారత్ పెట్రోల్ బంక్ పక్కన షిప్స్ జూనియర్ కాలేజ్ దగ్గర రూ. 27.50 లక్షలు సీసీ రోడ్డు వర్క్, వీరరాజిరెడ్డి పార్క్ లైన్ రూ. 27 లక్షలు జిమ్ ఎక్విప్మెంట్, ఎస్ ఆర్ అపార్ట్మెంట్ దగ్గర రూ.14.30 లక్షల వ్యయంతో చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో అధికారులు నాగమణి, సాయికిరణ్, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చెల్లోజు ఎల్లాచారి, వేములకొండ వెంకన్నగౌడ్,పూల్లూరి భాస్కర్, సొడం మహేష్, కామాక్షిపురం వాసులు దుర్గేష్, ఉలుగోంద నారాయణదాసు ,శ్రీనివాస్,అంజయ్య పటేల్, తుమ్మల రవి, దర్శనాల సుధాకర్, మల్లేష్ గౌడ్,షషి కుమార్, వెంకటేష్,రవీంద్రనగర్ వాసులు ఎనుగు నర్సింహ్మారెడ్డి, ఇంద్రసింగ్, ఓంటేరు ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన నిర్లక్ష్యపు డ్రైవింగ్

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి

నవతెలంగాణ-బేగంపేట్



తమ ద్విచక్ర వాహనాన్ని నిర్లక్ష్యమైన డ్రైవింగ్‌తో నడిపి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన గురువారం ఉదయం మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ వరదేశి జాన్ తెలిపిన వివరాల ప్రకారం న్యూ బోయినపల్లికి చెందిన నందు గౌడ్ (24), ధృవ్ కుమార్ (24) ఎంబీఏ చదువుతున్నారు. నందు గౌడ్ తండ్రి చనిపోగా తల్లి ఇందిర కూరగాయల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవితాన్ని సాగిస్తున్నది. ధవ్ కుమార్ తండ్రి సుబ్బారావు టైలర్‌గా ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి 11.45 గంటల సమయంలో నందు గౌడ్ అరగంటలో వస్తానని తన తల్లికి చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్ళాడు. గురువారం ఉదయం 5 గంటల సమయంలో నందుగౌడ్ తన మిత్రుడు ధవ్ కుమార్తో కలిసి హెూండా యాక్టివా (టీఎస్ 10 ఈజడ్ 2493) మీద ప్యారడైజ్ హెూటల్ సర్కిల్ నుండి రాణిగంజ్ మీదుగా గోషామహల్ వైపు వెళ్తుండగా మహాత్మాగాంధీ రోడ్డులోని ఆజాం హెూటల్ ఎదురుగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన యూపీ 25 ఎస్‌టి 2699 నెంబరు గల 14 టైర్ల లారీని ఓవర్ టేక్ చేయబోయాడు. నిర్లక్ష్యంగా ఎడమ వైపు ఫుట్ పాత్‌కు రోడ్డుకు మధ్యన ఉండే కొద్ది పాటి స్థలంలో నుండి దాటించాలని చూశాడు. కానీ చివరి క్షణంలో యాక్టివా అదుపు తప్పి లారీ ముందు చక్రలా కింద పడ్డారు. దాంతో లారీ చక్రాలు వారిపై నుంచి వెళ్ళడంతో వారు ఘటనా స్థలంలోనే మతి చెందారు.

'వైఎంసీఏపై తప్పుడు ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు'



నవతెలంగాణ-బేగంపేట్

వైఎంసీఏకు ఎలాంటి సంబంధం లేని వాటిని ఆపాదిస్తూ తమ ప్రతిష్టకు భంగం కలిగేంచే అసత్య ఆరోపణలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు జయకర డేనియల్ హెచ్చరించారు. గురువారం వైఎంసీఏలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ (టీఎస్‌బిఏ)కు, వైఎంసీఏకు ఎలాంటి సంబంధం లేదని, టీఎస్‌బీఏలో రూ. 74 లక్షల అవినీతి జరిగిందని యూజిన్ జార్జ్ అనే వ్యక్తి వివిధ మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. వైఎంసీఏ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న నార్మన్ ఇస్సాక్ అవినీతికి పాల్పడ్డారని. ఆరోపిస్తున్నారని అయితే వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి ఆయన కాదని వివరించారు. కేవలం తమ దగ్గర బాస్కెట్ బాల్ కోచింగ్ సెంటర్ మాత్రమే కొనసాగుతుందని టీఎస్ బిఏకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అవినీతి జరిగిందని చెబుతున్న ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఎస్బిఐ బ్యాంకులో తమకు ఖాతానే లేదని, ప్రేమ్ కుమార్ అనే వ్యక్తి ఎవరో తమకు తెలియదని, అబిషేక్ అనే వ్యక్తి కోశాధికారి కాదని సంబంధం లేని విషయాలను తమకు అంటగట్టి దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూజిన్ జార్జ్ అనే వ్యక్తి ఒక అనాథగా ఉండగా వైఎంసీఏ బాయిస్ హాస్టల్లో ఉండి చదువుకుని ఇక్కడే బాస్కెట్ బాల్ కోచ్‌గా పనిచేసేవారని అతన్ని ఇక్కడి నుంచి తొలగించడంతో సేవా కార్యక్రమాలు చేస్తున్న ఇంత పెద్ద సంస్థపై ఆరోపణలు చేస్తూన్నారని చెప్పారు. తమ వద్ద ఇప్పుడు రాజారెడ్డి, రవీందర్ అనే వాళ్ళు మాత్రమే కోచ్‌లుగా పనిచేస్తున్నారని వివరించారు. నార్మన్ ఇస్సాక్ ఉన్నత స్థాయి వ్యక్తి అని ఆయనపై ఉండే వ్యక్తిగత కక్షలతో ఇలా తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎంసీఏ ప్రధాన కార్యదర్శి లేనార్డ్ మైరిన్, సీనియర్ కార్యదర్శి డాక్టర్ సంపత్, బ్రాంచ్ కార్యదర్శి జేమ్స్ కెన్నెత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దించుదాం



- పిడమర్తి రవి

నవతెలంగాణ-ఓయూ

విద్యా వ్యతిరేక బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాల్సిన బాధ్యత ప్రతీ విద్యార్థి పై ఉందని డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. గురువారం ఓయు బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ 17వ, వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆయన బీఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలపై కేసీఆర్ ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని అన్నారు. గ్రూప్1, గ్రూప్2 పరీక్షలు రద్దుచేసి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వాన్ని గద్దె దించవలసిన బాధ్యత విద్యార్థులు, నిరుద్యోగులపై ఉందని అన్నారు. ప్రయివేటు యూనివర్సిటీలు తెలంగాణ రాష్ట్రంలో అవసరం లేకున్నా కేసీఆర్ ప్రభుత్వం ప్రయివేటు యూనివర్సిటీల బిల్లును తెచ్చి తెలంగాణ అసెంబ్లీ లో ఆమోదం పొందిందని అన్నారు. బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ మాట్లాడుతూ. రాష్ట్రంలో విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడుతున్న విద్యార్థి సంఘం బిఎస్ఎఫ్ అని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో బీఎస్ఎఫ్ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. బీఎస్ఎఫ్ వ్యవస్థాపక సభ్యులు సదన్, పంచాయితీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్,గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు జోగు నరేందర్, బీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు గాద వెంకట్, రిసర్చ్ స్కాలర్ దర్శనంజాన్,నాయకులు మంగళపల్లి ప్రవీణ్, చెవుల కిషన్ బాలస్వామి, పాల్వాయి విజయ్,శేఖర్ వంత్, జగదీష్ ,గోవిక్ శ్రీశైలం, శ్రీకాంత్ , పాల్గొన్నారు.

ఓయూలో భగత్ సింగ్ జయంతి



నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎన్ఎస్‌యూఐ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 116 వ జయంతి నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓయూ ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ మేడ శ్రీను మాట్లాడుతూ ఈ దేశంలో ఈ రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను అరాచకాలు స్వేచ్ఛ లేని జీవితాల స్వేచ్ఛకై స్వతంత్ర భారతదేశంలో భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్క భావి భారత పౌరుడు తీసుకొని భవిష్యత్ తరాలకు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఎన్ఎస్‌యూఐ నేతలు మేడ శ్రీను,వికాస్, ఓయూ వర్కింగ్ ప్రెసిడెంట్ సుమన్ గౌడ్,మధు,కుమార్, పాండు, నాగరాజు, అఖిల్, అనిల్ అన్వర్ ,నిఖిల్ , పాల్గొన్నారు.

ముగిసిన మొదటి హాండ్స్ ఆన్ వర్క్‌షాప్



నవతెలంగాణ-ఓయూ

ఇటీవలి కాలంలో సీఆర్ఐఎస్‌పీఆర్ / సీఎస్9 బయో మెడికల్ పరిశోధనలో విప్లవాత్మక మార్పులు చేసింది. ఇంతకు ముందు కొన్ని జీవశాస్త్ర ఆవిష్కరణలు చేయగలిగిన విధంగా త్వరలో వైద్యపరమైన పురోగతులను ప్రారంభిస్తుంది. విద్యార్థులు విజయవంతమైన కెరీర్‌ను నిర్మించుకోవడానికి ఇటువంటి అత్యాధునిక సాంకేతికతలపై శిక్షణ కోసం " సీఆర్ఐఎస్‌పీఆర్ / సీఎస్9 బేస్డ్ జీనోమ్ ఎడిటింగ్ టెక్నాలజీ" పై మూడు రోజుల హ్యాండ్సన్ వర్క్‌షాప్‌ను సెప్టెంబరు 25న ప్రారంభించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో ముగిసింది. యూనివర్సిటీ యూనివర్సిటీ, సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, హైదరాబాద్, ఈ కార్యక్రమన్ని సంయుక్తంగా నిర్వహించారు. ప్రారంభ సెషన్‌లో ముఖ్య అతిథిగా హైదరాబాద్‌లోని సిఎస్ఐఆర్-సిసిఎంబి సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ త్రిపుర చతుర్వేదుల ప్రసంగిస్తూ అత్యాధునిక పరిశోధనలు చేయడానికి సాధనాలను నేర్చుకోవడం ద్వారా మెరుగైన శాస్త్రవేత్తలుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కోఆర్డినేటర్ డాక్టర్ నిశాంత్ జైన్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్, సీఆర్ఐఎస్‌పీఆర్ ఆధారిత క్లోనింగ్ వ్యూహాల ప్రాముఖ్యతపై పాల్గొనేవారిని ఉద్దేశించి ప్రసంగించారు. పాల్గొనేవారికి శిక్షణ ఇచ్చారు.

విద్యార్థుల రాజకీయ ప్రాతినిధ్యానికి నూతన జేఏసీ



నవతెలంగాణ-ఓయూ

యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో తెలంగాణ తెచ్చిన విద్యార్థి జేఏసీగా తెలంగాణలో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కోసం, తెలంగాణ సమాజాభివద్ధి కోసం టీజేఏసీ, ఓయూ జేఏసీని పునర్నిర్మిస్తూ నూతన జేఏసీని విద్యార్థి ఉద్యమకారులు సమావేశమై ఎన్నుకున్నారు. తెలంగాణ విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీని ప్రకటించారు.టీఎస్ జేఏసీ నూతన కార్యవర్గం:- చైర్మన్ డా. రుద్రవరం లింగస్వామి,గౌరవ అధ్యక్షుడు డా.నళిగంటి శరత్,అధ్యక్షులు కంచర్ల బద్రి,వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్వాయి నగేశ్,వైస్ చైర్మెన్ లు గాదె వెంకట్, పూసల రమేష్,నోముల శేషు ,పాపారావు,అశోక్ నాయక్ రంజిత్ చే,వైస్ ప్రెసిడెంట్‌లు వెంకట గల్ల వెంకట్, లెనిన్ రాజు,మిడతనపల్లి విజయ్, వి సైదులు,ఎం. అరుణ్ కుమార్, అధికార ప్రతినిధులు డా. భూపల్లి నారాయణ, డాక్టర్. మాండ్ల రవి, ఓదెలు,దర్శనం జాన్ జనరల్ సెక్రెటరీ లు ప్రచార కార్యదర్శి డా.అందే కష్ణ, క్రాంతి,సహాయ కార్యదర్శి ఈశ్వర్ ఎం,సెక్రటరీ నవీన్ రాజు,లీగల్ అడ్వైజర్ పులిగంటి సురేష్, జాయింట్ యాక్షన్ కమిటీ ఓయూ జేఏసీ నూతన కార్యవర్గ అధ్యక్షులు జంగిలి దర్శన్,ఉపాధ్యక్షులు మాడవి అజయ్, పాల్వాయి అజయ్, నోముల వంశి యాదవ్,అధికార ప్రతినిధులు సుమంత్,అజయ్, ఉదయ్, జనరల్ సెక్రటరీ లుగాఅజయ్, మాడుగుల శివ,దుర్గమ్ మల్లేష్,ప్రచార కార్యదర్శి చిన్న ప్రశాంత్వైదా బాబా నియమించారు.

నారాయణమ్మ కాలేజీలో గణేష్ ఉత్సవాలు



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

హైదరాబాద్‌లోని జి నారాయణమ్మ మహిళా కళాశాలలో గణేష్ ఉత్సవాలను 11 రోజులు ఘనంగా నిర్వహించారు. ఈ నిర్వహణకు కాలేజీ యాజమాన్యం ,విద్యార్థినులు ప్రతీరోజు పూజలు నిర్వహించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, 11వ రోజు విద్యార్థినులు అనేక రకాల పాటల తో, నత్యాలు చేసి అదేవిధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ ఏర్పాటుచేసిన గణపయ్య లడ్డును లక్ష రూపాయలకు అధ్యాపకులు, విద్యార్థినులు వేలం పాట లో దక్కించుకున్నారు . ఈ సందర్భంగా కాలేజీ చైర్మెన్ కే రాఘవరెడ్డి ,ప్రిన్సిపాల్ కె రమేష్ రెడ్డి ,కాలేజీ వైస్ చైర్ పర్సన్ జి శ్రీ విద్యా రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె రమేష్ రెడ్డి, కాలేజీ విద్యార్థినులను అభినందించారు. అనంతరం గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పాటలు పాడుతూ, డాన్స్ లు చేస్తూ వెళ్లి పూర్తి చేయించారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

న్యూ బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ వద్ద స్థానిక ఫ్రెండ్స్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో గురువారం షాహిద్ భగత్ సింగ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జంపన ప్రతాప్ ముఖ్య అతిధిగా హాజరై భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం లో భగత్ సింగ్ చేసిన విప్లవ పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను అనుసరిస్తూ దేశభక్తి పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సామాజిక సభ్యులు మద్ది భాస్కర్ రెడ్డి. చిన్ని కష్ణ జగదీష్ బ్రహ్మ రాము. మల్లేష్. రమేష్. ప్రదీప్. సన్నీ. ముసలయ్య. తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా శోభాయాత్ర

నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్ పరిధిలో ప్రశాంతంగా వినాయక శోభాయాత్ర, నిమజ్జనాలు కొనసాగుతున్నాయని బీజేపీ డివిజన్ కార్పొరేటర్ అమృత తెలిపారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, కార్పొరేటర్ శోభాయాత్రను దగ్గర నుండి పరిశీలించారు. శోభాయాత్రలో భాగంగా నవరాత్రులు కృషి చేసిన వారికి జ్ఞాపికలను అందజేశారు.



గాంధీనగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన గణేష్ నిమజ్జనం భక్తి శ్రద్ధలతో జరిగింది. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆకాష్, లక్ష్మణ్, అరుణ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-ముషీరాబాద్



గణేష్ శోభయాత్ర నిమజ్జనానికి బయలుదేరుతున్న గణనాధులకు స్వాగతం పలుకుతున్న వాసవి క్లబ్ సికింద్రాబాద్ వారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానేపల్లి జువెలర్స్ ఎండి రామారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసాదాలు పంపిణీ చేశారు . ప్రతి ఒక్కరికి గణపతి ఆశీస్సులు ఉండాలని అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని భగవంతుని వేడుకొన్నారు.
నవతెలంగాణ-బేగంపేట





యువనాయకుడు కే.వరప్రసాద్ మృతి



నవతెలంగాణ-బంజారా హిల్స్

ఖైరతాబాద్ ప్రాంత నివాసి ప్రముఖ అంబేద్కర్ వాది, ప్రజల కోసం నిరంతరం కష్టపడే యువ నాయకుడు కే.వరప్రసాద్ (43) మృతి చెందారు. గురువారం నిమ్స్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడని వైద్యులు తెలిపారు. ఆయన గత 15 రోజుల నుంచి లంగ్స్ ఇన్ఫెక్షన్ తో బాధపడుతూ హార్ట్ ఎటాక్ వల్ల చనిపోయారు. శుక్రవారం ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట స్మశాన వాటిక వరకు అంతిమయాత్ర కొనసాగుతూ అంత్యక్రియలు పంజాగుట్ట స్మశాన వాటికలో జరుగుతాయని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

గణేష్ శోభయాత్రలో ఓటరు నమోదుపై అవగాహన

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

గణేష్ శోభయాత్రలోనూ జీహెచ్ఎంసీ అధికారులు ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గురువారం గణేష్ నిమజ్జం కొనసాగుతుండగా నగర వాసులకు ఓటరు నమోదుకు, ఓటరు జాబితాలో పేరును చెక్ చేసుకోవడం, ఓటు లేని వారు తిరిగి నమోదు ఎలా చేసుకోవాలో అవగాహన కల్పించారు. ఎన్.టీ.ఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డులో అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. ఓటరు జాబితాలో మీ పేరు ఉందో లేదో చెక్ చేసుకోవడానికి పోస్టర్లు, కరపత్రాల స్టాండిస్‌ల ద్వారా ప్రధాన కూడాలిలో కంట్రోల్ రూంల ద్వారా ప్రచారం చేశారు. గణే శోభ యాత్ర నిమజ్జన ప్రాంతాల్లో పాండ్స్, చెరువుల వద్ద ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్ల సహకారంతో అవగాహన ప్రచార కార్యక్రమాన్ని చేపట్టినట్లు కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. స్వీప్ నోడల్ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్ నేతత్వంలో నియోజకవర్గ సహాయ స్వీప్ నోడల్ అధికారులు వాలింటరీల సహకారంతో విస్తతమైన ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో పాటు టోపీ ధరించి ప్రచారం చేశారని అందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. నగర వాసులు తమ ఓటు ఓటరు జాబితాలో ఉందో లేదో రీ చెక్ చేసుకోవాలన్నారు. అందుకు ఓటర్ హెల్ప్ లైన్ యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఈసీఐ వెబ్ సైట్ ద్వారా తిరిగి నమోదు చేసుకోవచ్చునని అన్నారు. ఓటరు జాబితా పరిశీలనలో పేరు లో స్పెల్లింగ్ మిస్టేక్ అడ్రస్, ఇంటి నంబర్ మిస్టేక్, కుటుంబ సభ్యుల పేరు అదే నియోజకవర్గంలో వేర్వేరు పోలింగ్ స్టేషన్‌లో ఉన్నగాని, కుటుంబ సభ్యుల రిలేషన్ తప్పుగా ఉన్న సక్రమంగా ఫోటో లేకున్నా, మిస్ మ్యాచ్ ఫొటో ఉన్నచో వెంటనే ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మొబైల్ నంబర్ అప్ డేట్ చేసుకోవచ్చునని కమిషనర్ ప్రజలను కోరారు.



నందికంటికి టికెట్ ఇవ్వకపోతే కాంగ్రెస్‌కి రాజీనామా చేస్తాం



- అల్వాల్ సర్కిల్ అధ్యక్షుడు నిమ్మ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

నందికంటి శ్రీధర్‌కి టికెట్ ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేస్తామని అల్వాల్ సర్కిల్ అధ్యక్షులు నిమ్మ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ...కాంగ్రెస్ కార్యకర్తల మనోభావా లను పరిగణనలోకి తీసుకొని ఎట్టి పరిస్థితు ల్లోనూ మల్కాజిగిరి టికెట్ నందికంటి శ్రీధర్ కే ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేశారు. పారాచ్యుట్‌లో దిగిన వారికి ఇస్తాం అంటే ఊరుకోబోమని హెచ్చరించారు. బడుగు బలహీన వర్గాలకే టికెట్ కేటాయించాలని కోరారు. పార్టీ ని బలోపేతం చేయడానికి మ ఎంత మందినైనా, ఎవరినైనా తీసుకోండి కానీ పార్టీ కోసం పని చేసిన వారికి అన్యాయం చేయకండని సూచించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నందికంటి కి టిక్కెట్ ఇస్తానని ఇది వరకే మాట ఇచ్చారని ఆయన తెలిపారు. ఆయన మాట ఎలా తప్పుతారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో అల్వాల్ సర్కిల్ సీనియర్ నాయకులు చంద్ర శేఖర్, సిఎల్ యాదగిరి, గోళి రమేష్, డివిజన్ అధ్యక్షు డు సూర్య ప్రకాష్ రెడ్డి, పాల్గొన్నారు.

భక్తులకు ఉచితంగా తాగునీటి వసతి ఏర్పాటు

- జలమండలి ఎండీ దానకిశోర్
- జలమండలి తాగునీటి శిబిరాలు తనిఖీ చేసిన ఎండీ దానకిశోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏటా వినాయక నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఉచితంగా తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా జలమండలి ఏర్పాటు చేసిన తాగు నీటి శిబిరాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో ఉన్న శిబిరాలకు వెళ్లిన ఆయన అక్కడి ఏర్పాట్లు పరిశీలించారు. నీటి నాణ్యత, క్లోరిన్ పరీక్షల వివరాలు అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ భక్తుల రద్దీని బట్టి అవసరమైతే మరింత తాగునీరు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. క్లోరిన్ లెవెల్స్ ఎప్పటికప్పుడు పరీక్షించాలని అధికారుల్ని ఆదేశించారు. శోభాయాత్ర, ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో ఎక్కడా నీటి లీకేజీలు, సీవరెజి ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నిర్వహణ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.వాటర్‌బోర్డు ప్రత్యేక తాగునీటి శిబిరాల ఏర్పాటు నిమజ్జనానికి వచ్చే భక్తుల కోసం జలమండలి అధికారులు 122 ప్రత్యేక తాగునీటి శిబిరాలను ఏర్పాటు చేశారు. 24 గంటలూ సేవలందించేందుకు 3 షిఫ్టుల్లో సిబ్బందిని నియమించింది. ట్యాంక్ బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లో రెండు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. మంచినీటి శిబిరాల నిర్వహణ, పర్యవేక్షణ, ఇతర సమస్యలు పరిష్కారానికి నోడల్ అధికారుల్ని సైతం నియమించింది. తాగునీటి శిబిరాలను ఏర్పాటు చేయడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎండీ దాన కిశోర్, జలమండలి అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా హార్ట్ డే
అతిపెద్ద కార్డియాక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అపోలో వేడుక

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశంలో అతిపెద్ద కార్డియాక్ కేర్ ప్రోగ్రామ్‌గా ప్రపంచంలోని ప్రముఖ కార్డియాక్ ప్రోగ్రామ్‌లలో ఒకటిగా నిలిచిన అపోలో ఆస్పత్రిలో 'వరల్డ్ హార్ట్ డే'ను ఘనంగా నిర్వహించారు. అపోలో క్లినికల్ ఎక్సలెన్స్‌లో 300,000కంటే ఎక్కువ మంది యాంజియోప్లాస్టీలు, 200,000 కార్డియాక్ సర్జరీలు కార్డియాక్ కేర్ సేవలను అందిస్తున్నారని గురువారం అపోలో ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సీ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అత్యాధునిక సౌక ర్యాలు, అసాధారణమైన వైద్య బందం, అద్భుతమైన సాంకేతికతలకు నిదర్శనంగా నిలిచిందన్నారు. భారతదేశంలో మొదటి కార్పొరేట్ హాస్పిటల్ గ్రూప్ అపోలోలో 375కుపైగా కన్సల్టెంట్‌లతో 38 ఆసుపత్రులతో 10వేల పడకలతో విస్తరించిందన్నారు. సరసమైన ధరలతో అత్యాధునికి చికిత్సను అందిస్తున్నామని తెలిపారు. కరోనరీ ఆర్టరీ డిసీజ్, స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్, పుట్టుకతో వచ్చే హార్ట్ కండిషన్స్, హార్ట్ ఫెయిల్యూర్‌లకు అపోలోలోని క్లినికల్ సేవలందిస్తోందన్నారు. రోబోట్ అసిస్టెడ్ సర్జరీ నుండి టెక్నాలజీ-ఇంటెన్సివ్ కాంప్లెక్స్ ట్రాన్స్ కాథెటర్ థెరపీలు మొదలుకొని ట్రాన్స్ ప్లాంట్ సేవలు, క్రిటికల్ కేర్, పోస్ట్-ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేస్తున్నామన్నారు. ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల నుంచి రోగులు వచ్చి చికిత్సలు పొందుతున్నారని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలో కూడిన చికిత్సను అందిస్తున్నామన్నారు. అపోలో విజయానికి ప్రధాన కారణం ప్రపంచ ప్రఖ్యాత కార్డియాల జిస్టులు, కార్డియాక్ సర్జన్లు, అనస్థీటిస్టులు, ఫిజిషియన్‌లు, నర్సులు, టెక్నీషియన్‌లు, జాయింట్ హార్ట్ టీమ్‌గా కలిసికట్టుగా పనిచేస్తారని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద రోబోటిక్ కార్డియాక్ సర్జరీ ప్రోగ్రామ్‌ను కలిగి ఉందని తెలిపారు.

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేని గెలిపించుకుంటాం

- బాలయ్య నగర్ కాలనీ వాసులు ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రానున్న ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను భారీ మెజార్టీతో హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని బాలయ్య నగర్ కాలనీవాసులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు గురువారం బాలయ్య నగర్ కాలనీలో ఏర్పాటుచేసిన సన్మాన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్ కాలనీని గతంలో ఏ నాయకుడు పట్టించుకోలేదన్నారు. మా బాలయ్య నగర్ బస్తీని ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అభివృద్ధి చేసినందుకు గాను వాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అడిగిన వెంటనే తమ కాలనీలో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధికి సహకరిస్తా అని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హులైన కానీవాసులకు అందించడానికి కృషి చేస్తానాని భరోసా ఇచ్చారు. తమ కాలనీ నుండి సంపూర్తి మద్దతు తెలియజేస్తూ కలిసికట్టుగా పనిచేసి ముచ్చటగా మూడవసారి అత్యధిక భారీ మెజారిటీ తో గెలిపించుకుంటామని మా కాలనీ అభివృద్ధిని కొనసాగించుకుంటామని కాలనీవాసులు వాసులు ఎమ్మెల్యే ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రషీద్ బేగ్, అడ్వకేట్ కమలాకర్, కస్తూరి బాలరాజు,నవాబ్, శ్రీనివాస్ యాదవ్, బాలయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ. నగేష్, వైస్ ప్రెసిడెంట్ టి. రవీందర్ రావు, సాయిలు, జనరల్ ప్రధాన కార్యదర్శి పార్వతి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఉత్సాహభరితంగా బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ 11వ వార్షికోత్సవం...



నవతెలంగాణ-బంజారాహిల్స్

హైదరాబాద్ రీజియన్‌లో అతిపెద్ద బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ 11వ వార్షికోత్సవాన్ని చీర్ ఫుల్, స్నేహపూర్వక వాతావరణంలో ఈ చార్టర్‌లో 124 మంది సభ్యులతో బంజారా హిల్స్ పార్క్ హయత్ హొటల్లో గురువారం 147 మంది సందర్శకులతో 189 బిజినెస్ రిఫరల్స్ చేంజ్ చేసుకొని వార్షికోత్సవాన్ని ఉత్సాహ భరితంగా ఘనంగా నిర్వహించారు. బీఎన్ఐ హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా, బీఎన్ఐ హైదరాబాద్ ఏరియా డైరెక్టర్ టీ సతీష్ కుమార్, బీఎన్ఐ క్యాపిటల్ అధ్యక్షుడు సందీప్ జైన్, బీఎన్ఐ క్యాపిటల్ వైస్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, బీఎన్ఐ క్యాపిటల్ కార్యదర్శి కోశాధికారి డాక్టర్ వేణుగోపాల్ వీరమనేని తదితరులు ఈ చిరస్మరణీయ ఈవెంట్ కు హాజరయ్యారు. ఈ సందర్భంగా గత పదకొండు సంవత్సరాలుగా పనిచేసిన మాజీ హెడ్ టేబుల్ సభ్యులు, సహాయ డైరెక్టర్లను సత్కరించారు. బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ సభ్యుల అసాధారణ పనితీరుకు గుర్తింపు లభించింది. ప్రాంతీయ అవార్డులతో సత్కరించారు. ఈ చాప్టర్ రీజనల్ అవార్డులను గెలుచుకుంది. ట్రాఫిక్ లైట్లలో అతిపెద్ద అధ్యాయం, అత్యధిక సందర్శకులను ఆహ్వానించినందుకు గాను ఈ అవార్డులు దక్కాయి. బీఎన్ఐ క్యాపిటల్ చాప్టర్ అక్టోబరు 2021 నుంచి మార్చి, 2022 అక్టోబర్ 2022 నుంచి మార్చి, 2023 వరకు ఉత్తమ హెడ్ టేబుల్ అవార్డులను గెలుచుకుంది. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ 2022 మధ్యకాలంలో ఉత్తమ అధ్యక్షుడిగా ప్రణయ్ జైన్‌కు అత్యుత్తమ ప్రాంతీయ వ్యక్తిగత ప్రదర్శన అవార్డులు దక్కించుకున్నారు. 2022 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఉత్తమ వైస్ ప్రెసిడెంట్ అవార్డు పూజా పాత్రేచాకు దక్కింది. అత్యధిక సంఖ్యలో సందర్శకులను తీసుకువచ్చినందుకు, మెంబర్ ట్రాఫిక్ లైట్‌లలో మొదటి స్థానంలో ఉన్నందుకు డాక్టర్ వేణుగోపాల్ రావు వీరమనేనికి అవార్డు లభించింది. బెస్ట్ డైరెక్టర్ కన్సల్టెంట్ అవార్డు శ్రీనివాసులు కేఎం, బెస్ట్ ట్రైనర్ అవార్డు రాజా పంతం, బెస్ట్ అసిస్టెంట్ ఏరియా డైరెక్టర్ అవార్డు సతీష్ కుమార్‌కి లభించాయి. బీఎన్ఐ క్వీన్స్ అధ్యాయాన్ని ప్రారంభించినందుకు అలీ అస్గర్‌కు అవార్డును అందించారు. బీఎన్ఐ ఆర్కా, బీఎన్ఐ ఆయుష్ అధ్యాయాలను ప్రారంభించినందుకు డాక్టర్ వేణుగోపాలరావు వీరమనేని, బీఎన్ఐ ఆయుష్ అధ్యాయాన్ని ప్రారంభించినందుకు కెనిషా సబ్నాని అవార్డులు దక్కాయి. అతిపెద్ద ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ గోనాట్ కోసం ఫొటోగ్రఫీ భాగస్వాములు, ఉత్తమ స్టాల్ కోసం సందీప్ జైన్, రాహుల్ సంచేతికి అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా వీరందరిని సత్కరించారు. బీఎన్ఐ క్యాపిటల్ గత ఆరు నెలల్లో ఇండక్షన్‌లలో పెరుగుదలను చూసింది. దీంతో అప్లికేషన్ రివ్యూ కోఆర్డినేటర్ నిషిత్ షాకు ప్రశంసలు దక్కాయనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజనా షా తెలిపారు.

7 లక్షల ఒక వేయి పలికిన వినాయక భక్త బృందం లడ్డు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి వినాయక భక్త బృందం యొక్క, గణేష్ నిమర్జనం కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లిలోని పురవీధుల్లో గణేష్ నిమర్జనం ఊరేగింపు ఘనంగా నిర్వహిచారు. గణేష్ నిమర్జన కమిటీ చైర్మెన్ నాయినేని సూర్యప్రకాష్ రావు ఆధ్వర్యంలో ,కమిటీ అధ్యక్షులు చౌదరి నర్సింగ్ రావు పర్యవేక్షణలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినటువంటి జాగ్రత్తలు తీసుకున్నారు. నిమర్జనం కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి పాత శివాలయ కమిటీ వారు, అలాగే రామాలయం కమిటీ వారు, కూకట్‌పల్లి శ్రీ దాసాంజనేయ స్వామి బజరంగ్ యువ సేన వారు నిమర్జనానికి బయలుదేరినటువంటి కూకట్‌పల్లి వినాయక భక్త బృందం విఘ్నేశ్వరునికి ఘన స్వాగతం పలికారు. ఆ విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో ప్రశాంత్ నగర్ నివాసి అయినటువంటి శంకర్ చౌదరి విగ్నేశ్వరుని యొక్క మహా ప్రసాదమైనటువంటి లడ్డును ఏడు లక్షల ఒక వెయ్యి రూపాయలకు సొంతం చేసుకున్నారు. అనంతరం లడ్డు దక్కించుకున్నటువంటి భక్తుడు శంకర్ చౌదరి మాట్లాడుతూ నేను వేలంలో లడ్డును దక్కించుకోవడం చాలా సంతోషంగా ఉందంటూ, దేశ రక్షణకై ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశాన్ని పరిపాలించడానికి మళ్లీ అధికారంలోకి రావాలని దృఢ సంకల్పం , ఆ విఘ్నేశ్వరుని యొక్క దయ ఉండాలంటూ ఈ యొక్క లడ్డును వేలంలో దక్కించుకోవడం జరిగిందని శంకర్ చౌదరి తెలియజేశారు. అలాగే సమస్త ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ యొక్క నిమర్జనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, కూకట్ పల్లి వినాయక భక్త బృందం కన్వీనర్ అర్చనపల్లి సూర్యారావు, ప్రధాన కార్యదర్శి పాపరావు, పద్మయ, వడ్డపల్లి శ్రీనివాస్ , కోశాధికారి చౌదరి సూర్యారావు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక మన తెలంగాణ

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఈద్ ఏ మిలాద్ ఉన్ నబీ.. ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే పండుగ కావడంతో అదే రోజు గణేష్ నిమజ్జన మహోత్సవం రావడం వల్ల ముస్లిం సోదరులు ఎంతో పెద్ద మనసు చేసుకొని, అక్టోబర్ 1వ తేదీ ఆదివారం నాడు జరుపుకోవడానికి నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకరమైన విషయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే తెలంగాణ నేడు ఇంత సుభిక్షంగా ఉండడానికి అందరం కలిసి మెలిసి ఉండడం వల్లే సాధ్యమైందని.. హిందూ ముస్లిం అనే భేదం లేకుండా అన్నదమ్ముల వలె ఒక సుహృద్భావ వాతావరణంలో మనం జీవిస్తున్నామంటే మన రాష్ట్రాన్ని నడిపే నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ వల్లే సాధ్యమైందని అన్నారు. ఈ విషయంలో తాను ఎంతో సంతోషపడ్డానని.. హిందూ సోదరులకు గణేష్ నిమజ్జోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ అలాగే ముస్లిం సోదరులకు మిలాద్ ఏ ఉన్ నబి శుభాకాంక్షలు తెలిపారు.

ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన ఉత్సవాన్ని స్థానిక కార్పొరేటర్ పరిశీలించి ప్రశాంతంగా జరిగే విధంగా చొరవ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్





నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
హైదరాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 29, 2023 | www.navatelangana.com



వైభవంగా వినాయక నిమజ్జనోత్సవం



గ్రేటర్ హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. నవరాత్రులు పూజలం దుకున్న గణనాధుల విగ్రహాలను భక్తుల నీరాజనాల మధ్య నిమజ్జనాలు చేశారు. నగరంలో గురువారం ఉదయం నుంచే ప్రారంభమైన నిమజ్జన సందడి శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. నిమజ్జనం సందర్భంగా సెలవు కావడంతో తరలివచ్చిన భారీ భక్త జనసందోహంతో రహదారులు పోటె త్తాయి. ట్యాంక్ బండ్ నెక్లెస్ రోడ్ ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. ట్యాంక్‌బండ్‌పైన అడుగడుగున ఆనందోత్సహాలు వెల్లువెత్తాయి. గణపతి బప్పా మోరియా, జై బోలో గణపతి మహారాజ్‌కి అంటూ భక్తజనులు చేసిన నినాదాలతో ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ పరిసరాలు హోరెత్తాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వైవిధ్యభరితమైన గణపతి విగ్రహాలతో పాటు ఖైరతాబాద్ శ్రీ దశ మహా విద్యాగణపతి శోభాయాత్ర, నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా జరిగాయి.

- కన్నుల పండువగా గణనాధుడి శోభాయాత్ర
- గణపతి బప్పమోరియా నినాదాలతో హోరెత్తిన నగరం
- వేలాది మందితో జనసంద్రమైన సాగరతీరం
- వర్షాన్ని లెక్కచేయకుండా తరలివచ్చిన జనం
- ప్రశాంతంగా ముగిసిన వినాయక నిమజ్జనం





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరం నలువైపులా నుంచి తరలివచ్చిన గణనాధులు, భక్తుల నినాదాలు, నృత్యాలు, భాజాభజంత్రీలతో మహానగరం అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అర్ధరాత్రి తర్వాత కూడా నిమజ్జన వేడుకలను తిలకించేందుకు సందర్శకులు, ప్రజలు పెద్దఎత్తున ట్యాంక్‌బండ్‌కు చేరుకున్నారు. నగరమంతటా ఏర్పాటు చేసిన స్వాగత వేదికలు వినాయక మండపాలు సాదర స్వాగతం పలికాయి. రకరకాల ఆకృతులలో అందంగా ముస్తాబైన మూషిక వాహనుడిని కీర్తిస్తూ.. భజనలు కోలాటాలు, డీజేల హోరు, బ్యాండు భాజాల జోరుతో నిమజ్జన వేడుకలు అంబరాన్ని తాకాయి

మధ్యాహ్నమే గంగ ఒడికి మహాగణపతి

ఖైరతాబాద్ శ్రీ దశ మహా విద్యాగణపతి గురువారం మధ్యాహ్నం తర్వాత హుస్సేన్ సాగర్ వద్ద గంగ ఒడికి చేరాడు. ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నెం.4 వద్ద మధ్యాహ్నం 1.30గంటలకు ఖైరతాబాద్ గణేశుడిని నిమజ్జనం చేశారు. ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల పెద్ద ఎత్తున గణనాథుల మండల నిర్వాహకులు భారీ ఎత్తున డీజే పాటలతో ఉర్రూతలూగించిన నృత్యాలతో భక్తులను అలరించారు. బాలాపూర్ ఓల్డ్ సిటీ, చార్మినార్ ప్రాంతాల నుంచి శోభయాత్ర ట్యాంకు బండ్ వరకు కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో కొద్దిపాటి వర్షానికి కొద్దిగా ఇబ్బంది పడ్డ గణేశ్ శోభాయాత్ర కొనసాగింది.

ప్రయాణికులతో మెట్రో స్టేషన్లు కిటకిట

గణేష్ నిమజ్జన వేడుకలను తిలకించేందుకు నగరవాసులు పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెట్రో అధికారులు ప్రతి మూడు నుంచి ఐదు నిమిషాలకో రైలు చొప్పున నడిపారు. ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం మూడు మెట్రో రూట్లోలో రద్దీ కనిపించింది. చివరి రైలు టర్మినల్ స్టేషన్ల నుంచి అర్ధరాత్రి ఒంటిగంటకు బయలుదేరి 2గంటలకు చివరి గమ్యస్థానం చేరుకున్నాయి. ఉదయం, రాత్రి వేళ్లలో మూడు కారిడార్లలో మెట్రో స్టేషన్లు ప్రయాణికుల రద్దీతో కిటకిట లాడాయి. నిమజ్జనానికి రెండు రోజులు ముందు ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్లలో రద్దీ కనపించినట్టు మెట్రో అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం 6గంటలకు మెట్రో సేవలు యధావిధిగా అందుబాటులో ఉంటాయని వివరించారు.

నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేశాం: మంత్రి తలసాని శ్రీనివాస్ యాద్

తెలంగాణ ప్రభుత్వం పండుగలు, ఉత్సవాల విశిష్టతను మరింత పెంపొందించే విధంగా ఏర్పాట్లను చేస్తూ ఘనంగా నిర్వహిస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ఆయన నగరంలోని పలు ప్రాంతాలలో పర్యటించి శోభాయాత్రను, నిమజ్జనాన్ని పరిశీలిం చారు. ముందుగా ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం చార్మినార్, మోజం జాహి మార్కెట్, ఆబిడ్స్, లిబర్టీ, తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌ల వద్ద శోభాయాత్రగా వస్తున్న విగ్రహాలను స్వాగతం పలికారు. తదనంతరం హుస్సేన్ సాగర్‌లో బోట్‌లో తిరుగుతూ నిమజనాన్ని పర్యవేక్షించారు. అదేవిధంగా మధ్యాహ్నం బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్‌లో హోంమంత్రి మహమూద్ అలీ, డీజీపీ అంజనీ కుమార్, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్‌లతో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా నగరంలో గణేష్ విగ్రహాల శోభాయాత్ర, హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జనాలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నిర్వహించే గణేష్ ఉత్సవాలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గణేష్ శోభాయాత్ర, నిమజ్జనాల సందర్భంగా వచ్చే లక్షలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఆదేశాల మేరకు ప్రభుత్వం వివిధ శాఖల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసిందని చెప్పారు. ఈ సంవత్సరం నగరంలోని వివిధ ప్రాంతాలలో సుమారు 90 వేల విగ్రహాలను ఏర్పాటు చేశారని, శుక్రవారం ఉదయం వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. దేశం మొత్తం ఎంతో ఆసక్తిగా వీక్షించే 63 అడుగుల ఎత్తు గల ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం మధ్యాహ్నం వరకే పూర్తయిందని, భక్తుల అభీష్టం మేరకు ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసిందని వివరించారు. ఎంతో ఉత్సాహంగా భక్తులు విగ్రహాలను నిమజ్జన శోభాయాత్రను నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీసు, టూరిజం, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్, హెల్త్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారని వివరించారు. నగరానికి చెందిన పోలీసు అధికారులు, సిబ్బందే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా తీసుకొచ్చి బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అంతేకాకుండా ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో, గొప్పగా నిర్వహించే విధంగా ప్రభుత్వ పరంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని చెప్పారు.











భగత్ సింగ్ స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమిస్తాం



- ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్య, వైద్యం, ఉపాధి హక్కుల సాధనకు ఉద్యమిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ అన్నారు.భగత్ సింగ్ 116వ జయంతిని పురస్కరించుకుని గురువారం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ముష్కరులను అంతమొందించిన అగ్రగణ్యులలో భగత్ సింగ్ ప్రథముడన్నారు. అటు వంటి భగత్ సింగ్ ఆశయాలు, స్ఫూర్తిని దేశ యువతకు తెలియపరచకుండా నేటి పాలకులు కుయుక్తులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.భగత్ సింగ్ కలలుగన్న అవినీతి లేని నూతన సమ సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.భగత్ సింగ్ జీవితం భారతదేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అలాంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలుపవలసిన బాధ్యత పాలకులదేనని ఉద్ఘాటించారు.భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు.భగత్ సింగ్ స్ఫూర్తితో పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిం చాలన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందని, పరీక్షల పేరిట నయవంచన చేస్తుందని, ఒకవైపు ఉపాధి కల్పిస్తామని హామీ ఇస్తూనే, మరోవైపు పోటీ పరీక్షల నిర్వహణలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు.బీఆర్ఎస్ కు ఇవే చివరి ఎన్నికలని హె చ్చరించారు.ఏఐవైఎఫ్ నగర ఆఫీస్ బేరర్స్ షబ్బీర్, అలీఖాన్, వసిముల్లా ఖాన్, జగన్, కీర్తన్ పాల్గొన్నారు.

డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మృతిపట్ల జేటీసీ సంతాపం



నవతెలంగాణ-సిటీబ్యూరో

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మృతి పట్ల హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. దేశం క్లిష్ట సమయంలో ఉన్నప్పుడు.. వ్యవసాయంలో ఆయన చేసిన సంచలనాత్మక కృషి లక్షలాది మంది జీవితాలను మార్చివేసిందని ఆయన కొనియాడారు. వినోబా భావే ఆశయానికి స్వామినాథన్ కుటుంబం 700 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చిందని, మహాత్మాగాంధీ, రమణ మహర్షి, స్వామి వివేకానందల ప్రభావం తనపై ఉందని పలు సందర్భాల్లో ఆయన చెప్పారని గుర్తుచేశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, రామన్ మెగాసెస్ లాంటి ఎన్నో దేశ పురస్కారాలతో పాటు ప్రపంచంలోని వివిధ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా 84డాక్టరేట్‌లు అందుకు న్నారని జేటీసీ తెలిపారు. అంతేగాక న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరి యంలో బుధవారం స్వామినాథన్ సంతాప సభ నిర్వహిం చారు. ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో తాను 1984లో ఎంఎస్సీ అగ్రికల్చర్ చదివానని ఈ సందర్భంగా జేటీసీ పాండురంగ నాయక్ గుర్తుచేసుకున్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిండి సుధాకర్

నవతెలంగాణ - ముషీరాబాద్

భగత్ సింగ్ స్ఫూర్తితో యావత్ యువత ముందుకు సాగాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ దిండి సుధాకర్ అన్నారు. గురువారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో దోమలగూడ ఏవి కాలేజ్ వద్ద భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దిండి సుధాకర్ మాట్లాడుతూ. యువత భగత్ సింగ్ ఆశయాలను ముం దుకు తీసుకెళ్లాలన్నారు. 'యవ్వన ప్రాయంలో ఉరికొ య్యను ముద్దాడిన ఆ యోధుడు భరత జాతికి అందించిన చైతన్యం అమూల్యమైనది. భగత్‌సింగ్ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ స్ఫూర్తి పొందాలి. ఆయన ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు పాటుపడాలి' అని కోరారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యులు కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, మహమ్మద్ మజీద్, ముషీరాబాద్ ఇన్‌చార్జి రాకేష్ సింగ్ ఠాకూర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు పరీక్షిన్ ,జావేద్, కొడంగల్ శ్రీనివాస్. తదితర నాయకులు పాల్గొన్నారు



అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించాం

- నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మహానగరంలో వినాయక నిమజ్జనోత్సవం ప్రశాంతంగా కొనసాగిందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం పేర్కొన్నారు. నగరంలో 25వేలకుపైగా సిబ్బందితో భారీ భద్రతను ఏర్పాటు చేశామన్నారు. సీసీకెమెరాలతోపాటు, అత్యాధునికి టెక్నాలజీని ఉపయోగిచడంతోనే నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో తెల్లారేవరకు కొనసాగిందన్నారు. నిమజ్జనంలో జీహెచ్ఎంసీ, రవాణా, హెచ్ఎండీఏ, వాటర్‌వర్క్స్, మండపాల నిర్వాహకులు, వాలెంటరీలు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులతోపాటు అన్ని వర్గాల వారు పోలీసులకు సహకరించారన్నారు.



అంబర్ పేట పటేల్ నగర్ లోని స్ఫూర్తి యంగ్ మెన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు సందర్భంగా శోభాయాత్రలో లడ్డూ వేలం 52 వేల రూపాయలు పలికింది . ఈ కార్యక్రమంలో రాజు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్ పేట

భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు ఉద్యమించాలి



- ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్
- ఘనంగా భగత్ సింగ్ 116వ జయంతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

భగత్ సింగ్ స్ఫూర్తితో సమాజంలో జరుగుతున్న దోపిడిపై విద్యార్థులు ఉద్యమించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా పిలుపునిచ్చారు. గురువారం ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో కాచిగూడ నింబోలి అడ్డ బీసీ హాస్టల్‌లో భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ కీలక పాత్ర పోషించాడని, అతిచిన్నవయసులోని ఉరి కొయ్యని ముద్దాడిన విప్లవ వీర కిశోరం అని తెలిపారు. ఢిల్లీ వీధుల్లో ఎర్ర కాగితాలు చల్లి ప్రజలను చైతన్యం పరిచి.. విప్లవం వర్ధిల్లాలి అని నినదించాడని గుర్తుచేశారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి విద్యార్థి మరో భగత్‌సింగ్‌ల ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు స్టాలిన్, నగర సహాయ కార్యదర్శి ప్రశాంత్, నాయకులు నరసింహ, వికాస్, సాయి ఆకాష్, అరుణ్, సాయికిరణ్, శ్రీరామ్, అభినయ్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పడి జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికురాలి మృతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో కురిసిన భారీ వర్షానికి ఓ మహిళా రైల్వేబ్రిడ్జి దాటే క్రమంలో నాలాలో కొట్టుకొనిపోయి మృతి చెందింది. గురువారం స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు జీహెచ్ఎంసీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోన్న మహిళ సికింద్రాబాద్ మెట్టుగూడ దూద్ బావి వద్ద నాలాలో పడి గల్లంతైంది. సాయంత్రం ఒక్కసారిగా వర్షం దంచికొట్టడంతో మెట్టుగూడ సమీపంలోని రైల్వే బ్రిడ్జి కింద నుంచి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు నాలాలో పడిపో యింది. నాలా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అందులో కొట్టుకుపోయింది. సికింద్రాబాద్ అంబర్ నగర్ సమీపం లోని నాలాలో విగతజీవిగా తేలింది. నాలాలో పడిన వెంటనే ఆమెను రక్షించేందుకు స్థానికులు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది నాలా నుంచి మృతదేహాన్ని వెలికితీసి గాంధీ ఆస్పత్రి మార్చూరీకి తరలించారు. కేసు నమోదు చేకున్న పోలీసులు అన్నికోణాలో దర్యాప్తు ప్రారంభించారు. మహిళ వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆరా తీస్తున్నారు. సుమారు 50సంవత్సరాలుంటాయని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

దంచికొట్టిన వర్షం

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. ముషీరాబాద్, చిక్కడపల్లి, దోమలగూడ, కవాడిగూడ, భోలక్‌పూర్, గాంధీనగర్, రాంనగర్, అడిక్‌మెట్, అడ్డగుట్ట, మారేడ్‌పల్లి, సీతాఫల్‌మండి, బోయినపల్లి, ప్రకాశ్‌నగర్, రాణిగంజ్, ప్యారడైజ్, ఉప్పల్, మలక్‌పేట, అంబర్‌పేట, యూఓ క్యాంపస్‌తో పాటు పలు ప్రాంతాల్లో వర్షం పడింది. ఒక్కసారిగా కురిసిన వర్షంతో వాహనదారులకు ఇబ్బందులకు గురయ్యారు.

ముక్తార్ పాషా లేని లోటు కార్మిక వర్గానికి పూడ్చలేనిది

- ఐఎఫ్‌టీయూ జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు



నవతెలంగాణ-ముషీరాబాద్

కామ్రేడ్ ఎస్ కే ముక్తార్ పాషా లేని లోటు కార్మిక వర్గానికి పూడ్చలేనిదని ఐఎఫ్ టీ యు జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. ఇఫ్టూ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా నాయకురాలు అనురాధ అధ్యక్షతన కా.పాష మూడో వర్ధంతి సభ విద్యానగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఫ్ టీ యు జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వరరావు, సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్ హాజరై ఎస్.కె ముక్తార్ పాషా కు నివాళు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కామ్రేడ్ ముఖ్తార్ పాష మారుమూల అటవీ ప్రాంతమైన గుండాలలో జన్మించి ఇల్లందులో హమాలీ కార్మికులతో మమైకమై ఉద్యమ అక్షరజ్ఞానం నేర్చుకొని దేశవ్యాప్తంగా కార్మిక వర్గానికి దశాదిశను చూపించే అగ్రస్థాయి నాయకుడిగా,జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగాడని తెలిపారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో సంఘాల నిర్మాణంలో కీలక భూమిక పోషించాడని, కార్మికవర్గంలో నిరంతరం కష్టపడి పనిచేసే వాడని కార్మికవర్గ పక్షపాతిగా నిస్వార్ధంగా పనిచేసేవాడని అన్నారు. కె గోవర్ధన్ సీపీఐ (ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాట్లాడుతూ కామ్రేడ్ పాషలోని నీతి,నిజాయితీ,నిబద్ధత కష్టపడి పనిచేసే మనస్తత్వాన్ని,గుండె దిటువను కార్మిక నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కామ్రేడ్ పాషకు విప్లవ జోహార్లు అర్పిస్తూ ఆయన లేని లోటు కార్మిక వర్గానికి పూడ్చలేనిదని ఆయన అందించిన ఆశయాల జెండాను ముందుకు తీసుకెళ్లేం దుకు ప్రతి ఒక్కరు పూనుకోవాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శివబాబు, నాయకులు, రాము, యాదయ్య, రాంరెడ్డి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పరశురాం, నాయకులు రియాజ్, గణేష్, నాగరాజు, నవీన్, శ్యామ్, పి ఓ డబ్ల్యు నాయకులు సరళ, భారతి, రేణుక, తదితరులు పాల్గొన్నారు

కన్నుల పండుగగా వినాయక శోభాయాత్ర



- కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

కేంద్ర ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందని కేంద్ర గ్రామీణ అభివద్ది శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి అన్నారు. గురువారం మోజంజాహి మార్కెట్ చౌరస్తా వద్ద భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ భాగ్య నగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్య దర్శి భగవంత్ రావు, ఉపాధ్యక్షులు ఎం రామరాజులు వినాయకులకు స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి మాట్లాడుతూ దేశంలో హిందూ ఐక్యతను చాటే విధంగా సామూహిక వినాయక శోభా యాత్ర ఆధ్యాత్మిక కన్నుల పండుగగా కొనసాగుతుంది అన్నారు. కొత్త పార్లమెంటులో ప్రవేశ పెట్టిన మహిళ బిల్లు విజయం పొందడం చారిత్రాత్మక విజయమని అన్నారు.ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మాట్లాడుతూ భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేలాది మంది గణేష్ మండప నిర్వాహకులు మూర్తులను వాహనాల పైన ప్రత్యేకంగా పూలతో అలంకరించి సాగర తీరానికి బారులు తీరడం సంతోషకరమని అన్నారు. శోభాయాత్రకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

అది ప్యారిస్‌లో ఓ హ్యాండ్‌లూమ్ ఎగ్జిబిషన్. ఒక అమ్మాయి వస్త్రాలను చూసి మంత్ర ముగ్ధురాలయ్యింది. ఆ వస్త్ర ప్రేమికురాలు ఉద్వేగానికి లోనవుతూ 'ఒక్కసారి వీటిని తాకవచ్చా' అంటూ వినమ్రంగా అడిగింది. "ఓహ్! తాకవచ్చు. అంతేకాదు కొనుక్కొని కట్టుకోవచ్చు కూడా!' అన్నది షాపు(స్టాల్) ఓనర్. ఆ అమ్మాయి వస్త్రాన్ని తడిమిచూసి ఏడ్చేసింది. ఎందుకని అడిగితే 'మజ్లిన్ (మల్ మల్) చేనేత గొప్పతనం గూర్చి పుస్తకాల్లో చదవడమే కానీ, ఇలా ప్రత్యక్షంగా చూసింది లేదు. చూడాలన్న కోరిక ఉన్నా ఇంతవరకు నెరవేరనేలేదు. ఇప్పుడు ఈ వస్త్రాల మృదుత్వాన్ని చూస్తుంటే ఏదో తెలియని అనుభూతి, ఆనందం కలుగుతున్నాయి' అని చెప్పింది. ఒక కళాకారిణికి ఇంతకన్నా తృప్తి ఇంకేముంటుంది? అంటున్నారు LabelRama సంస్థ వ్యవస్థాపకురాలు **రాజేశ్వరి రామా.** అసలు ఈ సంస్థ ఏమిటో? దీని ప్రత్యేకత ఏమిటో వారి మాటల్లోనే తెలుసుకుందాం.

విదేశీ వస్త్ర ప్రపంచంలో చేనేత ఢంకా



చేనేత ఒక కళాత్మక ప్రక్రియ... చేనేత ఒక సృజనాత్మక క్రియ... దారాల దూరాలను దగ్గరచేస్తూ పోగుపోగులో వర్ణజీవం పోస్తూ... మృదుత్వంతో అనుకూలంగా ఉంటూ దేహాలను అలంకరిస్తూ అందాన్ని ఇనుమడింపజేసే అద్భుత సృష్టే చేనేత. ఇది భారతదేశంలో అతి ప్రాచీనమైన ప్రక్రియ. వందల ఏండ్ల కిందట విదేశీ మారకద్రవ్యాన్ని సంపాదించిన ఘనత మన చేనేతది. శాతవాహనుల కాలంలో ఇక్కడి వస్త్రాలు యూరప్‌కు ఎగుమతి చేసేవారు. కానీ ప్రస్తుతం చేనేత పరిశ్రమకు అంతగా గుర్తింపు, ప్రగతి కనిపించడం లేదు. చేనేత చాలా శ్రమతో కూడుకున్న పని. మనం ధరించే దుస్తుల్లో ఫ్యాషన్‌తో పాటు అనుకూలత కూడా ఉండాలి అనే ఉద్దేశంతో చేనేత ప్రాచుర్యానికి పూనుకున్నారు రాజేశ్వరి రామా.

వస్త్రాలపై అభిరుచి పెరిగింది

మాది వైజాగ్. నాన్న టెక్స్ టైల్స్, జువెల్లరీ బిజినెస్ చేస్తారు. నేను గీతం కాలేజీలో ఎంబీఏ చేసాను. యూనివర్శిటీ ఆఫ్ మాంచెస్టర్ యు.కెలో ఎం.ఎస్సీ ఫ్యాషన్ రీటేలింగ్ చేసాను. అక్కడే బిజినెస్ ట్రిక్స్ నేర్చుకున్నాను. చిన్నప్పటి నుండి సెలవుల్లో మా కుటుంబమంతా కలిసి కాంచీపురం, వారణాసి ఇలా ఇండియాలోని వస్త్ర తయారీ కేంద్రాలకు వెళ్లేవాళ్ళం. అమ్మనాన్నకు భక్తి ఎక్కువ. వారి దైవదర్శనాలు అయ్యాక చీరలు కొనుక్కునే వాళ్ళం. అలా వస్త్రాలపై అభిరుచి పెరిగింది. ఏదైనా కొత్తగా చేయడమంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడే డ్యామేజ్ చీరలతో గౌన్లు, పరికిణీలు కుట్టేదాన్ని. అలా ఫ్యాషన్ డిజైనింగ్ పట్ల ఆకర్షితురాలినై ఈ సంస్థ స్థాపించాను.





వ్యాపార ప్రస్థానం

చేనేత అంటే మక్కువ ఎక్కువ. మా సంస్థలో చేనేత వస్త్రాలతో కొత్తగా డ్రెస్‌లు డిజైన్ చేస్తున్నా. మేము వాడే ఫ్యాబ్రిక్ మజ్లిన్(మల్ మల్). ఇది చాలా మృదువుగా ఉండి కుట్టేటప్పుడు పీక్కుపోయే అవకాశం ఉంటుంది. అయినా చాలా జాగ్రత్తగా వివిధ రకాల దుస్తులు (ప్యాంట్ షర్ట్స్, వెస్ట్రన్ వేర్)తయారు చేస్తున్నాం. విదేశీయులకు మన చేనేత ప్రాముఖ్యాన్ని తెలియజేయడమే మా లక్ష్యం. అందుకని అనేక పుస్తకాలు చదివాను. చేనేత వస్త్ర తయారీ పరిశ్రమలను సందర్శించాను. చేనేత కార్మికులతో మాట్లాడాను. అనేక ప్రదేశాల్లో చేనేతపై అవగాహన కార్యక్రమాలు, వర్క్ షాపులు నిర్వహించాను. చీరలయితే మన దేశం వాళ్లే కట్టే అవకాశం ఉంటుంది కాబట్టి విదేశీయులు కూడా ధరించేవిధంగా అన్నిరకాల వస్త్రాలు కుట్టాలనుకున్నాను. విదేశీయులకు చేనేత గురించి అంతగా తెలియదు. వారికి చేనేత గూర్చి తెలియ పరచడానికి చాలా కష్టపడ్డాను. ఇష్టంతో చేస్తున్నాను కాబట్టి ఆ కష్టం కష్టంగా అనిపించడం లేదు. ఇప్పుడు మా వస్త్రాలు అనేక దేశాలలోకి ఎగుమతి అవుతున్నాయి. పర్యావరణ హితంగా కాటన్, సిల్క్ ఫ్యాబ్రిక్ వాడుతాం. ప్లాస్టిక్, పాలిస్టర్ వంటి కాలుష్య కారకాలు వాడాము. బటన్స్ కూడా వుడ్‌తో డిజైన్ చేస్తాం. ప్యాకింగ్‌కు బయోడిగ్రేడబుల్ కవర్స్ మాత్రమే వాడుతాం. పొల్యూషన్ లేని ఫ్యాషన్‌కు ప్రాముఖ్యం ఇస్తున్నాం. వీవర్స్‌కు పేమెంట్ ముందుగానే ఇస్తూ, వర్కర్స్‌ను ఫ్యామిలీ మెంబర్స్‌గా ట్రీట్ చేస్తూ ముందుకుసాగుతున్నాం.

కుటుంబమే నా బలం

మా తాతయ్య, మా నాన్నే నాకు ఇన్స్పిరేషన్. కష్టపడి పనిచేయడం, క్రియేటివిటీ వాళ్లదగ్గరే నేర్చుకున్నాను. నా బలం నా కుటుంబమే. మా సంస్థ పేరు కూడా మా కుటుంబ సభ్యుల పేర్లలోని అక్షరాలన్నీ కలిసే విధంగా "లేబుల్ రామా" అని పెట్టాను. ఫ్రాన్స్‌లో మార్కెటింగ్‌కు 'ఏ హబ్' వారి సహాయం తీసుకుంటున్నాను. నేను నేటి తరాన్ని కోరేది ఒకటే చేనేత వస్త్రాలనే వాడండి. చేనేత పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడం. చేనేత ఒక ఆర్ట్‌గా భావించి ఇష్టంగా కొనండి, అంతేగానీ సింపథీతో కాదు. మన వారసత్వాన్ని మనం కాపాడుకోవాలి. ఎక్కువ బట్టలు కొని వృధా చేయకుండా కొన్న వాటినే తృప్తిగా, తనివితీరా ధరించండి.

సంస్థ ముఖ్య ఉద్దేశ్యం

మన సంప్రదాయమైన చేనేతను అందరికీ పరిచయం చేయడం, అలాగే అంతరించిపోతున్న చేనేత పరిశ్రమలను బలోపేతం చేయడం. చేనేత బట్ట ప్రాముఖ్యతను విదేశాల్లో ప్రచారం చేస్తూ చేనేత వస్త్ర ప్రేమికులను పెంచడం. మన దేశ గౌరవాన్ని పెంచడం మా ముఖ్య ఉద్దేశం. స్వాతంత్ర్య పోరాటంలో కూడా మన ఖాదీకి ప్రముఖ స్థానం ఉంది. ప్రస్తుతం బెంగాల్ జందానీ ఖాదీతో, కళంకారి మచిలీపట్నంతో వర్క్ చేస్తున్నాం. మా ఉత్పత్తులను ఫ్రాన్స్‌కు ఎగుమతి చేస్తున్నాం. ఇంకా మా వ్యాపారాన్ని అమెరికా, యూరప్, జపాన్ దేశాలకు విస్తరింపజేయాలి.

- అయిత అనిత, 8985348424

దోమలను తరిమేద్దాం..



సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే దోమలు చాలా ఇబ్బంది పెడతాయి. వీటి వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దోమలను నివారించడానికి వాడే లిక్విడ్స్, కాయిల్స్ వాసన కొంతమందికి పడదు. దాంతో మరిన్ని శ్వాస, చర్మ సమస్యలు ఎదురవుతాయి. అయితే వాటితో పని లేకుండా సహజమైన ఇంటి చిట్కాలతో దోమలను తరిమేయవచ్చు. ప్రస్తుతం జ్వరాలు ప్రబలుతున్న సమయంలో ఇంటి లోపల, పరిసరాలలో దోమలు లేకుండా చూసుకోవడం అనివార్యం.. వీటి నివారణకు ఏం చేయాలో తెలుసుకుందాం...

కర్పూరం : దోమలను తరిమేయడానికి కర్పూరం బాగా పని చేస్తుంది. దీని ఘాడమైన వాసన దోమలను ఇంట్లోకి రానివ్వదు. ఇందుకు చేయాల్సిందల్లా అన్ని తలుపులు మూసేసి కర్పూరం కాల్చడం. 30 నిమిషాల తర్వాత అన్ని తలుపులు తెరవొచ్చు. ఇది దోమలను పూర్తిగా నిర్మూలించడంలో ఎంతో ఉపకరిస్తుంది. దీని వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉండవు.

వెల్లుల్లి : దోమలను దూరంగా ఉంచడానికి వెల్లుల్లి కూడా బాగా పని చేస్తుంది. కొన్ని లవంగాలు, వెల్లుల్లిని చూర్ణం చేసి నీటిలో ఉడకబెట్టుకోవాలి. ఈ నీటిని స్ప్రే బాటిల్‌లో పోసి ఇంటి మూలల్లో పిచికారీ చేయవచ్చు. క్షణాల్లో దోమల నుండి విముక్తి పొందవచ్చు.

కాఫీ : కాఫీ గింజలతో ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చు. కొద్దిగా కాఫీ గింజలను నీటిలో మరగబెట్టి దోమలు ఎక్కువగా తిరిగేచోట చల్లాలి. ప్రతి రోజూ ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

లావెండర్ ఆయిల్ : లావెండర్ నూనె నుండి వచ్చే వాసన కూడా దోమలను తరిమేస్తుంది. ఇంటి పరిసర ప్రాంతాలలో లావెండర్ నూనెను పిచికారీ చేయండి. అలాగే దోమ కాటును నివారించడానికి ఈ నూనెను శరీరంపై పూయవచ్చు. ఆరోగ్యానికి ఎలాంటి హానీ చేయదు.

పుదీనా : లావెండర్ ఆయిల్ మాదిరిగా దోమలను తిప్పి కొట్టడానికి పుదీనా కూడా బాగా పని చేస్తుంది. తాజా పుదీనా లేదా పుదీనా నూనె తీసుకొని మీ చుట్టూ పిచికారీ చేసుకుంటే దోమల బెడద నుండి తప్పించుకోవచ్చు. పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుకున్నా మంచి ఫలితం ఉంటుంది.

టీ ట్రీ ఆయిల్ : ఇది యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటుంది. గాయాలు, అనేక వ్యాధులకు దీనితో చికిత్స చేస్తారు. ఇది దోమలను నివారించడానికి కూడా ఉపయోగపడుతుంది. టీ ట్రీ ఆయిల్ కొన్ని చుక్కలను నీటితో కలిపి స్ప్రే బాటిల్‌లో కలపండి. ఇంటి మూలల్లో పిచికారీ చేసుకుంటే దోమల నుండి ఉపశమనం పొందవచ్చు.

తులసి ఆకులు : తులసి ఆకులు దోమల లార్వాలను చంపడానికి సహాయ పడతాయి. పెరట్లో లేదా ఇంటి ప్రవేశద్వారం వద్ద ఒక తులసి మొక్కను నాటవచ్చు. ఇది దోమల సమస్య నుండి బయటపడటానికి ఉపయోగపడుతుంది.

ఇట్ల చేద్దాం



పుట్టగొడుగులు వేయించేపుడు చెంచా నిమ్మ రసం, చెంచా కరిగించిన వెన్నను కలిపితే వాటి రంగు కోల్పోకుండా ఉంటాయి. రుచి కూడా చాలా బాగుంటుంది.

వ్యవసాయ రంగం పెద్ద దిక్కును కోల్పోయింది : సీఎం

(మొదటిపేజీ తరువాయి)

దార్శనికతతో, సాంప్రదాయ పద్ధతిలో సాగుతున్న దేశీయ వ్యవసాయాన్ని స్వామినాథన్ వినూత్న పద్ధతుల్లో గుణాత్మక దశకు చేర్చారని తెలిపారు. ఆహారాభివృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించిందంటే అది ఆయన కృషితోనే సాధ్యమైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దేశ ప్రజల ప్రధాన ఆహార వనరులైన వరి, గోధుమ తదితర పంటలపై స్వామినాథన్ చేసిన గొప్ప ప్రయోగాలతో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగి హరిత విప్లవాన్ని సాధించిందని తెలిపారు. స్వామినాథన్ కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, శాసన సభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కె తారకరామారావు, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీష్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్‌కుమార్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ తదితరులు స్వామినాథన్ మరణం పట్ల తమ సంతాపాన్ని ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సారీ.. రిస్క్ తీసుకోలేం

(మొదటిపేజీ తరువాయి)

మీరు చెప్పిన నాయకుడికి టికెట్ ఇస్తే గెలిపించేందుకు మీరే బాధ్యత తీసుకుంటారా? అందుకు మీరేం చేస్తారో ముందుగా కాగితంపై రాసి ఇవ్వాలని పార్టీ సీనియర్లకు మెలిక పెట్టినట్టు తెలిసింది. టికెటు ఇప్పించుకోవడం, ఆ తర్వాత చేతులెత్తేయడం...ఫలితంగా పార్టీ ఓడిపోవడం ఆనవాయితీగా వస్తోందని నేతల వద్ద అధిష్టానం వాదించినట్టు సమాచారం. టీడీపీ, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన నేతలైనా సరే...గెలువడమే ముఖ్యం. అటువంటి వారికే టికెట్లు ఇస్తామంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పినట్టు తెలుస్తోంది. మాజీ మంత్రులు జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండాసురేఖ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితోపాటు మరికొంత మంది సీనియర్ నాయకులు సైతం రెండు టికెట్లు కావాలని అధిష్టానంపై ఒత్తిడి పెడుతున్నట్టు ఏఐసీసీ పెద్దలు చెబుతున్నారు. బీఫామ్ మీక్కావాలో, మీ కుటుంబ సభ్యులకు కావాలో తేల్చుకోవాలని హైకమాండ్ కోరుతున్నది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు మూడు టికెట్లు ఇస్తామన్న హామీని ప్రస్తావిస్తున్నట్టు తెలిసింది. ఆ మూడు సీట్లలో ఎంత ఖర్చయినా బాధ్యత తనదేనంటూ కచ్చితంగా గెలిపించుకొస్తానంటూ మైనంపల్లి అధిష్టానికి హామీ ఇచ్చారనీ, మీరు కోరే సీట్లకు మీరలాంటి బాధ్యత వహిస్తారా? అని హైకమాండ్ ప్రశ్నిస్తున్నట్టు తెలిసింది. పైరవీల ద్వారా టికెట్లు సాధించాలనే ప్రయత్నాలకు మాత్రం కాంగ్రెస్ అధిష్టానం చెక్ పెడుతున్నట్టు స్పష్టమవుతున్నది.

కిటెక్స్ సంస్థకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన

(మొదటిపేజీ తరువాయి)

వస్త్ర తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్న కిటెక్స్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఆ సంస్థకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం నుంచి అందిస్తామని హామీనిచ్చారు. కిటెక్స్ సంస్థ తయారీ క్లస్టర్ల ఏర్పాటు ద్వారా రోజువారీగా ప్రపంచంలోనే అత్యధిక దుస్తులను ఉత్పత్తి చేస్తున్న తయారీ ప్లాంట్ ఉన్న ప్రాంతాల్లో ఒకటిగా తెలంగాణ నిలువబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాకేబ్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ ఏడు లక్షల దుస్తులను తమ సంస్థ ఉత్పత్తి చేయబోతుందని తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి తయారీ కేంద్రం నిర్మాణం పూర్తవుతుందనీ, వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇప్పటికే కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో తన భారీ తయారీ యూనిట్ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నామనీ, ఈ డిసెంబర్ నాటికి వరంగల్ కేంద్రంగా తన కార్యకలాపాలను ప్రారంభిస్తామని చెప్పారు.

రూ.350 కోట్ల సింటెక్స్ తయారీ యూనిట్‌కు శంకుస్థాపన

వెల్స్పన్ సంస్థ తన సబ్సిడరీ సంస్థ ఆధ్వర్యంలో చందన్‌వెల్లిలో ఏర్పాటు చేయనున్న సింటెక్స్ తయారీ యూనిట్‌కు మంత్రి కేటీఆర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వెల్స్పన్ వరల్డ్ చైర్మెన్ బీకే గోయెంకా పాల్గొన్నారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఆ సంస్థ నూతన యూనిట్‌ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

నవజాత శిశు సంరక్షణ (ఎస్ఎన్సియూ) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఒక్కొక్క 100 పడకల ఆస్పత్రిని సుమారు రూ.36 కోట్లతో నిర్మించనున్నామని, ఆరు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. 40 మంది డాక్టర్లు రానున్నట్టు తెలిపారు. వరంగల్ జిల్లా కేంద్రంలో రూ.1100 కోట్లతో 24 అంతస్థుల్లో 2వేల పడకలతో హెల్త్ సిటీ నిర్మిస్తున్నామన్నారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ రాష్ట్రానికి రాకపోవడం బాధాకరమన్నారు. సీట్లు అమ్ముకొనే వారు రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్నే అమ్ముతారని విమర్శించారు. కాంగ్రెస్ పింఛన్‌లను రూ.4వేలకు పెంచుతామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు దేశం మొత్తం మీద ఒక పాలసీ ఉండాలి కాదా ? ఒక్క తెలంగాణలో మాత్రమే రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెబితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ఈ తొమ్మిదేండ్లలో సస్యశ్యామలం చేశారని చెప్పారు. సాగు నీటి రంగంలోనే కాదు విద్య, వైద్య రంగాల్లోనూ అనూహ్యమైన మార్పులతో పేద విద్యార్థుల ముంగిటకు ఉచిత చదువులు తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వమన్నారు. 33 జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి లక్ష మందికి 22 మంది ఎంబీబీఎస్ డాక్టర్లు ఉండేలా చేస్తున్నామన్నారు.

వరంగల్ ఉమ్మడి జిల్లాలో కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులతో గోదావరి నీళ్లు తెచ్చి సాగు నీరు అందిస్తున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాలను అద్భుతంగా తీర్చిదిద్దిన కేసీఆర్‌ను నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయం తథ్యమని ధీమా వ్యక్త చేశారు. నగర పంచాయతీగా ఉన్న ములుగు ప్రాంతం నేడు జిల్లా కేంద్రంగా ఏర్పడిందని, సమీకృత కలెక్టరేట్, ఎస్పీ భవనం, వైద్య కళాశాలతో ములుగు రూపు రేఖలు మారనున్నాయని చెప్పారు. అనంతరం వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు, దళిత బంధు, గృహలక్ష్మీ పథకం మంజూరు పత్రాలను మంత్రి లబ్దిదారులకు అందజేశారు.

కేంద్రం చేసిందేమీ లేదు : కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదేండ్లలో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిందేమి లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. పీటీఐ వార్తా సంస్థకు ఆమె ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను తిరస్కరిస్తారని తెలిపారు. ఆ రెండు పార్టీలు రాష్ట్రానికి చేసిందేమని లేదని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలు, ఆ పార్టీ మాటలు నమ్మశక్యంగా లేవని తెలిపారు. వచ్చే ఎన్నికల నుంచే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హరిత విప్లవ పితామహుడు ఇక లేరు

(మొదటిపేజీ తరువాయి)

పీహెచ్‌డీ చేశారు. అంతేకాదు...విస్కాన్సిన్ వర్సిటీలోని జెనెటిక్స్ విభాగంలో పోస్ట్ డాక్టరల్ పరిశోధన చేశారు. 1954లో స్వదేశానికి తిరిగి వచ్చి భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో శాస్త్రవేత్తగా చేరారు. వ్యవసాయ పరిశోధనలకు సంబంధించి పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు ఆయన నేతృత్వం వహించారు. వాటి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థలో జెనెటిక్స్ విభాగాన్ని, అణు పరిశోధనా ప్రయోగశాలను ఆయనే ఏర్పాటు చేశారు. ఫిలిప్పీన్స్‌లో అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ అధిపతిగా పనిచేశారు. దేశంలోని ఉష్ణ మండల ప్రాంతాల కోసం అంతర్జాతీయ పంటల పరిశోధనా కేంద్రం ఏర్పాటులో భాగస్వామి అయ్యారు. ఇటలీలో మొక్కల జన్యు వనరులకు సంబంధించి అంతర్జాతీయ బోర్డు ఏర్పాటులో, కెన్యాలో వ్యవసాయ-అటవీ భూములకు సంబంధించి అంతర్జాతీయ పరిశోధనా మండలి ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

వరి, గోధుమ పంటలపై ఆయన చేసిన పరిశోధనల కారణంగా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా దేశం హరిత విప్లవాన్ని సాధించింది. స్వామినాథన్ ఎన్నో పదవులను చేపట్టి వాటికి వన్నె తెచ్చారు. మరెన్నో పురస్కారాలు ఆయన్ని వరించాయి. 1972-1979 మధ్యకాలంలో భారత వ్యవసాయ పరిశోధనా మండలి డైరెక్టర్ జనరల్‌గా, 1979-1980లో కేంద్ర వ్యవసాయ శాఖ ప్రధాన కార్యదర్శిగా, 1982-1988 మధ్య అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ డైరెక్టర్ జనరల్‌గా పనిచేశారు. 2019-22 మధ్యకాలంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రధాన శాస్త్రవేత్తగా పనిచేశారు. 20వ దశాబ్దంలో ఆసియా ప్రజలను అధికంగా ప్రభావితం చేసిన వారితో టైమ్స్ పత్రిక రూపొందించిన జాబితాలో స్వామినాథన్ పేరును చేర్చారు. స్వామినాథన్ 1987లో చెన్నైలో తన పేరిట రిసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశారు.

1967లో పద్మశ్రీ, 1972లో పద్మభూషణ్, 1989లో పద్మవిభూషణ్ అవార్డులు పొందారు. 1971లో రామన్ మెగసెసే అవార్డును, 1986లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ప్రపంచ సైన్స్ అవార్డును అందుకున్నారు. 1987లో వ్యవసాయ పరిశోధనలో అత్యున్నత పురస్కారం ప్రపంచ ఫుడ్ అవార్డు ఆయనను వరించింది. 1989లో ఇందిరాగాంధీ శాంతి బహుమతి, 2013లో ఇందిరాగాంధీ సమైక్యతా పురస్కారం లభించాయి.

స్వామినాథన్‌కు ముగ్గురు కుమార్తెలు..సౌమ్య, మధుర, నిత్య...ఉన్నారు. ఆయన భార్య విద్యావేత్త మీనా స్వామినాథన్ గత సంవత్సరమే కన్నుమూశారు.

గ్రూప్-1లో తప్పలు జరగలేదు

- అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదు
- టీఎస్‌పీఎస్సీ స్పష్టీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పులు జరగలేదని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) స్పష్టం చేసింది. అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదని తెలిపింది. బయోమెట్రిక్ విధానం పాటించలేదనీ, పరీక్షను సరిగ్గా నిర్వహించలేదని గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఆ తీర్పుపై టీఎస్‌పీఎస్సీ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసింది. అయితే సింగిల్ జడ్జి ఇచ్చిన గ్రూప్-1 ప్రిలిమ్స్ రద్దు తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. పరీక్షను తిరిగి నిర్వహించాలని ఆదేశించింది. టీఎస్‌పీఎస్సీ గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. కొన్నేండ్లుగా నియామకాల కోసం పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికే ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తున్నామని తెలిపింది. ఈ ఏడాది జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించామని పేర్కొంది. కలెక్టర్లు, ఇతర అధికారుల నుంచి సేకరించిన ప్రాథమిక సమాచారం మేరకు తొలుత 2,33,248 మంది అభ్యర్థులు హాజరయ్యారని ప్రకటించామని వివరించింది.

ఈ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని స్పష్టం చేసింది. ఆ తర్వాత ఓఎంఆర్ పత్రాల స్కానింగ్ ప్రక్రియ మొదలయ్యాక 2,33,506 మంది హాజరయ్యారని వివరాలొచ్చాయని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోని 994 పరీక్షా కేంద్రాల్లో జూన్ 11న గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను నిర్వహించామని పేర్కొంది. జిల్లాల్లోని కేంద్రాల్లో లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపింది. స్వల్ప సమస్యలు తలెత్తాయని వివరించింది. లేదంటే అభ్యర్థుల హాజరుకు సంబంధించి ప్రాథమిక సమాచారంలోని వివరాలకు, స్కానింగ్‌లో తుది వివరాలకు మధ్య కొంత తేడా ఉందని తెలిపింది. అయితే గ్రూప్-1 ప్రిలిమ్స్‌పై వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. అదనంగా ఓఎంఆర్ పత్రాలు కలిసే అవకాశం లేదని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఎలాంటి తప్పు జరగలేదని వివరించింది.

వెన్నంటే ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ధరలు పెంచుతూ భారాలు మోపుతున్నదని విమర్శించారు. కేరళలో వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం రూ.1600 పింఛన్ ఇస్తున్నదని, పేదలందరికీ ఇండ్లు కట్టిస్తున్నదని తెలిపారు. ఇక్కడ ఎన్నికల సమయంలోనే పాలకులకు పేదలు గుర్తుకొస్తారని విమర్శించారు. పేదల భూ పోరాటంపై రాష్ట్ర ప్రభుత్వానికి తాను లేఖ రాస్తానని, పోరాటం విజయవంతం అయ్యే వరకు అండగా ఉంటామని అన్నారు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేదలను గుర్తించి ప్రభుత్వ భూములు పంచాలని, పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రాష్ట్రంలో 67 కేంద్రాల్లో వేలాది మంది స్థలాలను ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్నారన్నారు. పాలక పార్టీలు పేదల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికి అనేక కుయుక్తులకు పాల్పడుతున్నాయన్నారు. వాటిని ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, నాయకులు మచ్చ వెంకటేశ్వర్లు, పోన్నం వెంకటేశ్వర్లు, కనకయ్య రైతు సంఘం నాయకులు సూడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికి తీరనిలోటు : సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించారని తెలిపారు. వరి, గోధుమల అధికోత్పత్తి వంగడాల వినియోగం ద్వారా విత్తనరంగంలో పెనుమార్పులు తెచ్చారని పేర్కొన్నారు. భూసంస్కరణల అమలుకు కృషి చేశారని వివరించారు. ఆహారధాన్యాల లోటుతో ఉన్న భారత్ 1985 నాటికి ఎగుమతుల దేశంగా మారిందని తెలిపారు. ఆహారధాన్యాలు ఎగుమతులు చేసే స్థితికి చేరామని పేర్కొన్నారు. హార్టికల్చర్ ఉత్పత్తులు కూడా ఎగుమతులు చేయగలిగామని వివరించారు. 1988లో ఎంఎస్ స్వామినాథన్ పరిశోధనా సంస్థ ప్రారంభించారని తెలిపారు. స్వామినాథన్ చైర్మెన్‌గా భారత ప్రభుత్వం 2004లో జాతీయ రైతుల కమిషన్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఆ కమిషన్ 2006లో నివేదిక సమర్పించిందని వివరించారు. ఆ నివేదిక ప్రకారం రైతుల పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించాలనీ, వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలని సిఫారసులు చేసిందని తెలిపారు. కార్పొరేట్ల లాభాల కోసం బీజేపీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం ఆ నివేదికను తొక్కిపెట్టిందని విమర్శించారు. వ్యవసాయ రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి, దేశ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని అహర్నిశలూ కృషి చేసిన శాస్త్రవేత్త స్వామినాథన్‌కు నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు.

వ్యవసాయ రంగానికి తీరనిలోటు : సీపీఐ

హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం వ్యవసాయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆహారం కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి నుంచి భారతదేశం స్వావలంబన సాధించేందుకు ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. వ్యవసాయ రంగ బలోపేతానికి, రైతు తన కాళ్లపై నిలబడేందుకు స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులు ఎంతో ఉపయుక్తమైనవని పేర్కొన్నారు. వాటిని యథాతదంగా అమలు చేయడమే స్వామినాథన్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన మైనంపల్లి

(మొదటిపేజీ తరువాయి)

శ్రీనివాస్ రెడ్డి పలువురు ముఖ్యనేతలు పాల్గొన్నారు. త్వరలోనే బీఆర్ఎస్‌లో టికెట్ రాని మరో ఇద్దరు సిట్టింగులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడానికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్టుగా తెలుస్తుంది. మొత్తానికి తాజా చేరికలతో కాంగ్రెస్‌కు మరింత బలం చేకూరినట్టయింది. మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వకపోవడంతో బీఆర్ఎస్ తిరుగుబావుటా ఎగరేశారు. వేముల వీరేశం పరిస్థితి కూడా అంతే. కుంభం అనిల్ మాత్రం కాంగ్రెస్ నుంచి కొద్దిరోజుల క్రితం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకుని మళ్లీ సొంత గూటికి వచ్చేశారు.

నవచిత్రం

ఈ కథకి మా నాన్నే స్ఫూర్తి



శ్రీకాంత్ అడ్డాల

విరాట్ కర్ణ హీరోగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో రూపొందిన న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్ 'పెదకాపు-1'. ద్వారకా క్రియేషన్స్‌పై మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల మీడియాతో మాట్లాడుతూ, '1982లో రామారావు పార్టీ పెట్టినప్పుడు మా నాన్న ఊర్లో చాలా క్రియాశీలంగా ఉండేవారు. ఒక కొత్తపార్టీ వస్తుందంటే జీవితాల్లో ఏదో కొత్త మార్పు వస్తుందనే ఆశ అందరిలో ఉంటుంది. అప్పుడు వచ్చిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో, కొన్ని సంఘటనల ఆధారంగా ఫిక్షన్‌ని జోడించి చేసిన కథ ఇది. దీనికి స్ఫూర్తి మా నాన్నే. మొదట్లోనే ఈ యూనిక్ స్టోరీని రెండు పార్టులు చేయాలనుకున్నాం. విరాట్ కర్ణకి ఇది తొలి సినిమా. కొత్తవాళ్ళతో ఈ తరహా జోనర్‌లో సామాన్యుడి పోరాటం చూపించడం ఒక ఛాలెంజ్‌గా ఫీలయ్యా. అనుకోకుండా ఇందులో నేనూ ఓ పాత్రలో నటించాల్సి వచ్చింది. ప్రీమియర్ చూస్తున్నపుడు నా పాత్రని బాగా ఎంజాయ్ చేశాను' అని అన్నారు.

డబుల్ పవర్‌తో డబుల్ ఇస్మార్ట్

రామ్ పోతినేనితో డైరెక్టర్ పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. మాస్, యాక్షన్‌ని ఇష్టపడే ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వడానికి ఈ కాంబో రెడీ అవుతోంది. హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది.

గురువారం దర్శకుడు పూరి జగన్నాథ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ, 'డబుల్ ఇస్మార్ట్' టీమ్ పవర్ ఫుల్ పోస్టర్‌ను విడుదల చేసింది.

పోస్టర్‌లో దర్శకుడు, హీరో రామ్, విలన్ సంజయ్ దత్‌తో కలిసి చేతిలో డబుల్ బ్యారెల్ గన్‌లు పట్టుకుని కనిపించారు. రామ్, పూరీల డెడ్లీ కాంబినేషన్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు.

"ఇస్మార్ట్ శంకర్'కి మించి అనేలా ఈ చిత్రాన్ని దర్శకుడు పూరీ తనదైన మార్క్‌తో ఎక్కడా రాజీపడకుండా తెరకెక్కిస్తున్నారు. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ కోసం హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ జియాని జియానెల్లి పనిచేస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మహా శివరాత్రి కానుకగా మార్చి 8న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది' అని చిత్ర బృందం చెప్పారు.




సంజయ్‌దత్, పూరీ జగన్నాథ్, రామ్

బ్రో..ఐ డోంట్ కేర్

బాలకృష్ణ, డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భగవంత్ కేసరి'. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రయాణాన్ని మేకర్స్ ఒక క్లిప్‌లో చూపించారు. పూజా కార్యక్రమం నుంచి నిర్మాణ పనులకు సంబంధించిన కీలకమైన వివరాలను ఈ వీడియోలో పొందుపరిచారు.

'ప్యాషనేట్ టీమ్ 8 నెలల పాటు తీవ్రంగా శ్రమించారు. 24 అద్భుతమైన ప్రదేశాలలో, 12 మాసివ్ సెట్లలో షూటింగ్ జరిగింది. బాలకృష్ణ కొన్ని పవర్ ప్యాక్డ్ డైలాగ్‌లు చెబుతున్నట్లు కూడా వీడియోలో ఉంది. "కలిసి మాట్లాడతా అన్నా కదా, అంతలోనే మందిని పంపాలా... గ్రౌండ్ ఫ్లోర్ బలిసిందా బే...' అంటూ గూండాలను హెచ్చరించారు. బాలకృష్ణ చెప్పిన చివరి డైలాగ్ 'బ్రో... ఐ డోంట్ కేర్' తన మొండి స్వభావాన్ని తెలియజేస్తుంది. బాలకృష్ణను మునుపెన్నడూ చూడని క్యారెక్టర్‌లో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రెజెంట్ చేస్తున్నారు. గెటప్ కూడా పూర్తిగా కొత్తగా ఉంది. సాల్ట్ అండ్ పెప్పర్ లుక్‌లో బాలకృష్ణ కనిపిస్తారు. తమన్ అద్భుతమైన స్కోర్ విజువల్స్‌కు బలం చేకూర్చింది.

ఇటీవలే గణేష్ చతుర్థి వేడుకల్లో సంచలనంగా మారిన 'గణేష్..' సాంగ్‌తో ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ కథానాయికగా నటిస్తోంది. శ్రీలీల ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం అక్టోబర్ 19న థియేటర్లలోకి రానుందని మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు' అని చిత్ర యూనిట్ తెలిపింది.



బాలకృష్ణ

ఓ మనిషి యానిమల్‌గా మారితే..?

రణబీర్ కపూర్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'యానిమల్'. ప్రీ-టీజర్‌తో ఆశ్చర్యపరిచిన మేకర్స్ గురువారం రణబీర్ కపూర్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. ఇది తండ్రీ కొడుకుల పాత్రల్లో కనిపించిన అనిల్ కపూర్, రణబీర్ కపూర్‌ల కథ. విలన్‌గా బాబీ డియోల్ ఎంట్రీ, పిల్లల గురించి రణబీర్, రష్మిక మందన్నల మధ్య చర్చ జరుగుతున్నప్పుడు చూపించిన రక్తపాతం, కారు ఛేజింగ్‌లు, ఇంటెన్స్ ఎలిమెంట్స్ చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాయి. అలాగే రణబీర్ రెబల్‌గా మారే క్రమాన్ని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన మార్క్‌తో ప్రజెంట్ చేశారు. మొత్తంగా ఈ టీజర్ సినిమాకి ఓ గ్లింప్స్‌లా ఉండటం విశేషం. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ టి-సిరీస్, ప్రణయ్ రెడ్డి వంగా భద్రకాళి పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 1న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.



రణబీర్ కపూర్

ఆద్యంతం భయపెట్టే సినిమా



డేవిడ్ గోర్డాన్ గ్రీన్ దర్శకత్వం వహించిన అతీంద్రియ భయానక చిత్రం 'ది ఎక్సార్సిస్ట్: బిలీవర్'. ఇది 'ఎక్సార్సిస్ట్..' ఫ్రాంచైజీలో ఆరవది. అలాగే ఇది 'ది ఎక్సార్సిస్ట్'కి సీక్వెల్ కూడా. విలియం పీటర్ రాసిన 'ది సమె నేమ్' నవల ఆధారంగా దీన్ని తెరకెక్కించారు.

1973లో రిలీజైన 'ది ఎక్సార్సిస్ట్' సూపర్ నేచురల్ హర్రర్ చిత్రంగా ప్రేక్షకుల్ని విశేషంగా భయపెట్టింది. అంతేకాదు వరల్డ్ బాక్సాఫీస్ దగ్గర భారీ వసూళ్ళని కూడా కలెక్ట్ చేసింది. అలాగే 10 అకాడమీ నామినేషన్లు నామినేట్ చేయబడిన మొదటి భయానక చిత్రంగానూ ఇది నిలిచింది.

ఒక రోజు ఏంజెలా, ఆమె సహచరురాలు కేథరీన్ (ఒలివియా ఓనీల్) తప్పిపోతారు. మూడు రోజుల తర్వాత ఏమి జరిగిందనే దానిపై ఎలాంటి క్లూ ఉండదు. క్రిస్ మాక్‌నీల్ (ఎల్లెన్)ని సంప్రదించమని విక్టర్‌ని బలవంతం చేస్తుంది. ఆ తరువాత ఏమి జరిగింది అనేది కథ.

ఈ సినిమా విడుదలైన 50 సంవత్సరాల తర్వాత దీనికి సీక్వెల్‌గా రూపొందిన "ది ఎక్సార్సిస్ట్: బిలీవర్' అక్టోబర్ 6న తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల కానుంది. దీనికి సినిమాటోగ్రఫీ-మైఖేల్ సిమండ్స్, సంగీతం- డేవిడ్ వింగో.

గురి అదిరింది

ఆసియా క్రీడల్లో టీమ్ ఇండియా పతక జోరు కొనసాగుతుంది. హాంగ్జౌలో భారత్ వరుసగా ఐదో రోజు పతకాల పంట పండించింది. షూటింగ్‌లో మరో పసిడి పతకం దక్కగా.. వుషూలో సిల్వర్ మెడల్ సొంతమైంది. ఈక్వెస్ట్రియన్ (గుర్రపుస్వారీ)లో కాంస్య పతకం లభించింది. ఐదో రోజు మూడు మెడల్స్ సాధించిన భారత్.. పతకాల పట్టికలో 25 మెడల్స్‌తో ఐదో స్థానంలో నిలిచింది.



'నిజాయితీగా చెప్పాలంటే, ఈ పసిడి పతకం ఊహించలేదు. ఇవి మాకు తొలి ఆసియా క్రీడలు. తొలి ప్రయత్నంలోనే పతకం సాధించటం, అదీ బంగారం సొంతం చేసుకోవటం ఎంతో సంతోషంగా ఉంది. మేము అన్నదమ్ముల్లా ఉంటాం. షూటింగ్ రేంజ్‌లో పోటీ, ఆ తర్వాత చెలిమి మా నైజం. శివ, అర్జున్‌తో కలిసి సాధించిన ఈ గోల్డ్ మెడల్ ఎంతో ప్రత్యేకం. వ్యక్తిగత విభాగంలో నాల్గో స్థానంలో నిలువటం సంతృప్తి ఇవ్వలేదు. రానున్న టోర్నీల్లో పతక ప్రదర్శన చేసేందుకు మెరుగవుతాను'

- సరబ్జోత్ సింగ్

- షూటింగ్‌లో మరో పసిడి
- వుషూలో రోషిబినాకు రజతం
- ఈక్వెస్ట్రియన్‌లో అనూశ్‌కు కాంస్యం

హాంగ్జౌ ఆసియా క్రీడలు 2023

నవతెలంగాణ-హాంగ్జౌ

షూటింగ్‌లో మెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్. భారత యువ షూటర్ సౌరభ్ చౌదరి ఈ విభాగంలో ఆసియా రికార్డు నెలకొల్పాడు. 2018 జకర్తా క్రీడల్లో సౌరభ్ రికార్డు 240.7 పాయింట్లతో పసిడి కొల్లగొట్టాడు. దీంతో సహజంగానే ఈసారి ఈ విభాగంలో భారత్ పతక ఆశలతో బరిలోకి దిగింది. కానీ పతక వేటలో 4, 8 స్థానాలకు మాత్రమే పరిమితమైంది. సరబ్జోత్ సింగ్ 199 స్కోరుతో నాల్గో స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో చేజార్చుకోగా.. చీమా సింగ్ అర్జున్ ఫైనల్లో చివరి స్థానంలో నిలిచాడు. దీంతో మెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జట్టు విభాగంలో మనోళ్లపై పెద్దగా అంచనాలు లేకుండా పోయాయి. ఇక్కడే యువ షూటర్ల త్రయం అద్భుతం చేసింది. ఆసియా క్రీడల్లో తొలిసారి గురి పెట్టిన సరబ్జోత్ సింగ్, చీమా అర్జున్ సింగ్, శివ నర్వాల్‌లు అదరగొట్టారు. 1734 పాయింట్లతో పసిడి పతకం అందుకున్నారు. చైనా షూటర్లు 1733 పాయింట్లతో రజతం, వియత్నాం జట్టు 1730 పాయింట్లతో కాంస్యం సాధించాయి. పతక వేటలో భారత్‌కు చైనా నుంచి గట్టి పోటీ ఎదురైంది. చివరి రౌండ్‌లో కచ్చితంగా పదేసి పాయింట్లు సాధిస్తే కానీ పసిడి రేసులో నిలువలేని పరిస్థితి. ఒత్తిడిలో మరింత మెరుగ్గా గురి పెట్టిన సరబ్జోత్, అర్జున్, శివలు బంగారు పతకం ముద్దాడారు. సరబ్జోత్ సింగ్ వరుసగా 95, 95, 97, 98, 97, 98 పాయింట్లు సాధించగా.. చీమ అర్జున్ సింగ్ 97, 96, 97, 97, 96, 95తో మెరిశాడు. శివ నర్వాల్ 92, 96, 97, 99, 97, 95తో దుమ్మురేపాడు. షూటింగ్‌లో భారత్‌కు ఇది నాలుగో పసిడి పతకం కావటం విశేషం.

వుషూలో రోషిబినాకు రజతం :

ఆసియా క్రీడల్లో భారత్‌కు పతక అవకాశాలు మెరుగ్గా ఉన్న మరో ఈవెంట్ వుషూ. క్రీడల ఆరంభానికి ముందే వుషూ అథ్లెట్లు వార్తల్లో నిలిచారు. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన ముగ్గురు వుషూ అథ్లెట్లకు చైనా స్టాంప్డ్ వీసా నిరాకరించింది. దీంతో పతకం నెగ్గే అవకాశం ఉన్న ముగ్గురు అథ్లెట్లు టోర్నీకి దూరంగానే ఉండిపోయారు!. మార్షల్ ఆర్ట్స్ గేమ్‌లో బరిలో నిలిచిన ఇతర అథ్లెట్లు మాత్రం సత్తా చాటుతున్నారు. మణిపూర్ మణిపూస రోషిబినా దేవి మహిళల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించింది. మహిళల 60 కేజీల శాండ విభాగంలో పోటీపడిన రోషిబినా దేవి గురువారం జరిగిన పసిడి పోరులో చైనా అమ్మాయికి స్వర్ణం కోల్పోయింది. తొలి రౌండ్లో రోషిబినా దేవి లెగ్ కిక్స్‌తో మెరిసినా.. చైనా అమ్మాయి 1-0తో ముందంజ వేసింది. చావోరేవో తేల్చుకోవాల్సిన రెండో గేమ్‌లో సైతం రోషిబినా దేవి మెరుగైన ప్రదర్శన చేసినా ప్రత్యర్థిదే పైచేయిగా నిలిచింది. దీంతో మూడో రౌండ్ అవసరం లేకుండానే చైనా అమ్మాయి 2-0తో స్వర్ణం దక్కించుకుంది. పసిడి పోరులో పోరాడి ఓడిన రోషిబినా దేవి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. 2018 జకర్తా ఆసియా క్రీడల్లో కాంస్య పతకం సాధించిన రోషిబినా దేవి.. తాజాగా రజతంతో పతకం రంగు మెరుగుపర్చుకుంది.



ఈక్వెస్ట్రియన్‌లో మెరిసిన అనూశ్ :

2023 ఆసియా క్రీడల్లో భారత గుర్రపుస్వారీ జట్టు అదరగొడుతుంది. డ్రెసేజ్ విభాగంలో టీమ్ ఇండియా ఇప్పటికే టీమ్ విభాగంలో పసిడి సాధించి చరిత్ర సృష్టించగా.. అదే విభాగం వ్యక్తిగత పోటీలో అనూశ్ అగర్వాలా మెరిశాడు. పలు సిరీస్‌లుగా జరిగిన ఈ పోటీల్లో అనూశ్ అగర్వాలా, అతడి గుర్రం ఎట్రో 73.030 స్కోరు సాధించారు. ఓవరాల్‌గా మూడో స్థానంలో నిలిచిన అనూశ్ అగర్వాలా కాంస్య పతకం సొంతం చేసుకున్నాడు. మలేషియా రైడర్ 75.780 స్కోరుతో పసిడి నెగ్గగా.. హాంగ్‌కాంగ్ రైడర్ 73.450 స్కోరుతో రజతం గెల్చుకున్నాడు.

ఆటలు

హాకీ ఇండియా గెలుపు

భారత మెన్స్ హాకీ జట్టు గ్రూప్ దశలో కీలక విజయం సాధించింది. గ్రూప్-ఏలో డిఫెండింగ్ చాంపియన్ జపాన్‌పై 4-2తో గెలుపొందింది. ఈ విజయంతో గ్రూప్-ఏలో భారత్ అగ్రస్థానానికి చేరుకుంది. 30 నిమిషాల ఆట అనంతరం భారత్ 2-0తో ముందంజలో నిలిచింది. ద్వితీయార్థంలో జపాన్ గోల్స్ కొట్టినా.. భారత్ సైతం మెరిసింది. అభిషేక్ 13, 45వ నిమిషాల్లో గోల్ కొట్టగా.. రోహిదాస్, మన్‌దీప్ సింగ్‌లు గోల్స్ నమోదు చేశారు. జపాన్ తరఫున కటో, మిటానిలు గోల్స్ సాధించారు.

ఛెత్రి సేన ఇంటిముఖం

సమకరణాలు కలిసొచ్చి గ్రూప్ దశ దాటి నాకౌట్ దశకు చేరుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు.. ప్రీ క్వార్టర్స్‌లో పరాజయం పాలైంది. సౌదీ అరేబియా చేతిలో 0-2తో ఓటమి చెంది ఇంటిముఖం పట్టింది. ప్రథమార్థం ముగిసే సరికి ఇరు జట్లు గోల్స్ కొట్టలేదు. కానీ ద్వితీయార్థం ఆరంభంలోనే సౌదీ ఆటగాడు మారెన్ 51, 58వ నిమిషాల్లో డబుల్ గోల్స్‌తో విరుచుకుపడ్డాడు. గోల్స్ వేటలో విఫలమైన భారత్ ఆసియా క్రీడల నుంచి నిష్క్రమించింది.

ఆకుల శ్రీజ ముందంజ

టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ స్టార్ ఆకుల శ్రీజ శుభారంభం చేసింది. మహిళల డబుల్స్‌లో దియ చితాలెతో కలిసి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది. 11-8, 15-13, 11-6తో వియత్నాం జోడీపై గెలుపొంది ముందంజ వేశారు. మహిళల సింగిల్స్‌లో శ్రీజ 6-11, 4-11, 13-15, 9-11తో ఉత్తర కొరియా ప్యాడ్లర్ చేతిలో ఓడింది.

విజేతగా నిలిచి.. ఇంటికెళ్లలేని దుస్థితి!

- మణిపూర్ అథ్లెట్ రోషిబినా దేవి కన్నీటిగాథ



నవతెలంగాణ-హాంగ్జౌ

ఆసియా క్రీడల్లో పతకం సాధించిన అథ్లెట్లు సహజంగానే విజయ సంబురాలు, అభిమానుల స్వాగతం నడుమ స్వరాష్ట్రానికి చేరుకుంటారు. ప్రతి క్రీడాకారుడు కోరుకునే, కలలు కనే హోమ్‌కమింగ్ ఇదే. కానీ మణిపూర్ అథ్లెట్లు ఆ ఆనందానికి నోచుకోలేదు. రాజకీయ ప్రేరేపిత చిచ్చుతో రెండు తెగల నడుమ గత ఐదు నెలలుగా మణిపూర్ మంటల్లో కాలిపోతున్న సంగతి ప్రపంచానికి తెలిసిన సంగతే. 2023 ఆసియా క్రీడల్లో వుషూ (మార్షల్ ఆర్ట్స్)లో సిల్వర్ మెడల్ సాధించిన రోషిబినా దేవిది మణిపూర్‌లోని ఓ కుగ్రామం. విద్వేషం మత్తులో హింస రాజ్యమేలుతున్న మణిపూర్‌లో ఉండటం క్షేమం కాకపోవటంతో రోషిబినా దేవి ఇంఫాల్‌లో సాయ్ స్పోర్ట్స్ హాస్టల్‌లోనే ఉంటూ సాధన చేసింది. గత ఐదు నెలలుగా రోషిబినా దేవి ఇంటి ముఖం చూసిందే లేదు. ఇప్పుడు ఆసియా క్రీడల్లో పతకం సాధించినా విజయ గర్వంతో స్వరాష్ట్రం వెళ్లలేదు, పతకం సంబురం కుటుంబంతో కలిసి పంచుకోలేదు. గురువారం మహిళల వుషూ ఫైనల్లో రజతం అందుకున్న రోషిబినా దేవి.. మణిపూర్, కుటుంబం దుస్థితి తలచుకుంటూ కన్నీంటి పర్యంతమైంది. ఫైట్ ముగిసినా.. తన రెండు గ్లౌవ్స్‌తో పంచ్‌లు విసురుతూ కనిపించటం అక్కడ స్టేడియంలో ఉన్న ప్రేక్షకులను కట్టిపడేసింది.

భయం.. భయంగా బతుకుతున్నారు :

'అవును, ఇప్పుడు అక్కడ మాకు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మణిపూర్‌లో అందరూ భయం భయంగా బతుకుతున్నారు. త్వరలోనే పరిస్థితులు సద్దుమణిగి, ప్రజలు శాంతియుతంగా మెలుగుతారని ఆశిస్తున్నాను. రాష్ట్రంలో చెలరేగిన హింసతో కండ్ల ముందు అంతా కాలిపోతుండటం ఎంతో బాధగా ఉంది. నేను ఇప్పుడు అక్కడికి (మణిపూర్) వెళ్లలేను. అక్కడ ప్రజలను కాపాడుతూ, ప్రజల కోసం శ్రమిస్తున్న వారికి ఈ రజత పతకం అంకితం ఇస్తున్నాను. మణిపూర్‌లో హింస చెలరేగుతున్న సమయంలోనే నా ట్రైనింగ్ మొదలైంది. ఈ సమయంలో నేను ఇంటికి వెళ్లనేలేదు. మా నాన్న ఓసారి ఇంఫాల్‌లోని హాస్టల్‌కు వచ్చి నన్ను చూసి వెళ్లారు. పరిస్థితులు మరీ దారుణంగా మారడంతో.. రోజు మా కుటుంబంతో ఫోన్‌లో మాట్లాడవద్దని కోచ్‌లు చెప్పారు. కేవలం ఆదివారం మాత్రమే ఇంట్లో వాళ్లతో మాట్లాడేందుకు అనుమతి ఇచ్చారు. నన్ను గ్రామానికి రావద్దని మా కుటుంబ సభ్యులు చెప్పారు. ఇంఫాల్‌లోని హాస్టల్‌లో ఉండటమే సురక్షితమని, ఇంటికి రావద్దని చెప్పారు. దీంతో నేను నెలలుగా ఇంటికి దూరమయ్యాను. ఇప్పుడు ఆసియా క్రీడల్లో పతకం సాధించినా.. ఇంటికి ఎప్పుడు వెళ్తానో తెలియదు' అని రోషిబినా దేవి భావోద్వేగంతో కన్నీటి పర్యంతమవుతూ చెప్పింది.



మహిళల 60 కేజీల వుషూ ఫైనల్లో చైనా అథ్లెట్‌తో తలపడుతున్న రోషిబినా దేవి (బ్లూ కలర్)

'మణిపూర్‌లో అందరూ భయం నీడలో బతుకుతున్నారు. విద్వేషం, హింసతో నేను ఇన్నాండ్లు ఇంటికి, కుటుంబానికి దూరమయ్యాను. ఇప్పుడు ఆసియా క్రీడల్లో మెడల్ సాధించినా.. ఇంటికి ఎప్పుడు వెళ్తానో నాకే తెలియదు. మణిపూర్‌లో శాంతి కోసం పాటుపాడుతూ, ప్రజలను కాపాడుతున్న వారికి ఆసియా క్రీడల సిల్వర్ మెడల్ అంకితం చేస్తున్నాను'

- రోషిబినా దేవి

నేడు పాక్, కివీస్ వార్మప్

నవతెలంగాణ-హైదరాబాద్ : 2023 ఐసీసీ ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లు నేటి నుంచి ఆరంభం కానున్నాయి. అక్టోబర్ 5న అహ్మదాబాద్‌లో ఇంగ్లాండ్, న్యూజిలాండ్ మ్యాచ్‌తో ప్రపంచకప్ షురూ కానుండగా.. పది జట్లు నేటి నుంచి ప్రపంచకప్ ప్రణాళికల్లో మునిగిపోనున్నాయి. నేడు హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్, న్యూజిలాండ్ వార్మప్ మ్యాచ్‌లో తలపడనున్నాయి. న్యూజిలాండ్ జట్టు రెండు బృందాలుగా హైదరాబాద్‌కు చేరుకోగా.. పాకిస్థాన్ బృందం బుధవారం రాత్రి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. గణేష్ నిమజ్జనం నేపథ్యంలో గురువారం ఉదయమే పాకిస్థాన్ క్రికెటర్లు ప్రాక్టీస్ సెషన్‌కు వచ్చారు. బాబర్ ఆజామ్ సహా పాక్ క్రికెటర్లు అందరూ తొలి ప్రాక్టీస్ సెషన్లో చెమటోడ్చారు. రెగ్యులర్ కసరత్తులు, ఫీల్డింగ్ డ్రిల్స్ అనంతరం నెట్స్‌లో సాధన చేశారు. పచ్చదనంతో కనువిందు చేస్తున్న మైదానాన్ని చూసి పాక్ కెప్టెన్ సంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలిసింది. హైదరాబాద్ వాతావరణం, పిచ్ స్వభావంపై ఓ అవగాహనకు వచ్చేందుకు పాకిస్థాన్ ఆటగాళ్లు తొలి రోజు దృష్టి పెట్టారు. 2015, 2019 ప్రపంచకప్ రన్నరప్ న్యూజిలాండ్‌తో పాకిస్థాన్ వార్మప్ మ్యాచ్ నేడు మధ్యాహ్నం 2 గంటలకు ఆరంభం కానుంది. భద్రతా ఏర్పాట్ల రీత్యా నేటి వార్మప్ మ్యాచ్‌కు అభిమానులను అనుమతించటం లేదు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.